
ఆంధ్రప్రదేశ్



నర్తకి

సెప్టెంబరు 1966

30 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి: 10] సెప్టెంబరు, 1966 [సంచిక: 11

భాద్రపద-ఆశ్వీయుజ 1888 శా. శ.

ప్రధాన సంపాదకులు :
టి. రామచంద్రరావు

సంపాదకులు :
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ఈ సంచికలో

మొదటి చిత్రం : నర్తకి
ఫోటో : ఎస్. ఆర్. కె. రావు

రెండవ చిత్రం : జలమార్గం

మూడవ చిత్రం : మాతృ ప్రేమ

నాలుగవ చిత్రం : యంత్రయుగం
ఫోటోలు : ప్రధాన సంపాదకులు

* ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు.
* ఈ నెల నుండి వ్యాస భారతమును యథాతథంగా అనువదించి ధారావాహికముగా ప్రచురిస్తున్నాము.
* ఆంధ్ర ప్రదేశ్ పత్రికపై పాఠకుల అభిప్రాయాలను తెలుపగోరుచున్నాము.



"నవభారత నిర్మాణంలో భాగస్వాములమవుదాం"

స్వాతంత్ర్య దినోత్సవం, సహజంగానే మహదానంద కరమైనది. అయితే గతంలో జరిగిన లాభనష్టాలను యీ రోజున పరిశీలించుకోవాల్సిఉంటుంది. గత సంవత్సరంలో మనం చాలా గడ్డుసమస్యలను ఎదుర్కొన్న విషయం మీకు గుర్తు ఉండవచ్చు. పాకిస్తాన్ తలపెట్టిన దురాక్రమణను ఎదుర్కోవాల్సివచ్చింది. దానికితోడు చైనా బెదిరింపులు, దుందుడుకు చర్యలను కూడ మనం చవిచూచాము. అయినప్పటికీ మన సాయుధ దళాలు, ధైర్యంగా యీ పరిస్థితిని ఎదుర్కొని జాతి మన్ననలను అందుకున్నాయి. సంఘర్షణ సమయంలో ధైర్య సాహసాలను ప్రదర్శించిన సాయుధ సైనికుల నందరినీ నేను అభినందిస్తున్నాను. ప్రజలు కూడ సంఘటిత శక్తిగా నిలచి మన సాయుధ దళాలకు ఎంతో ఉత్సాహాన్ని కలిగించారు.

సైనిక సంఘర్షణకు తోడు మన రాష్ట్రంతోసహా దేశమంతా కరువు పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. వర్షాభావం కారణంగా ప్రజలు ఆహార కొరత, పంపిణీ అవకతవకలు, హెచ్చుధరలు వంటి అనేక క్లిష్ట సమస్యలను ఎదుర్కొన్నారు. ప్రజలు యీ పరిస్థితులను ఎంతో ఓర్పుతో, ధైర్యంతో ఎదుర్కొంటున్నందుకు నేను హర్షిస్తున్నాను ఈ సమయంలో స్వాతంత్రదినోత్సవ సందర్భంగా రాష్ట్రపతి యిచ్చిన సందేశాన్ని మీకు గుర్తుచేయదలచాను. క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజల కష్టాలను తీర్చడానికి వీలుగా మనమందరం సంఘటితంగా ఉండి పరస్పర సహకారం అందజేసుకోవాలని ఆయన తమ సందేశంలో అన్నారు. అయితే ఆందోళనలు, ప్రదర్శనలు, సమ్మెలు మనకు ఏమాత్రం సహాయకారి కాజాలవు. క్లిష్ట పరిస్థితులను సృష్టించే వారికి మాత్రమే అవి ఉపయోగపడతాయి. ఈ క్లిష్ట పరిస్థితులను అవగాహన చేసుకొని పరస్పరం సహాయపడడమేగాక ప్రభుత్వ కార్యక్రమాలతోకూడ సహకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ ఏడాది కూడా వర్షాలు చాల ఆలస్యంగా ఆరంభమయ్యాయి. రాష్ట్రంలో చాలా ప్రాంతాలలో తగినన్ని వర్షాలు

పడలేదు. ఎక్కడా నాట్లు పడలేదు. చెరువులకు నిండుగా నీరుఅందలేదు. అయినప్పటికీ గత సంవత్సరం పంట దిగుబడి కన్నా ఈ ఏడాది దిగుబడి ఎక్కువగానే వుండవచ్చు.

మిత్రులారా! ఇటీవలి వారాలలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మూడు చరిత్రాత్మకమైన సంఘటనలను గూర్చి కొద్దిగా నేను ప్రస్తావిస్తాను. 110 కోట్ల రూపాయల్ని మనం ఖర్చుపెట్టగా యిప్పటికి బ్రహ్మాండమైన నాగార్జునసాగర్ ఆనకట్ట ఒకదశకు చేరుకుంది. ఆగస్టు 3న కాలువల్లోకి నీటిని విడుదల చేసేస్థితికి రాగలిగాం. దీనికి కొద్దిరోజుల్లోనే మన ప్రియతమ ప్రధాని ప్రారంభోత్సవం చేయబోతున్నారు. దీనివల్ల 6½ లక్షల ఎకరాలకు సేద్యపునీరు అందుతుంది. రాష్ట్రంలో ఆహారోత్పత్తి అధికమవుతుంది. మరొక ముఖ్యమైన సంఘటన—తుంగభద్ర ఎగువ కాలువ ప్రాజెక్టుద్వారా నీటిని విడుదల చేయడం. దీనిక్రింద మనం 25కోట్ల రూపాయల్ని వెచ్చించాం. గత ఏడెనిమిదేళ్ళుగా యీ ప్రాజెక్టు నిర్మాణ కృషిలో నిమగ్నులమై వున్నాం మనం. రాయలసీమలో నీటిఎద్దడి ప్రాంతాలలో ఒక లక్షా యిరవై వేల ఎకరాలకు యిది సేద్యపు నీటిని అందిస్తుంది. ఇక మూడవ ముఖ్య సంఘటన—కొత్తగూడెం విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు పని ప్రారంభించడం. దీనిక్రింద మనం 20కోట్ల రూపాయల్ని వెచ్చించాం. కొత్తగూడెం ప్రాజెక్టు మొదటిదశగా 60 మి. వా. యూనిటు పని ప్రారంభించింది. మరొక నాలుగు నెలలలో 60 మి. వా. తో మరొక సెట్టును కూడా ప్రారంభించబోతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి కాలంలో జరిగిన కొన్నిముఖ్య సంఘటనలనుగూర్చి చెప్పాలనిపించి యివన్నీ యిప్పుడు ప్రస్తావించాను. కొద్దిరోజుల క్రిందట మన ప్రధాని ఆకాశవాణి ద్వారా చేసిన ప్రసంగాన్ని మీలో చాలామంది వినే వుంటారు. దేశంలో రోజూ ఏదో ఒక మూల ఏదోఒక అభివృద్ధి ప్రాజెక్టు రూపురేఖలు దిద్దుకుంటూనే వున్నది. అందుకు తగు ప్రతిఫలం త్వరలోనే మనకు లభిస్తుంది. ఈనాడు మనం చతుర్థ పంచవర్ష ప్రణాళికను రూపొందించుకునే ప్రయత్నంలో వున్నాం. ఈ చతుర్థప్రణాళిక అటు సాధించదలిచిన లక్ష్యాలదృష్ట్యానూ, యిటు చేయవలసిన కృషిదృష్ట్యానూ అతిగురుతరమైనది. ఈ అవకాశాన్నిమనం ఉపయోగించుకుని, అభివృద్ధి కార్యకలాపాలను పూర్తివిశ్వాసంతో, దృఢచిత్తంతో చేపట్టి, వాటి ప్రతిఫలం దేశప్రజల శ్రేయస్సుకు అందేటట్లు చేయడం మన విధి. గత పద్దెనిమిదేళ్ళుగా మనంసాధించిన అభివృద్ధిని యిప్పుడునేను విడిగా ప్రస్తావించ దలచుకోలేదు. అయినప్పటికీ ఒక విషయంమాత్రం చెప్పకతప్పదు. భారతదేశం—భారతదేశమేకాదు యావత్ప్రపంచం కూడా—ఈనాడు చాలా క్లిష్టపరిస్థితిలో వున్నది. ముందున్నది మరీ గడ్డు కాలం. మనం ఒకరికొకరం సహాయపడుతూ, పదుగురం కలిసి పనిచేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి విశ్వాసంతో అమలుపరుస్తూ వుంటేనే తప్ప సత్ఫలితాల్ని సాధించలేం.

మన ప్రజలకు సుఖశాంతులను చేకూర్చడానికై యీ దేశ పురోభివృద్ధికి పాటుపడతామని యీ శుభసమయంలో మనమంతా ప్రతిజ్ఞ పూనాలి. మీరుచేసేపని ఏదైనప్పటికీ దృఢవిశ్వాసంతోనూ, పూర్తి మనసుతోనూ పనిచేయండి. మీకందరకు సుఖశాంతులు లభించాలని, ఇతోధికాభివృద్ధి చేకూరాలని నేను ఆశిస్తున్నాను. మనమంతా కలసికట్టుగా నవభారతావనిని నిర్మిద్దాం. ఈ మహోజ్జ్వల నవభారత దేశనిర్మాణ కృషిలో మనమంతా పరస్పరసహకార, సహాయాలను అందించుకుంటూ కృషిచేద్దాం.

జై హింద్ :

(స్వాతంత్రదినోత్సవంనాడు పెరేడుగ్రౌండులో ముఖ్యమంత్రి ప్రసంగం)

మన సైన్యంలో చేరండి

సైన్యంలో చేరదలిచిన అభ్యర్థులు సికింద్రాబాదు క్లబ్బుకు ఎదుట గల బ్రాంచి రిక్రూటింగ్ కార్యాలయం (219 క్లబ్ రోడ్డు) తాలూకు రిక్రూటుమెంటు అధికారిని కలుసుకోవాలి. స్కూలు సర్టిఫికెట్లు, గుణగణాలకు సంబంధించిన సర్టిఫికెట్లు శుద్ధ ప్రతులతో పాటు హాజరుకావాలి. ఆఫీసు పనిచేసే రోజులలో ఏరోజైనా ఉదయం గం. 7_30 కు పైఅధికారిని కలుసుకోవచ్చు. అభ్యర్థుల యోగ్యతలకు సంబంధించిన వివరాలను యీదిగువ యివ్వడమైనది.

ఉద్యోగం	వయః పరిమితి	విద్యార్హతలు	శారీరక అర్హతలు
గన్నర్స్. జి.డి.	17నుంచి 21 సంలోపు	VI స్టేండర్డు. ఆపైన	ఎత్తు 5′ 3″. బరువు 105 పౌ ఛాతి 30″_32″
ఇన్ఫెంట్ సిపాయిలు	,,	విద్యార్హతలు లేకున్నా ఫరవాలేదు	,,
టెక్నికల్ అసిస్టెంటులు	,,	IX స్టేండర్డు, ఆపైన	,,
ఒ.పి. డబ్ల్యు/ఎల్ ఆర్టిలరీ	,,	,,	,,
అంబులెన్సు అసిస్టెంట్లు	,,	VI స్టేండర్డు, ఆపైన	,,
మోటారు ట్రక్కుల డ్రైవర్లు	,,	,,	ఎత్తు 5′4″, బరువు 105 పౌ ఛాతి 30″_32″
వర్కుషాపు గ్రూపు	17 నుంచి 24 సం.	ఎస్.ఎస్.ఎల్.సి/హెచ్.ఎస్.సి లో సైన్సు సబ్జెక్టులతో ఉత్తీర్ణులు కావాలి.	ఎత్తు 5′3″ బరువు 105 పౌ ఛాతి. 30″_32″
బి. పి. గ్రూపు	17 నుంచి 21 సం.	,,	,,
నర్సులు/అసిస్టెంట్	,,	,,	,,
ఎలక్ట్రిక్ ఫిట్టర్ (ఎస్)	,,	,,	,,
గుమాస్తాలు జి.డి.	17 నుంచి 27 సం.	ఎస్.ఎస్ ఎల్.సి/హెచ్.ఎస్.సి లో ఉత్తీర్ణులై వుండాలి.	,, ,,
వంటవారు (యు)	,,	విద్యార్హతలు లేకున్నా ఫరవాలేదు	,,
ఇ.బి. ఆర్ (యు)	,,	,,	,,
N.C.s. (E) స్వీపర్లు/మంగలివారు/ చాకలివారు	17 నుంచి 35 సం.	వారివృత్తిలో సమర్థులై వుండవలెను	ఎత్తు 5′1″ బరువు 105 పౌ ఛాతీ 30″_32″

'నేవీబోయ్స్' గా చేరండి

బోయ్స్ ఐ.ఎన్	15½ నుండి 16½ సం॥	IX స్టేండర్డ్‌లో ఉత్తీర్ణులై వుండాలి	ఎత్తు 5′ బరువు 90 పౌ. ఛాతీ28″_30″

డైరెక్ట్‌ఎంట్రీ నావికులుగా (హెవీరేటింగ్స్) చేరండి

స్టోర్సు అసిస్టెంట్ కమ్యూనికేషన్ సిక్ బెర్త్ అటెండెంట్ ఎలక్ట్రికల్ బ్రాంచి	17 నుంచి 20 సం.	ఎస్.ఎస్.ఎల్.సి./హెచ్.ఎస్.సి లో ఉత్తీర్ణులై వుండాలి.	ఎత్తు 5 2″ బరువు 105 పౌ ఛాతీ 30″_32″
సీమెన్	,,	IX క్లాసు, ఆపైన	,,
ఇంజనీర్_మెకానిక్	,,	,,	,,

పంచతంత్రము

టిట్టిభముల కథ చెప్పిన తరువాత దమనకుడు సంజీవకునితో "మిత్రమా! కాబట్టి పురుషుడు ఎప్పుడుకూడ స్వప్రయత్నమును విడువకూడదు" అని చెప్పెను.

సంజీ:—మిత్రమా! పింగళకుడు నాయెడల దుష్టబుద్ధిగలవాడై యున్నట్లు నే నెట్లు తెలిసికొనగలుగుదును? నేటిదాక అతడు నన్ను అనుగ్రహముతోను, స్నేహముతోను చూచుచుండెను. ఎప్పుడు కూడ నా యెదుట కోపము కనపరచలేదు.

దమ:—పింగళకుడు, ఎఱ్ఱని కన్నులతో కనుబొమలు ముడిపెట్టి, పెదవులు నాకుచు నిన్ను చూచినప్పుడు అతనికి నీపై కోపమున్నట్లు, అట్లు కానియెడల కోపములేనట్లును తెలిసికొనుము. ఇంక నేను యింటికి పోయెదను. నీవు ఈ రహస్యమును మాత్రము ఎప్పుడుగూడా బయట పెట్టకుము. నీవు ఈ చోటు విడిచిపోవదలచినచో చీకటి పడిన తరువాత పొమ్ము. బలవంతునిచే అవమాన పడినప్పుడు విదేశమైనను పోవలెను. లేదా అతని ఆశ్రయమైనను పొందవలెను. ఆత్మ రక్షణము ఆవశ్యకముకదా! అని చెప్పి కరటకుని కడకుబోయెను.

కర:—మిత్రమా! ఏమిచేసి వచ్చితివి?

దమ:—నేను సంజీవకునియందు కూటనీతి బీజమును నాటి వచ్చినాను. తర్వాత కార్యము దైవాధీనము.

కర:—ఎట్టి బీజమును నాటితివి?

దమ:—సంజీవక పింగళకులు తిరిగి కలుసుకొనకుండా ఇరువురికిని విషబీజములు నాటినాను, ఇక మీదట వారిద్దరు కలిసి యుండుటను చూడవు.

కర:—సుఖముగా, స్నేహముతో మెలగుచున్న వారిద్దరిని కోప సముద్రములో ముంచి వచ్చితివి. వారిద్దరికి ద్వేషము కల్పించుట మాత్రముతోనే తృప్తిచెందగూడదు. అపకారము చేయుట అందరికి సాధ్యమే, కాని ఉపకారము చేయుటకు చేతకాదు.

దమ:—నీకు నీతిశాస్త్రము తెలియదు కనుక ఇట్లనుచుంటివి. తండ్రితాతల కాలమునుండి వచ్చిన మన మంత్రి పదవిని సంజీవకుడు అపహరించెను. కనుక అతడు మనకు శత్రువు. నేను అతనికి అభయమిచ్చి మన రాజు కడకు చేర్చితిని. అట్టి నన్నే మంత్రి పదవినుండి తొలగించి తాను దానిని ఆక్రమించినాడు. కనుక అతనిని చంపుటకుగాను నేను ఈ ఉపాయమును పన్నితిని. లేదా అతడు ఈ దెబ్బతో దేశత్యాగమైనను చేయును! ఈ రహస్యము నీకు తప్ప ఎవరికిని తెలియదు. ఈ కార్యమంతయు స్వార్థసాధనకై చేసితిని.

ఒకవేళ అతడు మన స్వామి చేత చచ్చెనా, మనకు తృప్తిగా భోజనము లభించును. ఇదికాక వైరమును సాధించుటయే. మనకు మంత్రిత్వము, తృప్తి రెండును లభించును. సంజీవకుని నాశనము వలన మనకు మూడు లాభములు కలుగుచుండగా మూర్ఖునివలె నన్నేల నీవు దూషించెదవు. పండితుడు శత్రువును నశింపజేసి స్వార్థమును సాధించికూడ ఏమియు ఎరుగనివానివలె రహస్యముగా పూర్వము వనమునందు చతురకునివలె మెలగవలెను.

కర:—అది యెట్లు? ఆ కథ చెప్పుము.


దమ:—ఆ కథ యిట్లు చెప్పదొడగెను:—

ఒకానొక వనమునందు 'వజ్రదంష్ట్రము' అను సింహము ఉండెను. అతనికి 'చతురకుడు' అను నొక నక్క, 'క్రవ్యముఖుడు' అను నొక తోడేలు భృత్యులై యుండిరి. ఒకనాడు ఆ వనమునందు ఒక ఆడు ఒంటె కనబడెను. అది ప్రసవ వేదనతో తన మందనుండి విడిపోయి దారితప్పి యా వనమును చేరి యుండెను. దానికి ప్రసవ సమయము ఆసన్నమై యుండెను. సింహము దానిని చంపి పొట్ట చీల్చి ఒంటె పిల్లను కాపాడి ఒంటె మాంసమును తృప్తిగా అందరికి పెట్టి తాను భుజించెను. ఒంటె పిల్లను ఇంటికి తెచ్చి, "నీకేలాటి ప్రాణభయములేదు. స్వేచ్ఛగా ఈ వనములో సంచరించుచు మాతో చనవుగా నుండుము. నీ చెవులు శంకువులవలె నున్నవి కనుక నీకు 'శంకుకర్ణుడు' అను పేరు పెట్టుచున్నాను." అని చెప్పెను.

ఆ నలుగురును కలిసి వనములో ఇష్టాగోష్ఠి జరుపుచు విహరించుచుండిరి. పెద్దవాడైన పిదపకూడ శంకుకర్ణుడు ఒక్క క్షణమైనను సింహమును విడిచి యుండలేకుండెను. ఇట్లుండగా నొకప్పుడు వజ్రదంష్ట్రునికి మదించిన ఒక వనగజముతో యుద్ధము ప్రాప్తించెను. గజము మదబలముచేత సింహమును దంతముతో కొట్టి గాయపరిచెను. దానిచే సింహము కదలలేక పడియుండెను. అప్పుడు ఆకలితో బాధపడుచు సింహము సహచరులతో:—

"ఓయీ! ఎక్కడైనను ఒక జంతువును వెతకితెండు. దానిని చంపి నేను, మీరు ఆకలిబాధ తీర్చుకొందము." అని అనెను. ఆమాట ప్రకారము ఆ ముగ్గురు జంతువుకొరకు ఆ సంధ్యాకాలమువరకు వనమంతయు వెతకిరి. కాని ఒక్క జంతువు కూడ దొరకలేదు. అప్పుడు చతురకుడు:—

"శంకుకర్ణుని చంపినచో అందరికిని కొన్ని దినములవరకు ఆహారము తృప్తిగా లభించును. కాని యితడు మిత్రుడు, కనుక



ప్రభువు ఇతనిని చంపడు. నా బుద్ధిప్రభావముచే ప్రభువునకు దుర్బోధచేసి యితనిని చంపించెదను.'' అని చింతించి శంకుకర్ణుని జూచి.

చతు:—మిత్రమా! ప్రభువు ఆహారములేక అలమటించుచున్నాడు. అతడులేని నాడు మనకు గూడ నాశనముసిద్ధము. ప్రభువు కొరకై ఒక మాట చెప్పెదను."

శంకు:—చెప్పుము. సందేహములేక వెంటనేచేసెదను. ప్రభువు హితముకొరకు చేయుసేవ అతి పుణ్యకరము.

చతు:—మిత్రమా! స్వామి నీ శరీరము ద్విగుణీకృతము చేయును. ఒక శరీరము అతనికి ఆహారముగా నిమ్ము.

శంకు:—ఓ! అట్లేచేసెదను. నీవు ప్రభువునకు చెప్పుము. కాని యిందులో ధర్మదేవత సాక్షిగా నుండగలదు.

ఆ మాటప్రకారము అందరుకలిసి సింహమువద్దకు పోయి సింహముతో:—

చతుర:— దేవా! వనములో ఏ జంతువుగూడ లభించలేదు. సూర్యుడస్తమించినాడు. మీరు ఈ శంకుకర్ణునికి ద్విగుణముగా శరీరమును ప్రసాదించినచో ఒక శరీరమును మీకు ధర్మదేవత సాక్షిగా ఇవ్వగలడు.

సింహము:—అట్లైన బాగున్నది. ఈ వ్యవహారమునకు ధర్మమును సాక్షిగాచేసి అట్లేచేయుడు.

సింహముమాటవిని నక్క, తోడేలుకలిసి ఒంటెఉదరమును చీల్చెను. దానితో అదిచచ్చెను. అప్పుడు సింహము చతురకునితో,

"ఓయీ! నేను నదికిపోయి స్నానము, దేవపూజ చేసికొని వచ్చెదను. అంతదాక మీరు దీనిని కాపాడుచుండుడు.'' అని చెప్పి నదికిపోయెను. అప్పుడు చతురకుడు,

"నా ఒక్కనికే యీ ఒంటె ఏల ఆహారము కాకూడదు?'' అని తలచి క్రవ్యముఖముతో:—

"ఓయీ! నీవు ఆకలిగొన్నావు. ప్రభువు వచ్చులోపల నీవు ఈ ఉష్ట్రి మాంసమును భక్షింపుము. నీవు దోషివికావని ప్రభువు కడ ఋజువుచేసి చెప్పెదను" అని అనెను.

(మిగతా 8వ పేజీలో)

లేపాక్షి

ఎమ్. బాలవిశ్వనాథశర్మ

ఆనాడు అచ్యుతదేవరాయలు విజయనగర సార్వభౌముడు. ఆ కాలంలో విరుపణ్ణ పెనుగొండ మండలేశ పదవిని నిర్వహించే వాడు. ఇతని సోదరుడు వీరణ్ణ. వీరి తల్లిదండ్రులు ముద్దమ్మ, నంది లక్కిశెట్టి. వీరు వీరశైవులు. చిన్నతనము నుండి విరుపణ్ణకు శిల్ప, వాస్తు, చిత్రలేఖనాది విద్యలందు మక్కువ ఎక్కువ. ఒకనాడు విరుపణ్ణ తన స్వగ్రామమైన లేపాక్షికి రాచకార్యముల మీద వచ్చాడు. అక్కడ పాపనాశేశుని అర్చించి ఆ రాత్రి నిదురించాడు. నిద్రలో మహోజ్జ్వల శిల్పాలు అతనికి స్వప్నగతములై సాక్షాత్కరించాయి. అంతటి అర్ధరాత్రిలోనే వర్షపురాత్రి అనికూడ లెక్కింపక ఒంటరిగా బయలుదేరాడు. లేపాక్షి గణికాగ్రేసరుడైన చాటుకూరి బసవణసోమయాజి అతనిని అనుసరించి వచ్చాడు.

ఇంతలో మరొక వ్యక్తి ఆ వర్షములో తడుస్తూ వీరికి ఎదురయ్యాడు. ఆ వ్యక్తి చోళరాజ్యాస్థాన ప్రధానశిల్పి. కళాతృష్ణ తీరక దేశదేశాలు సంచరిస్తూ లేపాక్షికి వచ్చాడు. అదేరాత్రి అతనికికూడ కళాస్వరూపం మధురాతి మధురంగా కచ్ఛపాద్రిపై గోచరించింది. ఇతనూ కచ్ఛపాద్రికి ఒంటరిగ వచ్చినవాడే ఆరాత్రి వర్షంలోనే విరుపణ్ణకు శిల్పికి ప్రథమ దర్శనం జరిగింది. దేవాలయాలను నిర్మింప సంకల్పించు కొన్న విరుపణ్ణ అదే శుభముహూర్తమని పని ప్రారంభింప చేస్తాడు.

సలకం తిరుమలరాజు అచ్యుతదేవరాయలకు బావమరది. ఇతడు మహాదుర్మార్గుడు. విజయనగర రాజకీయాల్లో ఇతడు ప్రవేశించి బాగా పలుకుబడి సంపాదించుకొన్న రోజులవి. క్రీ. శ. 1535 ప్రాంతమది. అళియరామరాయలు అచ్యుతదేవ రాయల అన్న కుమారుడైన సదాశివరాయలను విజయనగర సింహాసనం అధిష్ఠింప జేస్తాడు. ఈ కల్లోలంలో భుజంగ భూపతి విరుపణ్ణపై లేనిపోని అపవాదులుమోపి పెనుగొండ మండలేశ పదవిని చేజిక్కించుకొనిఉంటాడు. ఇతనికి జాఫర్ కుడిభుజం. ఇతడొక దళపతి. జాఫర్‌కు బుద్ధిహీనుడైన కాళయ్య నమ్మిన బంటు.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో రంజకం కుప్పాయమ్మ విజయనగర ఆస్థాన నర్తకి. ఈమెకు ఒక్కగానొక్క కూతురు సుధామయి. అందచందాలకు పుట్టినిల్లు. మంజులనాట్యగాన చతుర. ఈ కళామయి కనుచూపులు యువకులకు సంకెలలు. ఈ మూర్తి విధాతృ సృష్టిలో కుంఠితముకాని మన్మథాస్త్రమన్నచాలు. ఈమెకు చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. రాజకీయాలు విషమించిన ఆ రోజుల్లో ఈమె విజయనగరం వదలి పెనుగొండలో సామాన్య దేవదాసిగ పద్మిని అను మారుపేరుతో ప్రవేశించి ప్రశాంతముగ కాలం గడుపుతూ ఉంటుంది. ఆమెను పనికట్టి పట్టి తెప్పించమని భుజంగ భూపతి జాఫర్‌ను పంపిస్తాడు. జాఫర్ కాళయ్యను నియమిస్తాడు. కాళయ్యబారినుండి తప్పించుకొనుటకు పద్మిని ప్రయత్నిస్తూ ఉండగా పెనుగొండ వీధిలో మాజీ సి.పాయిని మల్లయ్య, దుర్గయ్యలు ఆమెను గుర్తించి విడిపించి ఆమెను లేపాక్షికి పురుషవేషంలో పంపిస్తారు. లేపాక్షిలో విరుపణ్ణ స్వధనాన్ని ప్రజాసహకారాన్ని ముందుంచుకొని దేవాలయ నిర్మాణాన్ని సాగిస్తూనే ఉంటాడు. విరుపణ్ణ కోరికపై మహాశిల్పి అనంత శిల్ప రచన చేస్తూ ఒక అపూర్వ నాట్యభంగిమలో సాలభంజికా రూపాన్ని చిత్రించుతాడు. అయినను విరుపణ్ణ మెప్పు పొందక వ్యధపడుతూ ఉంటాడు. సరిగా అదేసమయానికి అతని కక్కడ పురుష వేషంలో సుధామయి కన్పిస్తుంది. ఆమెలో కన్పడిన అనన్య సామాన్యమైన అపూర్వ సౌందర్యం పురుషులలో అసంభవ మనుకొని చూచి తృప్తి పడుటకై స్త్రీవేషాన్ని ధరించమంటాడు. బ్రతిమాలగా చివరకామె వొప్పుకొని వెళ్ళిపోతుంది. దుర్గయ్య, మల్లయ్య లేపాక్షికి వచ్చి సదాశివరాయ సార్వభౌములు పెనుగొండ చూడవస్తున్నారని, చెపుతూ ప్రసంగ వశమున శిల్పితో, ఆ పురుష వేషంలో ఉన్నది సుధామయేనని కూడ వెల్లడిస్తారు. శిల్పి ఫణీంద్రుడు ఏడుపడగలు విప్పి విశ్వేశ్వరుని ఆరాధిస్తున్నట్లు ఒక మహాశిల్పమును సంతరించుచూ ఆ శిలప్రమాద వశమున భగ్నముకాగా బాధపడుతూ ఉంటాడు. సుధామయి మధుర గానం అతని మనోవ్యధను తుడిచివేసి మరల కర్తవ్యమున నిమగ్నుణ్ణి చేస్తుంది. విరుపణ్ణ సాలభంజికారూపంలో సుధామయి ప్రతిరూపాన్ని చూచి ఆమెకు స్వాగతం చెప్పటానికి వెళ్ళిపోతాడు.

సదాశివరాయల గౌరవార్థమై అతని దర్బారు నలంకరింపడంలో భుజంగ భూపతి జాఫర్ సహకారంతో స్వయముగ శ్రద్ధ వహిస్తూ ఉంటాడు. ఆ సమయంలో కాళయ్య ప్రవేశించి సుధామయి గోరంట్ల దగ్గర కోనేట్లోదూకి ఆత్మహత్య చేసుకుందని, ఆమె కట్టుకున్న చీర ఆనవాలుగ చూపుతూ చెపుతాడు. భుజంగ భూపతి చిర చిర లాడుతూ కాళయ్యను నిందిస్తాడు.

సదాశివ రాయలు దర్బారుమందిరం ప్రవేశిస్తాడు. భుజంగ భూపతి జాఫర్ విరుపణ్ణపై సార్వభౌమునికి ఉన్నవీ లేనివీ చెపుతాడు. విరుపణ్ణ రాజధనం అపహరించాడని, శిల్పి శత్రు రాజ్యగూఢచారని, గుడికట్టేనెపంతో కోట కట్టుకుంటున్నారని, ప్రజలను రెచ్చగొట్టి తిరుగుబాటు చేయిస్తున్నాడని చెప్పి విరుపణ్ణపై రాజుకాగ్రహం తెప్పిస్తారు. సార్వభౌముడు నేరవిచారణచేయుటకు శిల్పిని, విరుపణ్ణను పిలిపించేటంతలో విరుపణ్ణయే స్వయముగ రాజదర్శనానికి వస్తాడు. ఇంతలో భూపతి లేపాక్షి ప్రజలపై అకారణంగ తుపాకిలు ప్రేల్పించి, ఈ పనిగూడ విరుపణ్ణ సైనికులే చేసినారన్న అభియోగాన్ని మోపుతాడు. సార్వభౌములు స్వయముగ విచారణచేయుట కవకాశమివ్వక తానే విరుపణ్ణను రాజద్రోహిగ నిర్ణయించి ముందే సృష్టించిన శిక్షాపత్రంలో జాఫర్‌చేత రాజముద్ర వేయిస్తాడు. ఇంతలో బసవణ

సోమయాజి, శిల్పి, దుర్గయ్యలు ప్రవేశించి తాముస్వయముగ లేపాక్షికివచ్చి విషయములను పరిశీలింప వలయుననీ, అంతదనుక శిక్షను అమలు చేయ వదని ప్రార్థిస్తారు. సదాశివరాయలు వెంటనే లేపాక్షికి బయలుదేరుతారు. సార్వభౌములు లేపాక్షికి వెళితే తనకు ప్రమాదమని గుర్తించి భూపతి ఆజ్ఞాపత్రమును చూపించి విరుపణ్ణను తీసుకురమ్మని కాళయ్యను నియోగిస్తాడు

ధ్యానమగ్నుడైన విరుపణ్ణను ఇద్దరు సైనికులు పట్టు కుంటారు. కాని వారు విరుపణ్ణ కాలంలోని సైనికులు కావడంచేత విరుపణ్ణకు భుజంగ భూపతి దుర్మార్గుడనిచెప్పి ఆజ్ఞాపత్రాన్నిచూపి చించివేయుచుంటారు. రాజముద్రా చిహ్నితమైన పత్రాన్నిచూచి శిరమునుండి బలాత్కారముగ తన కను గ్రుడ్లను పెరికి పైకి గోడ మీదికి విసరుతాడు. రక్తాంకితములైన ఆ చిహ్నాలినాటికి ఆ దేవాలయకుడ్యాలపై కన్పిస్తాయి. ఇంతలో సుధామయి అక్కడకువచ్చి ఆజ్ఞాపత్రాన్ని చదువుకొని వాపోతుంది. అదేసమయానికి సార్వభౌముడు, పాటుకూరు బసవణ సోమయాజి, శిల్పి లేపాక్షికి వస్తారు. ఈ దృశ్యం చూచి సదాశివరాయలు పశ్చాత్తాప పడతాడు. సుధామయిని విజయనగరాస్థాన ప్రధాన నర్తకిగా సార్వభౌములు నియమిస్తే ఆమె నిరాకరిస్తుంది. జీవితావశేషం విరుపణ్ణకు సేవచేస్తూ గడుపుతానంటుంది. రాయలు అసంపూర్ణంగాఉన్న లేపాక్షి ఆలయ నిర్మాణాన్ని సంపూర్ణంచేయమని శిల్పినికోరుతాడు. విరుపణ్ణ చూడలేడుగాన, అతడుచూడని శిల్పకల్పనం నేనుచేయజాలననిచెప్పి మహాశిల్పి నిష్క్రమిస్తాడు. త్యాగమయములైన ఈ విచిత్ర సన్నివేశములనుచూస్తూ మనసు మార్చుకొన్న భుజంగ భూపతి ఆత్మహత్య చేసుకోబోతాడు. అంతశ్శుద్ధిలేని ఆత్మహత్య నిష్ప్రయోజనమనిచెప్పి బసవణసోమయాజి భూపతిని నివారిస్తాడు. ఈ విలయనాటకానికి అంతు ప్రసాదించమని పాపనాశకుణ్ణి ప్రార్థించుటకై విరుపణ్ణ నిష్క్రమించటంతో ఈ నాటక పరిసమాప్తం అవుతుంది.

విరుపణ్ణ లేపాక్షి అయినాడు. నాటినుండి నేటివరకు లేపాక్షి అసంపూర్ణంగా నిలచిపోయింది. ఈ లేపాక్షి అపూర్వ కళావైదుష్యానికి నికషోపలం. కళానందనమున పరబ్రహ్మాను సంధానము చేసిన త్యాగమూర్తి విరుపణ్ణకు లేపాక్షి పుట్టినిల్లైనది.

(6వ పేజీ తరువాయి)

ఆ ప్రకారమే తోడేలు కొంచెము మాంసము తినలోపల సింహము వచ్చుచుండుటను చూచి చతురకుడు క్రవ్యముఖునితో:–

"ప్రభువు వచ్చుచున్నాడు. దూరముగా నిలుచుండుము. అతడు నిన్ను అనుమానించ గలడు.'' అని చెప్పెను.

సింహము వచ్చి చూచుసరికి ఒంటె గుండెకాయ కనబడ లేదు. ''ఎవడురా ! దీనిని ఎంగిలిచేసినవాడు. వానినిగూడ చంపెదను" అని గద్దించి అడిగెను. అప్పుడు తోడేలు నక్కను చూచెను. అప్పుడు చతురకుడు నవ్వుచు క్రవ్య ముఖుముతో:– "నామాట లక్ష్యము చేయక యీ మాంసముతిని యిప్పుడు బ్రతిమాలుచు నాముఖము చూచెదవా ? ఈ అపరాధమునకు ఫలమును అనుభవించుము." అని చెప్పెను.

అదివిని క్రవ్యముఖుడు ప్రాణ భయముచేత దూరముగా పారిపోయెను.

ఇంతలో ఆ మార్గము గుండా ఒంటెల వ్యాపారులు, ముందున్న పెద్దఒంటె మెడలో ఒక పెద్దగంట కట్టి వచ్చుచుండిరి. ఆ గంట ధ్వనివిని సింహము నక్కతో ''ఎక్కడిది ఈ అపూర్వ ధ్వని ? అతి రౌద్రముగా వినపడుచున్నది. తెలిసికొనుము" అని అనెను.

ఆమాటప్రకారము నక్క వనములోకిపోయి తొందరగా తిరిగివచ్చి–

చతు :—"స్వామీ ! చేతనైనచో త్వరగా ఇక్కడినుండి దూరముగా పారిపొమ్ము.''

సింహ :—నన్నెందుకు వ్యాకులపరచెదవు ? సంగతి యేమో చెప్పుము.

చతు :—ధర్మరాజు నీపై కోపముతో వచ్చుచున్నాడు. నీవు అన్యాయముగా తన భృత్యుడైన ఒంటెను చంపితివట. నీపై పగ తీర్చుకొనుటకు ఇదేవచ్చుచున్నాడు. ఆయన వెంట ఒంటె బంధువులు, తండ్రితాతలు అందరుగూడ వచ్చుచున్నారు.

సింహము దూరమునుండియే వారిచూచి చచ్చిన ఒంటెను విడిచి ప్రాణభయముచేత పారిపోయెను.

చతురకుడు మెల్లమెల్లగా ఉష్ట్రమాంసమును తృప్తిగా భుజించెను.

అందువల్ల "పరుల నాశముతోపాటు స్వార్థమునుగూడ బుద్ధిమంతుడు చతురకునివలె నెరవేర్చుకొనును" అని చెప్పితిని అని దమనకుడు కరటకునితో చెప్పి వెడలిపోయెను.

ఆ తర్వాత సంజీవకుడిట్లు చింతించెను.

(సశేషము)

మహాభారతము

తిప్పగంతుల లక్ష్మణ శాస్త్రి

శ్లో॥నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్॥

నరనారాయణులకు, సరస్వతీదేవికి, వ్యాసభగవానునికి నమస్కరించి 'జయము' అను పేరుగల మహాభారతమును పఠించవలెను.





పూర్వము నైమిశము అను అడవియందు శౌనకుడు అను మహాముని యితర మునులతోగలిసి పన్నెండు సంవత్సరములు 'సత్ర' యాగమును చేయుచుండెను. అచ్చటికి ఉగ్రశ్రవుడు అను మహాముని వచ్చెను. అతడు అన్ని పురాణములను ఇంపుగా చెప్పగలడు. అతనిని చూచి అచ్చటి మునులు, హృద్యము, అపూర్వము, సమస్తజ్ఞానదాయకము, పాపములను పోగొట్టునదియు నగు కథను చెప్పుమని మిక్కిలి శ్రద్ధతో ప్రార్థించిరి. ఆమునులకు నమస్కరించి ఉగ్రశ్రవుడు వారుకోరిన మహిమలుగలది మహా భారత గ్రంథము గనుక భారతకథ చెప్పుటకు ఆరంభించెను.

పూర్వము పరీక్షిత్తుకొడుకు జనమేజయుడు సర్పయాగము చేసెను. ఆ సమయమునందు వ్యాసకృత మహా భారతకథను వైశంపాయనుడు జనమేజయునకు చెప్పుచుండగా నేను వింటిని. విని కౌరవ, పాండవులకు యుద్ధముజరిగిన పవిత్ర కురుక్షేత్రమును సందర్శించి మిమ్ముచూచుటకు ఇక్కడికి వచ్చితిని. మీరు బ్రహ్మజ్ఞానులు, మహాయోగులు. నన్ను కథచెప్పుమని యడుగుట నాభాగ్యము. సావధానులై వినుడు.

మహా భారతము సమస్త వేదముల సారము. దీనిని వినుట చేత ప్రజల కోర్కెలు నెరవేరగలవు. సర్వపాపములను ఇది హరించును. ఇహపర సుఖములను కలుగ జేయును. ప్రపంచమునందలి కవులందరికి కథలను ప్రసాదించును. కవితకు మూలము. వేదవ్యాసుడు గణపతిని లేఖకుడుగా నియమించుకొని లక్ష శ్లోకములుగల యీ భారతమును రచించెను. తొలుత తన కొడుకగు శుకునకు చెప్పెను. తరువాత ఈ కథను నారదుడు దేవతలకు, దేవలుడు పితృదేవతలకు, శుకుడు గంధర్వాదులకు, సుమంతుడు నాగదేవతలకు, వైశంపాయనమహాముని జనమేజయ మహారాజునకు చెప్పిరి. ఆ కథనే యిప్పుడు మీకు చెప్పుచున్నాను. అని సూతుడు మహా భారతకథ చెప్పదొడగెను.

పరీక్షిత్తుపుత్రుడు జనమేజయుడు కురుక్షేత్రమునందు సోదరులతో సత్రయాగమునుచేయుటకు ఆరంభించెను. అతనికి శ్రుతసేనుడు, ఉగ్రసేనుడు, భీమసేనుడు అని ముగ్గురు సోదరులు ఉండిరి. వారు ఆ యాగశాలలో నుండగా ఒక శునకము యజ్ఞశాల లోనికి వచ్చెను. అది దేవలోక శునకియగు సరమయొక్క కొడుకు. ఆ ముగ్గురు సోదరులు దానిని కొట్టిరి. అది యేడ్చుచు తల్లి వద్దకుపోయెను. ఎందుకు ఏడ్చుచున్నావు ? ఎవరు కొట్టిరి? అని తల్లి అడిగెను. జనమేజయుని తమ్ములు కొట్టిరి అని శునకము అనెను. నీవు తప్పు చేసి యుందువు. వారుకొట్టిరి అని తల్లి యనెను. నేను అపరాధము చేయలేదు చివరకు యజ్ఞహవిస్సును గూడ చూడలేదు, తినలేదు. అని ఆసారమేయము చెప్పెను. అది విని తల్లి మిక్కిలి కోపముతో ఆ సత్రయాగ శాలకు పోయెను. నిరపరాధియగు నాకొడుకును ఎందుకు కొట్టితిరి? అని అక్కడివారిని అడిగెను, వారు ఏమియు బదులు చెప్పలేదు, అప్పుడు, "అపకారము చేయనివానిని మీరు అన్యాయముగ కొట్టితిరి. కాబట్టి మీకుగూడ తలవని తలంపుగా భయముకలుగునుగాక" అని సరమ శాపమిచ్చెను. ఆమాటకు జనమేజయుడు మిక్కిలి దుఃఖపడెను. యాగము ముగిసిన తరువాత తనరాజధానియగు హస్తినాపురమునకు తిరిగి పోయెను. సరమ యిచ్చిన శాపము శాంతించుటకు హోమాదికర్మలు చేయదలచెను. దానికి తగిన పురోహితుని కొరకు వెతకుచుండెను. అతనిద్వారా తన పాపమునకు శాంతి కర్మను జరిపింప దలచెను.

ఒకనాడు వేటకై జనమేజయుడు అడవికిపోయెను. అచ్చట ఒక ఆశ్రమమును చూచెను. అందులో 'శ్రుతశ్రవుడు' అను





నొక మునీశ్వరుడు ఉండెను. ఆయన కొడుకు 'సోమశ్రవుడు'. అతడు అక్కడ తపస్సు చేయుచుండెను. శ్రుతశ్రవునివద్దకు పోయి జనమేజయుడు తన బాధ తెలిపి తనకు పురోహితునిగా ఆయన కొడుకు సోమశ్రవుని పంపుమని వేడెను. అప్పుడాముని "సోమశ్రవుడు సర్పము గర్భమునుండి నాకు పుట్టినవాడు. ఇతడు మహా తపస్వి. వేదాధ్యయనము చేసినవాడు. పరమ శివుడు ప్రయోగించినదానిని తప్ప ఇతర సంహారక దేవతల నన్నిటిని శమింపజేయగలడు. కాని, యితనికొక వ్రతముకలదు. ఎవరైన బ్రాహ్మణుడు వచ్చి యితనినేమైన వేడినప్పుడు ఇతడు దానిని తప్పక ఆతనికి ఇచ్చును. ఇది నీకు సమ్మతమయినచో ఇతనిని పురోహితునిగా తోడుకొని పొమ్ము." అని చెప్పెను. ఆ మాటకు అంగీకరించి జనమేజయుడు ఆ మునికుమారుని వెంట బెట్టుకొనిపోయి ఆతని వ్రతము సంగతి తన తమ్ములకు గూడ తెలిపెను. వారును దానికి అంగీకరించిరి. సోమశ్రవుడు వారిచే పూజింపబడుచు హస్తినాపురిలో నుండెను.

ఇది యిట్లుండగా, పూర్వము ధౌమ్యుడు, అను నొక ఋషి యుండెను. అతని దంతములు లోహమయములు కనుక అతనికి 'అయోదుడు' అను ప్రసిద్ధి యుండెను. అతనికి "ఉపమన్యుడు, ఆరుణి, వేదుడు" అని ముగ్గురు శిష్యులుండిరి. వరి చేల మళ్లలో నుండి నీరు బయటికి పారకుండ అడ్డకట్ట వేయుమని ఆరుణిని ధౌమ్యుడుపంపెను. అతడు పోయి ఆ కేదారఖండమునకు కట్ట వేయలేకపోయెను, యోచించగా నతనికి ఒక ఉపాయము తోచి తానే దానికి కట్టగా పండుకొని యుండెను. ఆరుణి తిరిగి రాకుండుటను చూచి ధౌమ్యుడు శిష్యులతో పోయి ఆరుణిని పిలిచెను. అతడు మడిని విడిచివచ్చెను. జరిగిన సంగతి గురువుకు తెలిపి మీ పిలుపు విని కేదార ఖండమును విదారించి (చీల్చి) వచ్చితిని, ఏమి ఆజ్ఞ? అని అనెను. మడిని విదారించి వచ్చుటచేత గురువు అతనికి 'ఉద్దార(ల)కుడు' అని పేరుపెట్టెను. "నా ఆజ్ఞను నెరవేర్చితివి కనుక నీకు సమస్త శ్రేయస్సులు కలుగుగాక. అన్ని వేదశాస్త్రములు నీకు స్ఫురించుగాక." అని గురువు ఆశీర్వదించి అతనిని పంపెను.

తరువాత ధౌమ్యాచార్యులు "ఉపమన్యుడు" అను శిష్యుని గోవులను కాచుచుండుమని ఆజ్ఞాపించెను. అతడు పగలెల్ల అడవిలో గోవులవెంట తిరిగి సాయంకాలము వచ్చి గురువుకు నమస్కరించుచుండెను. ఒకనాడు గురువు అతనితో 'నీవు పగలెల్ల అడవిలోనుందువు. ఏమి తినకున్నను పుష్టితో బలసియే యునావు. కారణమేమి!" అని అడిగెను. 'నేను భిక్షావృత్తి చేయుచున్నాను' అని శిష్యుడనెను. 'భిక్షాన్నము తెచ్చి నాకు ఇమ్ము' అని గురువాజ్ఞాపించెను. ఇట్లు కొన్నాళ్లు గడపగా ఉపమన్యుడును పూర్వమువలెనే బలసియుండుట చూచి గురువు 'నీవు అన్నమును తినక నాకే యిచ్చుచుంటివి. ఐనను పుష్టితోనే ఉన్నావు. కారణమేమి" అని అడిగెను. "నేను అన్నము మీకిచ్చినతర్వాత రెండవసారి భిక్షమునకుపోయి అన్నమును తెచ్చి తినుచున్నాను" అని శిష్యుడనెను. "అట్లు రెండవసారి నీవు భిక్షమునకు పోకూడదు. ఇతర విద్యార్థుల వృత్తికి, భంగము కలిగించు చున్నావు" అని గురువు నియమించెను. తిరిగి కొన్నాళ్లకు గురువు నీవు అన్నము తినకున్నను బలసియే యున్నావు. కారణమేమి అని యడిగెను. నేను అడవిలో గోవుల పాలు త్రాగుచున్నాను' అని శిష్యుడనెను. దానికి గురువు 'నాకు నివేదించకుండ పాలు నీవు త్రాగకుము, అని ఆజ్ఞాపించెను. మరి కొన్నాళ్లకు ఉపమన్యుడు పూర్వములాగే బలసియుండుట చూచి గురువు "ఇప్పుడేమి తినుచున్నావు?" అని అడిగెను. దానికి శిష్యుడు దూడలు పాలు ఎక్కువ త్రాగి క్రక్కిన నురుగును త్రాగుచున్నాను" అనెను. అదివిని గురువు 'దూడలు నీయందు దయచేత యెక్కువ పాలు త్రాగి నీకొరకు క్రక్కుచున్నవి. వాటి ఆహారమునకు ఆటంకమును కలిగించుచున్నావు. కనుక నీవు





నురుగు గూడ త్రాగకూడదు, అనెను. అతడు మరునాటినుండి గుర్వాజ్ఞచే నేమియు తినక ఆకలిబాధకు తాళలేక అడవిలో జిల్లేడు ఆకుయిఱిని ఆకలి మాన్పుకొనుచుండెను. మిక్కిలి తీక్ష్ణములు, కటుక్షారములు నైన జిల్లేడాకులు తినుటచే కడుపులో ఉష్ణముపేరి కన్నులు పోయి అంధుడాయెను. అడవిలో తిరుగుచు ఉపమన్యుడు ఒక పాడుపడిన నూతిలో కన్నులు గానకపడెను. అతడు రాకుండుటను చూచి గురువు చింతించి శిష్యులతో అతనిని వెతకుచు అడవికి పోయి బిగ్గరగా శిష్యుని పిలిచెను. శిష్యుడు బదులుచెప్పి తన అవస్థను గురువుకు తెలిపెను. 'అశ్వినీ దేవతలను స్తుతించుము, వారు నీకు కన్నులు ప్రసాదించగలరు.' అని గురువు చెప్పెను. ఆ ప్రకారమే అతడు దేవ వైద్యులైన అశ్వినీ దేవతలను అనేక విధముల స్తోత్రము చేయగా వారు ప్రసన్నులై యితనికడకు వచ్చి, ఒక అపూపము (భక్ష్యము)ను ఇచ్చి తినుమనిరి. గుర్వాజ్ఞ లేక తిననెనెను. 'మేము నీ గురువుకిచ్చిన భక్ష్యమును, అతడు తన గురువుకు తెలుపకయే తినెను. నీవు గురువుకేల నివేదించవలెను 'తినుమనిరి.' ఏమైనను సరే. నేను మాత్రము గురువుకు నివేదించక తిననెనెను. దానికి వారు సంతుష్టులై 'నీ గురువుకు ఇనుప దంతములున్నవి, నీకు స్వర్ణ దంతముల నిచ్చితిమి. కన్నులిచ్చితిమి. నీకు సర్వ శ్రేయములు కలుగుగాక' అని ఆశీర్వాదించి పోయిరి. కన్నులువచ్చిన ఉపమన్యుడు నూతిలోనుండి బయటికివచ్చి గురువుకు నమస్కరించగా ప్రసన్నుడై గురువు సర్వ విద్యలు అతనికి వచ్చునట్లు వర ప్రసాదము చేసెను.

తరువాత ధౌమ్యుడు, "వేదుడు" అను మూడవ శిష్యుని కూడ పరీక్షింపదలచి అతడు గురుకులములోనే గురుసేవ చేయుచుండునట్లు ఆజ్ఞాపించెను. అతనిపై అన్ని కార్య భారములు వైచెను. ఎండ, గాలి, వాన, ఆకలి, దప్పి, దుఃఖము అన్ని సహించి పశువువలె ఆతడు గురుశుశ్రూష చేయుచుండెను. దానికి గురువు సంతుష్టుడై అతనికి సర్వవిద్యలు ప్రసాదించి యింటికి పంపెను.

గురువుపని అతి అల్పమైనను దేహత్యాగమును గూడ లెక్క చేయక నెరవేర్చవలెను అని ఉద్దాలకుని కథవలనను, గురువు నిషేధించినప్పుడు, అతి ఆవశ్యకమైన ఆహారమునుగూడ విడువ వలెనని ఉపమన్యుని కథవలనను, తగనిపనులు గురువు చేయుమన్నను అది గురువు అనుగ్రహముగా భావించి శీతోష్ణాదులను సహించి గురుసేవ చేయవలెనని 'వేదుని కథవలనను తెలియుచున్నది.

గురువు ఆజ్ఞ తీసికొని వేదుడు తనయింటికి పోయెను. అతనికి ముగ్గురు శిష్యులుండిరి. గురుకుల వాసక్లేశమును అనుభవించినవాడు కనుక వేదుడు తన శిష్యులను స్వేచ్ఛగా విడిచెను. బాధించ కుండెను.

కొంత కాలమునకు పౌష్యుడు, జనమేజయుడు అను నిద్దరు రాజులు వేదుని కడకువచ్చి తమకు ఉపాధ్యాయుడుగా నుండి యాగము చేయించుమని కోరిరి. అందుకు అతడు అంగీకరించి వారితో పోవుచు 'ఉదంకుడు' అను శిష్యుని పిలిచి 'నేను వచ్చువరకు యింటి వద్దనే ఉండి ఇంటిలో ఏ లోపము లేకుండ చూచుకొనుము' అని చెప్పి పోయెను. అతడు ఏ లోపము లేకుండా అన్ని తీర్చుచుండెను. కొన్నాళ్లకు ఆయింటి స్త్రీలు కొందరు వచ్చి 'నీగురుపత్ని ఋతుస్నానము చేసినది. ఆమె కోరెక్క తీర్చుము' అనిరి. దానికి ఉదంకుడు నేనీ అధర్మ పాపకార్యమునకు ఒడిగట్టనని నిరాకరించెను. కొన్నాళ్లకు గురువు తిరిగి యింటికివచ్చి శిష్యుని ధర్మ పరత్వమునకు మెచ్చుకొని అతనికి సమస్త విద్యలు ప్రసాదించెను. అతడు గురుకులములోనే ఉండి కొన్ని దినముల తరువాత గురుదక్షిణ యివ్వ



దలచి గురువుయొక్క ఇష్టమును తెలుపుమని ప్రార్థించెను. గురువు తన భార్య నడుగుమనెను. ఉదంకుడు గురుపత్ని నడుగగా, ఆమె 'నేటికి నాల్గవనాడు నేను పుణ్యకవ్రతము చేయుటకు సంకల్పించినాను. నీవు పౌష్య మహారాజు వద్దకుపోయి ఆయన భార్య ధరించిన కుండలములు (చెవిపోగులు) తెచ్చియిమ్ము. నేను వాటిని ధరించి ఆనాడు బ్రాహ్మణులకు ప్రదక్షిణ నమస్కారములు చేసెదను. నాలుగు దినములలో తేవలెను. అప్పుడే నీకు శ్రేయస్సుకలుగును. ఈ గడువులోపల తేజాలనిచో నీకు చాల చేటు కలుగును. ఇదియే నీవీయవలసిన గురుదక్షిణ' అని ఆజ్ఞాపించెను.

ఆ ఆజ్ఞ ప్రకారమే ఉదంకుడు కుండలములు తెచ్చుటకు పౌష్యమహారాజు పట్టణమునకు వెంటనే బయలు దేరెను. పోవుచు మార్గమునందు ఒక పెద్ద ఎద్దుపైన ఎక్కిన మహాకాయుడైన పురుషుని చూచెను. ఆ పురుషుడు ఎద్దు పేడను తినుమని ఉదంకుని కోరెను. అతడిష్ట పడలేదు. మీ గురువుకూడ తినినాడు, తప్పు లేదు, తిను మని తిరిగి నిర్బంధించెను. దానికి మారు మాటాడక ఉదంకుడు ఆ యెద్దుయొక్క మూత్రపురీషములను భక్షించి ఆచమనము చేసి వెంటనే బయలుదేరి పౌష్యుని నగరమునకు పోయి ఆరాజును దర్శించెను. మునికుమారుని పూజించి పౌష్యుడు వచ్చినకార్య మడిగెను. అతనిపత్ని ధరించిన కుండలములు తన గురుపత్నికి కావలెనని కోరెను. తన పత్నిని అడుగుమని పౌష్యుడు అంతఃపురమునకు పంపెను. ఉదంకుడు అంతఃపురములో పౌష్యపత్నిని కానక తిరిగి వచ్చి పౌష్యునకు తెలిపెను. 'నీవు అశుచివై యుందువు. అపవిత్రులకు మహాపతివ్రతయగు నాపత్ని గోచరించదు.' అని రాజు చెప్పెను. ఉదంకుడు కాళ్ళు చేతులు కడుగుకొని తూర్పుముఖముగా కూర్చొని ఆచమనముచేసి జపముచేసి పరిశుద్ధుడై తిరిగి అంతఃపురమునకు పోవగనే ఆ రాణి కనబడి యతనికి అర్ఘ్యపాద్యాదులతో పూజచేసి వచ్చినకార్యమడిగెను. ఉదంకుడు గురుపత్నికొఱకు కుండలములను యాచించెను. దానమునకు ఇంతకన్న తగిన పాత్ర లభించ'దని ఆమె వెంటనే కుండలములు ఒలిచి ఉదంకునకు ఇచ్చెను. నాగరాజగు తక్షకుడు ఈ కుండలములను మిక్కిలి అపేక్షించుచున్నాడు, జాగ్రత్తగా తీసికొనిపొమ్ము అని చెప్పి ఆమె అతనికి సెలవిచ్చి పంపెను. ఉదంకుడు పౌష్యునివద్దకు వచ్చి సెలవిమ్మనెను. అతడు 'చాలకాలమునకు నీవంటి సత్పాత్రలభించెను. నాయాతిథ్యమును తీసికొనిపొమ్ము' అనెను. దాని కంగీకరించి ఉదంకుడు "నేను త్వరగా పోవలెను. ఇప్పుడు ఏది సిద్ధముగా నున్నదో ఆ ఆహారము పెట్టుము. తినిపోయెద'' ననెను. అట్లేకానిమ్మని అప్పటికి సిద్ధముగా నున్న చద్ది అన్నమే అతనికి వడ్డింపజేసెను. ఆ చద్ది యన్నములో వెంట్రుక ఉండుటను చూచి ఉదంకుడు 'కేశదుష్టమైన అపవిత్రాన్నమును నాకు పెట్టితివి కనుక నీవు అంధుడవు కమ్ము" అని పౌష్యునకు శాపమిచ్చెను. దానికి పౌష్యుడు 'ఏదోషము లేని అన్నమును దూషించుచున్నావు గనుక నీకు సంతతి కలుగకుండుగాక అని తిరుగు శాపమిచ్చెను. ''అశుచియైన అన్నము పెట్టి నాకిట్లు శాపమిచ్చుట నీకు తగదు. అన్నము చూడుము" అని ఉదంకుడనెను. ఆ రాజు, అన్నమును పరిశీలించి నిక్కముగా అందులో కేశము ఉండుటను చూచి చింతించి క్షమించుమని, తనకు అంధత్వ విముక్తిని ప్రసాదించుమనియు ఉదంకుని వేడుకొనెను. 'భయపడకుము. అంధత్వము ప్రాప్తించిన తరువాత అచిరకాలములోనే తిరిగి నీకు కన్నులు కనపడును'' అని అతనికి శాప విముక్తి చెప్పెను. 'నాకుగూడ అనపత్యత లేకుండునట్లు నీ శాపమును ఉపసంహరించుకొనుము.' అని ఉదంకుడు కోరెను. కాని పౌష్యుడు 'అది తనకు సాధ్యము కాదనెను. ఎందుకనగా, 'నీవు బ్రాహ్మణుడవు. నీ మనస్సు వెన్నవలె మృదువైనది. వాక్కు మాత్రమే కఠినము కనుక మృదు హృదయము నుండి వెలువడిన శాపవాక్యములు ఉపసంహరించవచ్చును. నేను రాజును. నా వాక్కు మాత్రమే మృదు మధురముగా నుండును. హృదయము వజ్రాయుధమువలె కఠినమైనది. కనుక నేను శాపమును త్రిప్పజాలను '' అనెను. ఆ మాటకు, ఉదంకుడు పౌష్యునితో, " పరిశుద్ధాన్నమును దూషించుచున్నావు గనుక అనపత్యుడవు కమ్ము" అని నీవు నాకు శాపమిచ్చితివి. నీవు ప్రత్యక్షముగానే చూచి అది అపరిశుద్ధాన్నమని తెలిసికొంటివి. కనుక అన్నము దుష్టము కానప్పుడు కదా నాకు నీ శాపము అంటును. అది కేశదుష్టమని నీవు ప్రత్యక్షముగా చూచితివి. కాబట్టి నీ శాపము నాకు అంటదు '' అని చెప్పి ఉదంకుడు తనకు శాపము అంటనట్లుగానే నిశ్చయించుకొని వెడలిపోయెను.

కుండలములను గొనిపోవుచుండగా మార్గములో ఒక సన్యాసి నగ్నముగా అతనిని వెన్నంటుచుండెను. ఆ సన్యాసి ఒకప్పుడు కనపడుచు మరియొకప్పుడు కనపడక ఉండెను. కొంతసేపటికి ఉదంకుడు కుండలములను భూమిపై పెట్టి నీటి కొరకు తటాకములోకి దిగి నీరు త్రాగి వచ్చులోపల ఆ నగ్న సన్యాసి కుండలములను హరించి తీసికొనిపోయెను. అది చూచి ఉదంకుడు





త్వరగా అతనిని వెన్నంటి పట్టుకొనగా, అతని నగ్నసన్యాసి వేషము మారెను. తక్షకరూపమును ధరించి అతడు వెంటనే భూమి సొరంగములో దూరి నాగలోకమునకు పోయెను. ఉదంకుడు ఇంద్రుని వజ్రాయుధసహాయముచేత ఆ బిలమును త్రవ్వి నాగ లోకమునకు పోయి అక్కడ దిక్కుతోచక నాగరాజులను అనేక విధముల వేద మంత్రములతో స్తుతించెను. అంతగా స్తుతించి నను కుండలములు పొందలేదు. అక్కడ ఇద్దరు స్త్రీలను నల్ల తెల్లదారములను పడుగు పేకలుగా చేసి వస్త్రమును నేయుచున్న వారిని చూచెను. పన్నెండు ఆకులుగల చక్రమును ఆర్గురు పురుషులు త్రిప్పుచుండుటను గూడ చూచెను. ఒక సుందరమైన గుఱ్ఱము కనబడెను. ఉదంకుడు అనేక వేదమంత్రములతో వారినందరిని స్తుతించి చివరకు పరమ పురుషుని ప్రార్థించెను. అతడు సంతుష్టుడై వరము వేడుమనెను. 'నాగులు నాకు వశులు కావలె' నని ఉదంకుడు కోరెను. 'ఈ గుఱ్ఱము పృష్ఠభాగమునందు ఊదుము' అని పురుషుడనెను. అట్లే ఉదంకుడుచేయగా అశ్వముయొక్క అన్ని యింద్రియ రంధ్రములనుండి పొగలు గ్రక్కుచు అగ్నిజ్వాలలు బయలు వెడలి నాగలోకమును దహింపజొచ్చెను. ఆపేడికి తాళలేక తక్షకుడు బెదరి కుండలములు తెచ్చి ఉదంకునకు ఇచ్చెను. అంతతో అగ్ని యు శమించెను.

అది నాల్గవదినము. అది గురుపత్నికి పుణ్యకవ్రతదినము. తాను కుండలములు ఆనాడు తీసికొని పోవకున్నచో గొప్ప అనర్థము కలుగును. తాను చాల దూరదేశమున నున్నానని ఉదంకుడు చింతించు చుండెను. అతనిచింతను మాన్పి ఆ పురుషుడు "ఈ అశ్వమును ఎక్కిపొమ్ము. ఒక్క క్షణములో నిన్ను నీగురు పత్నికడకు ఇది చేర్చును." అనిచెప్పి ఉదంకుని పంపెను. అతడు క్షణకాలములో గురుపత్నిని చేరునరికి ఆమె, ఉదంకుడు ఇంకను రాలేదని కోపముతో అతనికి శాపమిచ్చుటకు చేతిలో ఉదకము తీసికొనియుండెను. ఉదంకుని చూడగనే సంతోషించి కుండలములను తీసికొని అతనిని ఆశీర్వదించి పంపెను.

ఆతర్వాత ఉదంకుడు గురువును దర్శించెను. తనకు దారిలో జరిగిన సంఘటనలు విఘ్నములు అన్నియు చెప్పెను. విన్నతర్వాత గురువు ఈవిధముగా వివరించెను. 'వత్సా ! నీకు కనపడిన యిద్దరు స్త్రీలు ధాత, విధాత. తెల్లనినల్లని దారములు పగళ్ళు, రాత్రులు. పన్నెండు అరముల చక్రము పన్నెండు నెలల సంవత్సరము. దానిని త్రిప్పు ఆర్గురు పురుషులు ఆరు ఋతువులు. ఆ పురుషుడు పర్జన్యుడు. అశ్వము అగ్ని. నీవు పోవునప్పుడు కనబడిన ఎద్దు ఐరావతుడు అను నాగరాజు. దాని నెక్కిన పురుషుడు ఇంద్రుడు. నీవు తినిన ఎద్దుపేడ అమృతము. దానిని తొలుతనే తినుటచేత నీవు అన్ని విఘ్నములను దాటి నాగ లోకమును ప్రవేశింప గలిగితివి. అక్కడ నిన్నెవరును చంప లేక పోయిరి. ఇంద్రుడు నాకు మిత్రుడు గనుక నీపై దయచేత తొలుతనే నీకు అమృతమిచ్చి సహాయము చేసెను. లేకున్న నీవీ కుండలములను తేజాలకుంటివి.

'వత్సా ! నీకు సర్వ శ్రేయస్సులు గలుగుగాక. అపూర్వము, ఇతరులకు సాధ్యముకాని గురుదక్షిణ యిచ్చి నా అనుగ్రహమును సంపాదించితివి. నీ గురుభక్తికి మెచ్చితిని. నీవింక యథేచ్ఛగా పొమ్ము. నీవు సాధించజాలని పనులు ఉండవు' అని ఆశీర్వదించి గురువైన వేద మహాముని ఉదంకునకు సెలవిచ్చి పంపెను.

ఉదంకుడు తక్షకుడు చేసిన అపకారమును తలచుకొనుచు అతనిపై పగ తీర్చుకొనవలెనని దీక్షతో హస్తినాపురమునకు పోయి జనమేజయమహారాజును దర్శించెను.

అచ్చట మంత్రి పురోహితాదులతో కూర్చొని యున్న జనమేజయుని ఉదంకుడు సమీపించి జయశబ్దముచే ఆశీర్వదించెను. 'రాజా ! నీవు చేయవలసిన పనినిప్పుడు మరియొకపనిని చేయుచున్నావు' అనెను. 'నేను ప్రజలను పాలించుపనినే చేయుచున్నాను.' అని రాజు అనెను. "రాజా ! తక్షకుడు మీతండ్రిని అన్యాయముగా చంపెను. అట్టి దుష్టుని హోమగుండములో నీవు





కొల్చవద్దా ? అట్లు చేసిననే మీతండ్రి పరీక్షిత్తుకు సంతృప్తి కలుగునుగదా ! దానివలన నాకుగూడ తక్షకునిపై గల పగ తీరును. [illegible]" అని ఉదంకుడు జనమేజయుని తక్షకి వధార్థమై ప్రోత్సహించెను.


ఆమాటతో జనమేజయుడు దీప్తాగ్నివలె కోపోద్దీపితుడై సర్పయాగముచేయ సంకల్పించెను. అతని సర్పయాగములో సర్పములు చచ్చుటకు మరియొక కారణముకూడ నున్నదని ఉగ్రశ్రవుడు భృగువంశ చరిత్ర చెప్పదొడగెను.

వరుణుని క్రతువులో బ్రహ్మవలన అగ్నినుండి భృగువను మహర్షి జన్మించెను. అతని వంశములో అనేకులు మహాతపస్సంపన్నులు పుట్టిరి. భార్గవ వంశము అతి విశాలమయ్యెను. ఆవంశజుడైన రురువు, గర్భిణియగు తన భార్యను హోమాగ్ని రక్షణార్థమై అగ్నివద్దఉంచి స్నానార్థమై పోయెను. కన్యగా నున్నప్పుడు ఆమెను ప్రేమించిన పులోముడను రాక్షసుడు సమీపించి ''యీమె యెవరు ? చెప్పుము'' అని అగ్ని నడిగెను. అగ్ని అసత్యదోషమునకు భయపడి, ''రురువుభార్య పులోమ '' అని చెప్పెను. దానివలన వచ్చురురుశాపముకంటె అసత్యదోషము చాల ఘోరమని తలచి అగ్ని సత్యమే చెప్పెను. మునిని ప్రసన్నునిచేసి శాప విముక్తి పొందవచ్చునని నిశ్చయించుకొనెను. అంతట పులోమరాక్షసుడు వరాహరూపముతో ఆమెను ఎత్తుకొని పోయెను. భయముచేత ఆమె గర్భస్థ శిశువు జారి క్రిందపడెను. అత్యుగ్రతేజస్సుగల ఆబాలకుని చూడగనే రాక్షసుడు భస్మమయ్యెను. అంత పులోమ బాలకుని ఎత్తుకొని పతి యాశ్రమమునకు పోయెను. తల్లిగర్భమునుండి చ్యుతుడగుట వలన అతనికి 'చ్యవనుడు' అనుపేరు వచ్చెను. దుఃఖించుచున్న పులోమ కన్నీళ్ళు నదిగా ప్రవహించెను. దానికి బ్రహ్మదేవుడు 'వధూసర' అని పేరు పెట్టెను. అనగా 'కోడలినుండి ప్రవహించిన నది' అని భావము.

పులోమవలన, జరిగినసంగతివిని రురుమహాముని "నీవు నాభార్యవని ఆ రాక్షసునికి ఎవరుతెలిపిరి ?" అని అడిగెను. అగ్ని [illegible] భక్షకుడవు కమ్ము' అని అగ్నికి శాపమిచ్చెను. అంతలో అగ్నికి కోపమువచ్చి తనను తాను ఉపసంహరించుకొని చల్లారెను. దానితో మునులకు హోమాది కార్యములు నిలిచిపోయెను. ప్రజల నిత్యకృత్యము లాగిపోయెను. అప్పుడు ఋషులందరు ఏకమై దేవతలకడకుపోయి దీనికి ప్రతిక్రియ చేయుడని కోరిరి. వారికి గూడ అగ్నిని శాంతింపచేయుటకు సాధ్యముకాక అందరుచేరి బ్రహ్మవద్దకు పోయి వేడిరి. బ్రహ్మదేవుడు అగ్నిని పిలిచి ప్రశంసించి అగ్ని లేనందున లోకములో స్తంభించి పోయిన కార్యములన్ని యథావిధిగా సాగుచుండునటు చేయుమని కోరెను. బ్రహ్మవరము వలన అగ్నికి సర్వభక్షకత్వదోషము అంటక సర్వదా పవిత్రుడుగా నుండెను. అందుచే అతడు పూర్వము వలెనే అన్నిపనులు సాగునట్లు యథాస్థితిలో నుండెను.

పూర్వము, మేనకకు విశ్వావసువు అనుగంధర్వరాజువలన నొక స్త్రీశిశువు జన్మించెను. దానిని మేనక నిర్దయురాలై సిగ్గుమాలి స్థూలకేశమహామునియాశ్రమ సమీపమందలినదియొడ్డున పారవేసి పోయెను. దానిని స్థూలకేశుడుచూచి దయగలవాడై తెచ్చి పోషించెను. ఆశిశువు ప్రమదలలో శ్రేష్ఠురాలగుట చేత దానికి 'ప్రమద్వర' అని పేరు పెట్టెను. ఆమె పెరుగుచు అతిలోక సౌందర్యవతిగా నయ్యెను. చ్యవనుని మనుమడగు 'రురువు' అను ఋషి ఆమెను చూచి మోహించెను. తన యిష్టమును స్థూలకేశునకు తెలిపెను. అతడామెను రురువునకిచ్చి వివాహము చేయుటకు ముహూర్తము నిశ్చయించి అతనిని పంపెను.

ఇంతలో ఒకనాడు ప్రమద్వర తన చెలులతో ఆడుకొనచు వనములో నిద్రించుచున్న సర్పమును త్రొక్కెను. సర్పము



కోపముచేత ఆమెను కరచెను. ఆమె చచ్చిపడెను. కాని ముఖము లో తేజస్సు క్షీణించకుండెను. అది చూచి ఋషులెల్ల గుమిగూడి ఆశ్చర్యపడిరి. ఆమెను పెండ్లియాడదలచిన రురుడు ఈ సంగతి తెలిసి వచ్చి ఆమెను చూచి మిగుల దుఃఖించుచు అడవిబట్టి తిరుగు చుండెను. ఎంతయో విలపించెను. అతని దుఃఖమును చూచి జాలిచే దేవదూత వచ్చి రురుడును ఓదార్చి "నీఆయుష్య ములో సగము ఈమెకిచ్చినచో ఈమె బ్రతుకును" అని చెప్పిరి. దాని కత డంగీరించెను. యముని ఆజ్ఞచేత అతని ఆయుష్యము ఆమెయందు ఆవహించగా ఆమె బ్రతికెను. ఆ తరువాత ఆయిరువురి తల్లిదండ్రులు వారికి వివాహము చేసిరి. ఇరు వురు ఆనందోత్సాహములతో రమించు చుండిరి.

రురుడు, తన ప్రియురాలు సర్పదష్టయై మరణించినదని సర్ప జాతిపై కోపముచేత సమస్త సర్పములను హతమార్చుటకు ప్రతిజ్ఞ బూనెను. కనబడిన సర్పములనన్నింటిని ఆయుధముల తోను, కఱ్ఱలతోను కొట్టి చంపుచు వచ్చెను. ఒక నాడతడు అడవికి బోయి అక్కడ శయనించియున్న డుండుభము అనునొక జల సర్పమును చూచెను. దానిని గూడ కఱ్ఱతో కొట్టబోయెను. అప్పుడది అయ్యో! అన్యాయముగా నన్నేల చంపెదవు? అనెను. రురుడు తనకు సర్పములయెడగల కోపమునకు కారణము తెలిపి, దానిని చంపెదననెను. అయ్యో! సర్పములన్నిటిని ఒకే రీతిగ తలచకుము. డుండుభములమగు మేము ఇతరసర్పములవలె హింసించువారముకాము, నిరపరాధినైన నన్ను చంపకుము" అని చెప్పెను. ఆమాటకు, వివేకియైన రురుడు నీవు మహాయోగివలె గనపడు చున్నావు, నీవెవరో తెలుపుము" అని అడుగగనే ఆసర్పము మునిరూపముతో ఆతని యెదుట ప్రత్యక్షమై తన కథచెప్పెను.

నేను "సహస్రపాదుడు" అను ఋషిని. విప్రశాపము వలన సర్పమైతిని. నాకు పూర్వము 'ఖగముడు'అను బ్రాహ్మణుడు మిత్రుడుగ నుండెను. అతడు మిక్కిలి తపోబల సంపన్నుడు. కాని అతితీక్ష్ణమైన వాక్కుగలవాడు. ఒకనాడతడు అగ్నిహోత్రము చేసికొనుచుండగా పరిహాసమునకుగాను నేను ఒక తృణసర్పమును అతనిపైన వేసితిని. అతడు భయపడి మూర్ఛిల్లెను. కొంత సేపటికి మూర్ఛదేరి, మహాకోపముతో "నిర్వీర్యమగు తృణ సర్పముచేత నన్ను భయపెట్టితివి గనుక నీవును నిర్వీర్యమగు సర్పముగా పడియుండుము" అని నన్ను శపించెను. నేను దుఃఖించుచు శాప విమోచనమును వేడితిని. అతడు కనికరించి "నీవు భృగువంశ సంజాతుడైన ప్రమతిమునిపుత్రుని రురుడును చూచినతోడనే నిజరూపమును పొందెదవు" అని శాపాంతమును చెప్పెను. ఇప్పుడు నిన్నుచూచి నాకు శాపవిమోచనము కలిగెను. నీకొక హితము చెప్పెదను. వినుము.

ఏ ప్రాణినిగూడ హింసించకుము. అహింస అందరును అనుష్ఠించవలసిన ధర్మము. విశేషించి బ్రాహ్మణుడవగు నీకు హింసించుట తగదు. బ్రాహ్మణుడు సర్వదా సౌమ్యుడుగానే యుండవలెను. వేద వేదాంగములను అభ్యసించవలెను. సమస్త ప్రాణులకు అభయ మీయవలెను. అహింస, సత్యవాక్కు, ఓర్పు, వేదాధ్యయనము ఇవి బ్రాహ్మణుడు అవలంబించ వలసిన ఉత్కృష్ట ధర్మములు. క్షత్రియ ధర్మము నీకుతగదు. దండమును ధరించి దుష్ట శిక్షణాదులు క్షత్రియులు చేయవలెను. నీ విప్పుడు చేయుచున్న సర్పనాశకర్మ క్షత్రియోచితము. జనమేజయుడను రాజు పూర్వము సర్ప యాగములో సమస్త సర్పములను దహించు చుండెను. అప్పుడు, తపస్సంపన్నుడు, వేదవేదాంగపారగుడునైన 'ఆస్తీకుడు' అను బ్రాహ్మణుడు అడ్డుపడి, భీతిల్లిన సర్పములను రక్షించెను. కనుక తాను హింసించ కుండుటయేకాక, ఇతరులను కూడ హింసనుండి విరమింప జేయుట బ్రాహ్మణ ధర్మము అని చెప్పెను.

పూర్వము జనమేజయుడు చేసిన సర్పయాగము యొక్క వృత్తాంతము చెప్పుమని రురుడు డుండుభుని అడిగెను. అందు కతడు 'నేను త్వరగా పోవలసియున్నది. నీవు ఇతరులవలన ఆ కథ వినుము' అని చెప్పి వెడలిపోయెను. రురుడు తిరిగి ఆ చింతతోనే తన తండ్రియగు ప్రమతికడకు వచ్చి జనమేజయ సర్పయాగవృత్తాంతము, ఆస్తీకుడు సర్పములను రక్షించిన విధానము సమగ్రముగా తెలుపుడని వేడెను. అతడు ఆ సమా చారమిట్లు చెప్పదొడగెను.

(సశేషము)



భారతదేశానికి గర్వకారణము, ఆంధ్రప్రదేశానికి ఆశాజ్యోతి అయిన ...

నాగార్జున సాగర్

ఎ. పి. రంగనాథస్వామి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీ ప్రణాళికలో నీటిపారుదల రంగంలో ముఖ్యభాగంగా కృష్ణానది జలాల సద్వినియోగానికి నాగార్జునసాగర ప్రాజెక్టు నిర్దేశించబడింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం తాలుకా నందికొండ గ్రామం సమీపంలో యీ ప్రాజెక్టు నిర్మించబడుతున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి నిర్ణయించటం ప్రభుత్వానికి 1955 జూన్‌లో నాగార్జునసాగర్ కంట్రోలుబోర్డును ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో పాల్గొనే పూర్వపు హైదరాబాదు, ఆంధ్రరాష్ట్రీలు, 1954 జూన్‌లో రూపొందించిన ప్రాజెక్టు పూర్తి వివరాలను యీ బోర్డు పరిశీలించి నిర్మాణం విషయాలలో నిర్ణయాలు తీసుకున్నది.

మొత్తం ప్రాజెక్టు అభివృద్ధి సజావుగా కొనసాగడానికి వీలుగా 1955–56 సంవత్సరాలలో పరిపాలన, ప్రణాళికా విషయాలపై దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరం ఏర్పడింది. దీర్ఘకాలిక ప్రణాళిక, వ్యవస్థా నిర్మాణం, విధానాలను రూపొందించడం, ఆర్థికకంట్రోలు, కార్యనిర్వహణకు నికరంగా జరిగేఖర్చుల అంచనాలను తయారుచేయడం, ఇతర ప్రాథమిక పనులు వగైరాలను, నిర్మాణంపూర్వదశలో పూర్తి చేశారు. అందువల్ల 1957 లో ఆనకట్ట, కాలువల నిర్మాణం పనులు చేపట్టడం జరిగింది.

1955 డిసెంబరు 10న అప్పటి ప్రధానమంత్రి శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ యీ ప్రాజెక్టు నిర్మాణానికి పునాదిరాయి వేశారు. ఈ సందర్భంలో ఉత్తేజకరమైన ఆయన ప్రసంగాన్ని పునరుచ్చారణ చేయడం సమంజసం. "నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు పునాది రాయివేయడాన్ని నేనొకపవిత్ర కార్యంగా భావిస్తున్నాను. ఇది భారత మానవతా దేవాలయానికి పునాదిరాయి వేయడంవంటిది. భారతదేశంఅంతటా మనంనిర్మించుకునే నూతన దేవాలయాలకు యిదిచిహ్నం." అని ఆయన అన్నారు.

ఈ ప్రాజెక్టు గ్రావిటీ రూపంలో రాతి ఆనకట్ట నిర్మించబడుతున్నది. ప్రపంచంలో ఇది అతి ఎత్తైన, పొడవైన రాతి ఆనకట్ట. నదికి రెండువైపులా నీటిపారుదల కాలువలు, 50,000 కిలో వాట్లచొప్పున విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేయగల 8 జనరేటింగ్ యూనిట్లతో పవర్‌హౌస్ నిర్మించబడుతాయి. పూర్తిగా నిర్మించబడిన ప్రధాన ఆనకట్ట, ఎత్తు 409 అడుగులు, 320 అడుగులవెడల్పు, దాదాపుమైలు పొడువు ఉంటుంది. ఆనకట్టకు రెండువైపుల 8 అడుగులఎత్తున మట్టికట్ట నిర్మిస్తారు. ఇవికూడ మైలుపొడవు ఉంటాయి. ఈ ప్రాజెక్టు కుడికాలువ 235 మైళ్లపొడువు ఉంటుంది. ఇందులో 21,000 క్యూసెక్కుల

నాగార్జున సాగర్ ప్రాజెక్టు

నిర్మాణం : కొన్ని ముఖ్య సంఘటనలు

(అ) 1955 జూన్‌లో నాగార్జునసాగర్ కంట్రోలు బోర్డు ఏర్పడింది.

(ఆ) 1955 డిసెంబరు 10న, శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ, ప్రాజెక్టు నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు.

(ఇ) 1956 అక్టోబరు 11న కుడికాలువ నిర్మాణానికి పునాదిరాయి వేయబడింది.


(ఈ) 1957 జులై 12న అప్పటి కేంద్ర నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ యస్. కె. పాటిల్ ప్రధాన రాతి ఆనకట్ట నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు.

(ఉ) 1959 ఫిబ్రవరి 7న అప్పటి కేంద్ర నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ హాఫీజు మహమ్మద్ ఇబ్రాహీం హల్యాపై అక్విడెక్టు నిర్మాణానికి పునాది రాయి వేశారు.

(ఊ) 1959 సెప్టెంబరు 9న అప్పటి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రీ గవర్నరు శ్రీ భీమ్‌సేన్‌సచార్ ఎడమ కాలువ ట్యునల్ నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు.

(ఋ) 1965 జూన్ 11 న గుర్రంనాళం ఆకారంగల సొరంగంద్వారా కృష్ణనీరు మళ్ళింపుకు ప్రారంభోత్సవం జరిగింది.

(ౠ) 1966 లో భారత ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ, కాలువలలోకి నీటి విడుదలకు ప్రారంభోత్సవం చేశారు.




ఆనకట్టపై ఎత్తైన క్రేనులు

నీటిప్రవాహం కలిగి గుంటూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలలో దాదాపు 20.6 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిపారుదల సౌకర్యం కలిగిస్తుంది. ఎడమకాలువ 111 మైళ్లు ఉంటుంది. ఇందులో 15000 క్యూసెక్కుల నీటిప్రవాహంతో నల్లగొండ, ఖమ్మం, కృష్ణా జిల్లాలలో 8.8 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కలుగుతుంది. నిర్మాణం పూర్తి అయిన తర్వాత యీ కాలువ పొడువు 218 మైళ్లు ఉండి 14.4 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కలుగ జేస్తుంది.

ఈ కాలువను మరొక 65 మైళ్లకు విస్తరింపజేసి పశ్చిమ గోదావరి జిల్లా ఎర్రకాలువతో కలిపి అదనంగా 4.38 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించవచ్చు. మధ్య స్పిల్ వే పై మట్టికట్టలను కల్పడానికి ఆనకట్టపై 28 అడుగుల రోడ్డు బాటను నిర్మిస్తారు. ఆనకట్ట పై 16 అడుగుల వ్యాసంగల 8 పెన్‌స్టాకులను నెలకొల్పుతారు.

2, 3 పంచవర్ష ప్రణాళికలవరకు యీ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయబడుతుంది. అందువల్ల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయినదాక వేచిఉండకుండా సాధ్యమైనంత త్వరలో దశలవారిగా ప్రాజెక్టు ప్రయోజనాలను పొందడానికి కృషి చేయబడుతున్నది. ఈ దృష్టితోనే రెండు దశలలో దీనిని నిర్మించాలని ఉద్దేశించారు. రాత్రి ఆనకట్టను ఎఫ్. అర్. ఎల్. × 546 వరకు నిర్మించడం,



రాత్రి సమయంలో అనకట్ట సుందర దృశ్యం.


కుడి కాలువను 127 మైళ్ళకు, ఎడమ కాలువను 111 మైళ్ళవరకు నిర్మించి మొత్తం 21.50 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించడం మొదటి దశలో (ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నది) చేర్చబడినాయి. ఇందులో కొంత భాగం వరి, చెక్కెర, మిగతా భాగంలో ప్రత్తి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న యితర ధాన్యాలు ఉత్పత్తి చేసారు. ఈ పథకం మొదటిదశలో వార్షికంగా 8 లక్షల టన్నుల ఆహారధాన్యాలు ఆఖరుదశలో 12 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేయబడుతాయి.

ప్రాజెక్టు నిర్మాణంలో ప్రజలు పాల్గొనడానికి వీలుగా ప్రధాన కాలువల త్రవ్వకం పని, ఎడమవైపు ప్రధాన కాలువపై కొన్ని రాతికట్టడం పనులు భారత సేవక సమాజ్, కార్మిక సహకార సంఘాలకు ఇవ్వబడినాయి. వీటికి ప్రోత్సాహం కల్గించడానికి భారత సేవక సమాజ్‌ను డిపాజిటు చెల్లింపునుండి మినహాయించడం జరిగింది. కార్మిక సంఘాలు తగ్గింపు డిపాజిటు మొత్తాలను చెల్లించడానికి అనుమతి ఇవ్వబడింది. ఎడమ ప్రధాన కాలువలో 67/0 నుండి 69/4 మైళ్ళవరకు జైలుడిపార్టుమెంటుకు అప్పగించారు. దీర్ఘకాలిక శిక్షలు అనుభవించే ఖైదీలు యీ కాలువ త్రవ్వకాల పనిని చేపట్టుతారు. దీనికై పలుజూరునగర్ తాలుకాలోని బేతవోలులో బహిరంగ జైలును నిర్మించారు.

సాధ్యమైనంత త్వరలో నీటి పారుదల సౌకర్యాలు కల్పించడానికి వీలుగా ప్రాజెక్టు నిర్మాణం కార్యక్రమంతో పాటు ఆయకట్టు అభివృద్ధి కార్యక్రమాన్ని కూడ చేపట్టడం జరిగింది. ఆయకట్టు ప్రాంతంలో వ్యవసాయార్థిక సర్వే, భూసార పరీక్ష, ఆయకట్టు లోకలైజేషన్, రైతులకు ఆర్థిక సహాయం, విత్తనాలు, ఎరువుల పంపిణీలు యీ కార్యక్రమంలో చేర్చబడినాయి. కుడి, ఎడమ కాలువల క్రింద ప్రయోజనకరమైన పైర్ల పద్ధతిని అనుసరించబడుతుంది.

కుడి కాలువక్రింద 1/3 వంతు మాగాణి, 1/3 రాబీమెట్ట 1/3 ఖరీపు మెట్టకు కేటాయించారు. ఎడమ కాలువక్రింద తెలంగాణా ప్రాంతమంతటా మాగాణి పైర్లు, ఆంధ్రప్రాంతంలో కుడి కాలువక్రింద మాదిరిగా ప్రతిపాదించారు. వ్యవసాయక అంశాలపై పరిశోధనల నిమిత్తం ఆయకట్టు ప్రాంతంలో వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, ప్రదర్శక వ్యవసాయ క్షేత్రాలు నెలకొల్పారు. (i) అనువైన పైర్లపద్ధతి, ఎరువులు, నీటి పారుదల క్రమం, (ii) భూసార పరిశీలన (iii) నీటి పారుదలవల్ల కలిగే పరిణామాలు (iv) ఆయకట్టు ప్రాంతంలో పైర్లకు కావలసిన నీటి అవసరాలు, వీటిలో పరిశీలిస్తారు.

ఈ ప్రాజెక్టు ప్రాంతంలో ప్రయోగాత్మక, ప్రదర్శక క్షేత్రాలు, పశుగణాభివృద్ధి, అనుబంధ పరిశ్రమల నెలకొల్పడం, రాకపోకల సౌకర్యాలు కల్పించే కార్యక్రమాలు యిందులో చేర్చబడినాయి. సవరించబడిన సర్వేను అనుసరించి ముంపుడు గ్రామాల కార్యక్రమం ప్రకారం, నాగార్జునసాగర్ రిజర్వాయరు నీటి విస్తరణద్వారా 45 గ్రామాలు ముంపుకు గురిఔతాయి. దీనివల్ల 4083 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంటుంది. అనకట్ట, కాలువల నిర్మాణం పనులలో 1,24,000 మందికి ఉపాధి కల్పించ బడుతున్నది. కార్మికుల అవసరాలు



యాత్రికుల విశ్రాంతి గృహం.

పరిశీలించడానికి, కార్మిక నిబంధనల ద్వారా వారికి ప్రయోజనాలు కల్పించడానికీ కార్మిక సంక్షేమ అధికార్లను నియమించారు.

ఆనకట్ట, కాలువలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి అయిన తర్వాత మానవ నిర్మిత సరస్సులో 110 చదరపు మైళ్ల విస్తీర్ణంలో కృష్ణానదీ జలాలను నిల్వచేయడం జరుగుతుంది- భారతదేశంలో అతి పెద్దదీ, ప్రపంచంలో మూడవ పెద్ద సరస్సుగా ఉంటుంది. రిజర్వాయరు ఆఖరుదశలో 9.37 మిలియన్ ఎకరాల అడుగుల నీరు నిల్వచేసే శక్తి కలిగిఉంటుంది. ఈ రిజర్వాయరునుండి నీటి పారుదలకై రెండు కాలువలు-నాగార్జునసాగర్ కుడి కాలువ, నాగార్జునసాగర్ ఎడమ కాలువ-ద్వారా ప్రవహిస్తుంది. ప్రధాన ఆనకట్ట రాతితో నిర్మించ బడుతుంది. 1957 జూలై 12న అప్పటి కేంద్ర నీటి పారుదలశాఖ మంత్రి శ్రీ ఎస్. కె పాటిల్ దీనికి ప్రారంభోత్సవం చేశారు.

3000 అడుగుల కాఫర్ డాం నిర్మాణం పనిని అదే సంవత్సరం 1956 ఫిబ్రవరిలో ప్రారంభించి అదే సంవత్సరం పూర్తి చేయడం జరిగింది.

ఈ ప్రాజెక్టు మొదటి దశలో ([illegible]) కుడి కాలువ 127 మైళ్ల పొడువు త్రవ్వబడుతుంది. ఇది ఆనకట్ట కుడివైపు నుండి ప్రారంభించ బడుతుంది. కుడి కాలువ ద్వారా దాదాపు 11.20 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది. గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాలలోని భూములకు లాభిస్తుంది. ప్రాజెక్టు పూర్తి అయిన తర్వాత 235 మైళ్ల పొడవుకాలువ త్రవ్వబడుతుంది. 1956 అక్టోబరు 11న అప్పటి ఆంధ్రరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ ఎన్. సంజీవరెడ్డి, కుడికాలువ త్రవ్వకాలకు ప్రారంభోత్సవం చేశారు 17వ మైలుపై రు. 119.24 లక్షల అంచనా ఖర్చుతో బుగ్గ వాగుపై నిర్మించబడే 100 అడుగుల ఎత్తుమట్టి ఆనకట్ట, 11వ మైలుపై రు. 16.03 లక్షల అంచనా ఖర్చుతో చంద్రవంకనదిపై నిర్మించ బడే అక్విడెక్టులు, ప్రధానకుడికాలువ నిర్మాణంలో ప్రధానమైనవి.

"రివర్ వ్యూ" అతిథి గృహం.




ఈ ప్రాజెక్టు మొదటిదశలో (ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నది.) ఎడమకాలువ 111 మైళ్లపొడవు ఉంటుంది. ముఖ్యనది నుండి 8 మైళ్ల పైరిజర్వాయరు ఉపరితలంలో ఉన్న ప్రధాన తూమునుండి ఈ కాలువ ప్రారంభ మవుతుంది. ఈ కాలువ ద్వారా దాదాపు 8.80 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కలుగుతుంది. నిర్మాణం పూర్తి అయిన తర్వాత 218 మైళ్ల పొడుపు విస్తరిస్తుంది. నల్లగొండ జిల్లాలో మిర్యాల గూడెం, హుజూరు నగర్ తాలుకాలు. ఖమ్మం జిల్లాలో ఖమ్మం తాలుకా, కృష్ణాజిల్లాలో నందిగామ, తిరువూరు, [illegible], గన్నవరం తాలుకాలద్వారా యీ కాలువ వెళ్తుంది. ప్రధాన ఎడమ కాలువ, 12వ మైలు వద్ద హాల్యా నదిని క్రాస్ చేస్తుంది. అక్కడ రు. 44 లక్షల అంచనా ఖర్చుతో నిర్మించే ఎక్విడెక్టు ద్వారా ఆ నదిలో కలుస్తుంది.

1959 ఫిబ్రవరి 7వ తేదీన అప్పటి కేంద్ర నీటిపారుదల శాఖమంత్రి శ్రీ హాఫీజుమహమ్మద్ ఇబ్రాహిం ఈ ఎక్విడెక్టుకు పునాదిరాయివేశారు. ఈ ఎక్విడెక్టు నిర్మాణానికి 7,62,000 క్యూబిక్ అడుగుల మట్టిపని, 129,4200 క్యూబిక్ అడుగుల రాతిపని, 30,100 క్యూబిక్ అడుగుల కాంక్రీటు సిమెంటు పని అవసరమవుతుంది. 1959 సెప్టెంబరు 9న అప్పటి ఆంధ్ర ప్రదేశ్ గవర్నరు శ్రీ భీమ్ సేన్ సచార్ కాలువ సొరంగంపనికి ప్రారంభోత్సవం చేశారు. అశ్వనాళం రూపంలో ఉండే 7,500 అడుగులపొడవు సొరంగం భారతదేశంలో ప్రథమమైనదీ, అతిపొడవైనది. దీనికి 8 మిలియన్ క్యూబిక్ అడుగుల వరకు కొండను త్రవ్వాల్సి ఉంటుంది. 1.6 మిలియన్ క్యూబిక్ అడుగుల కాంక్రీటు అవసరమవుతుంది. 32 అడుగుల వ్యాసంలో ఉండే సొరంగం తూమునుండి 15000 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది.

ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్న విధంగా ఆంధ్రప్రాంతంలోను (కుడికాలువ) తెలంగాణా ప్రాంతంలోను (ఎడమ కాలువ) నీటిపారుదల ప్రయోజనాలు ఒనగూడుతాయి. సమీప ప్రాంతాలలో కాలువల ద్వారా కుడివైపు 1 నుండి 11 బ్లాకులవరకు గల ఆయకట్టులో 1966 జూన్ నాటికి గుంటూరు జిల్లాలో 4.92 లక్షలు, నల్లగొండ జిల్లాలో 0.87 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కలుగుతుంది.

ఏటేటాలభించే నిధులను అనుసరించి నాగుర్జునసాగర్ నిర్మాణం పని చురుకుగా కొనసాగుతున్నది. ఇది రాష్ట్ర ప్రణాళికా పథకాలలో భాగంగా అమలు జరుపబడుతున్నది. అందువల్ల కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వానికి ఋణాల రూపంలో మంజూరు చేసేనిధులనుండి ప్రాజెక్టు నిర్మాణం




"విజయ విహార్" హిల్ కాలనీ

ఖర్చులకు డబ్బుకేటాయిస్తున్నారు. మొదట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రు. 91.12 కోట్లుఖర్చు అవుతాయని అంచనా వేశారు. అయితే ప్రణాళికా పథకాల కమిటీ చేసిన సిఫారసులు, నికరంగా జరిగేపనులకు సంబంధించి సి. డబ్లు పి. సి. తయారుచేసిన నమోనాలు, అవసరమైన కార్మికులు, నిర్మాణ పరికరాల ధరల పెరుగుదలల కారణంగా ప్రాజెక్టు నిర్మాణం అంచనాఖర్చులు పెరిగాయి. సవరించబడిన అంచనాల ప్రకారం నిర్మాణం ఖర్చులు రు. 139.53 కోట్లకు పెరిగాయి.

ప్రాజెక్టు అంచనా ఖర్చులు పెరిగిన దృష్ట్యా మూడవ ప్రణాళికలో కేటాయించిన రు. 50.00 కోట్లతో కాలువల త్రవ్వకాలు, కాలువలలోకి నీరు ప్రవహించడానికి అనువైన ఎత్తువరకు ఆనకట్ట నిర్మాణం పూర్తి చేయడం సాధ్యపడలేదు. ప్రాజెక్టునిర్మాణం పనులు పురోభివృద్ధి దశలో కొనసాగుతున్న కారణంగా, అదనపునిధులు లభ్యమయ్యే పక్షంలో 1966 వరకు చెప్పుకోదగిన నీటిపారుదల ప్రయోజనాలు అందజేయడం సాధ్యపడుతుంది. కేంద్రప్రభుత్వానికి పరిస్థితులన్నిటిని వివరించిన కారణంగా 1964–65 సంవత్సరానికి అదనంగా రు. 4.00 కోట్లుసహాయంగా అందజేసింది. 1965–66 వ సంవత్సరానికి అదనంగా రు 9.00 కోట్లుమంజూరు చేసింది.

1966 మార్చి ఆఖరునాటికి యీ ప్రాజెక్టుపై రు. 104.18 కోట్లు ఖర్చుచేశారు. ఇందులో ఆనకట్ట నిర్మాణానికి రు. 57.78 కోట్లు కుడికాలువపై రు 27.31 కోట్లు, ఎడమ కాలువపై రు. 19.09 కోట్లు ఖర్చుచేశారు. ఆనకట్టపైన, రెండుకాలువలపైన పని అనుకున్న విధంగా కొనసాగుతున్నది. ఆనకట్టపై 80 శాతం రాతిపని, కాంక్రీటుపని పూర్తి అయింది. కుడి, ఎడమ మట్టి ఆనకట్టలపని 50 శాతంవరకు పూర్తి చేశారు. దీని ఫలితంగా నదీ భాగంలో ఆనకట్ట దాదాపు 230 అడుగులకు, ఎడమవైపు మట్టికట్ట దాదాపు 213 అడుగులు, కుడివైపు దాదాపు 200 అడుగుల ఎత్తు నిర్మించబడింది. నాగార్జునసాగర్



ఎడమ కాలువ సొరంగం

కుడికాలువ 58 మైళ్లు ఎడమ కాలువ 75 మైళ్ల వరకు త్రవ్వబడినాయి. పంటకాలువలు, పంపిణీ కాలువల త్రవ్వకాలు కూడ అభివృద్ధి దశలో ఉన్నాయి.

1966 జూలై నాటికి కాలువలలోకి నీరు వదలి, 5.79 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించడానికి వీలుగా అవసరమైన అన్ని పనులు పూర్తిచేయడానికి తీవ్రంగా కృషి చేయడం జరుగుతున్నది. ప్రాజెక్టు నిర్మాణం పనులతో పాటు పంట కాలువల నిమిత్తం భూమి సేకరణ, వాటి త్రవ్వకం, మొదలైన ఆయకట్టు అభివృద్ధి పనులు కూడ కొనసాగుతున్నాయి. 1964-65వ సంవత్సరానికి నాగార్జునసాగర్ నిర్మాణానికి సవరించబడిన అంచనా ఖర్చులు రు. 1,400 లక్షలు. 1965-66వ సంవత్సరానికి రు. 1,300 లక్షలు కేటాయించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అమెరికా సహాయం కూడ లభిస్తున్నది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో చేపట్టిన దాదాపు 12 నదీలోయ ప్రాజెక్టుల నిర్మాణానికి రు. 184.69 కోట్ల నిధులు అమెరికా కేటాయించడానికి వీలుగా అంతర్జాతీయ సహకార పరిపాలనా సంఘం. (అమెరికా ప్రభుత్వ సంస్థ) భారత ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. 1959 మార్చినుండి 1964 మార్చి వరకు జరిగిన ఖర్చును భర్తీచేయడానికి వీలుగా ఈ ఒప్పందం క్రింద నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిమిత్తం రు. 43.74 కోట్ల ఋణ సహాయంలభిస్తున్నది. ఈ ఒప్పందాన్ని 1965 మార్చివరకు పొడిగించారు.

ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభ దశనుండి ఆనకట్ట నిర్మాణం పనిని రెండు దశలుగా విభజించారు. వర్షాకాలం జూన్-డిసెంబరు, మిగతాకాలం జనవరి-మే. వర్షాకాలంలో రాతి కాఫర్ డాం సహాయంతో రాతి ఆనకట్ట నిర్మాణం కొనసాగిస్తున్నారు. మిగతా కాలంలో క్రాస్‌కట్టల కాలువల ద్వారా నీటిని మళ్ళించి నదీగర్భ ప్రాంతంలో పనులు కొనసాగిస్తున్నారు. నదీగర్భంలో ఆనకట్టను ఎత్తుగా నిర్మించిన తర్వాత 9 అడుగుల వ్యాసంగల 8 తూములను నిర్మిస్తున్నారు. దీనివల్ల వర్షాలు లేని కాలంలో హెచ్చు వేగంలో వచ్చే నీటిని మళ్ళించి పనికి అంతరాయం కలుగకుండా చేయడం జరుగుతుంది.

ఈ తూములను తెరచి ఉంచినంత కాలం వర్షాలు లేని కాలంలో రిజర్వాయరులో నీరు లేకుండా అవుతుంది. రిజర్వాయరులో నీరు నిండడానికి నిర్దిష్టదశలో యీ తూములను శాశ్వతంగా మూసి వేయాల్సి ఉంటుంది. ఈ విధంగా చేయడంలో చాలా ప్రమాదం కలిగే సూచనలు ఉన్నాయి.


తత్కారణంగా తక్కువ స్థాయిలో నీటిని విడుదల చేయడం చాలా అవసరం. దీనికై ఆనకట్టపై స్పిల్ వేలో మరొక సెట్టు తూములు నిర్మించాల్సి ఉంటుంది. లేదా టన్నెల్ ద్వారా నీటిని మళ్ళించాలి. తూముల నిర్మాణానికి ఆలస్యం జరగవచ్చు. హైడ్రాలిక్ హాయిస్టు, తూముల నిర్వహణకు అవసరమైన గేట్లను విదేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి ఉండడం. సంవత్సరంలో 5,6 నెలలలో మాత్రమే స్పిల్ వేలు నిర్మించడానికి అవకాశం ఉండడం యీ ఆలస్యానికి కారణాలు. వీటన్నిటివల్ల ఆనకట్ట నిర్మాణం పూర్తి కావడానికి నిర్దేశించిన గడువు మరో సంవత్సరం పొడిగించాల్సి ఉంటుంది. అందువల్ల సొరంగం ద్వారా నీటిని మళ్ళించాలని ప్రతిపాదించారు. దీనివల్ల 1966 నుండి కృష్ణా డెల్టాలో దాదాపు 4 లక్షల ఎకరాల రెండవ పంటకు నీరు సక్రమంగా అందజేయడానికి వీలుపడుతుంది.

గుర్రంనాడా ఆకారంలో ఉన్న 27 అడుగుల వ్యాసంగల సొరంగం నల్లరాతి కొండలద్వారా వెళ్తుంది. ఈ సొరంగం 25,90 అడుగుల పొడుగు ఉంటుంది. దీనిద్వారా 20,000 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. కొండను 2.2. ఎం. సిఎఫ్టి. ల వరకు త్రవ్వి సిమెంటు కాంక్రీటుతో పూత వేయాల్సి ఉంటుంది. సొరంగంద్వారా కృష్ణనీటిని మళ్ళించడం భారతదేశంలోనే అపూర్వమైన విషయం. 1965 జూన్ 11 న రాష్ట్ర పబ్లిక్ వర్క్సు శాఖమంత్రి యీ సొరంగం త్రవ్వకానికి ప్రారంభోత్సవం చేశారు.


మొదటి దశలోను, ఆఖరుకు ఆనకట్ట, కాలువలపై జరిగేపని వివరాలు :

నీటిమళ్ళింపు సొరంగం






ఆనకట్ట దృశ్యాలు.



వార్తా చిత్రాలు

జస్టిస్ శ్రీ ఎన్. డి. కృష్ణారావును శాశ్వత ప్రధాన న్యాయమూర్తిగా జూలై 8 న రాజభవనంలో ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ పట్టం ఎ. థానుపిళ్లై ప్రమాణస్వీకారం చేయించారు.






జస్టిస్ శ్రీ పి. జగన్మోహన్ రెడ్డిని శాశ్వత ప్రధాన న్యాయమూర్తిగా జూలై 27న రాజభవనంలో జస్టిస్ శ్రీ పి. చాంద్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆర్థిక, పరిశ్రమల శాఖల మంత్రి డాక్టర్ ఎం. చెన్నారెడ్డి జూలై 27 న వరంగల్లులో ముఖ్యమంత్రి జన్మదినోత్సవం సందర్భంగా అభినందన సంచికను ఆవిష్కరించారు.



ముఖ్య మంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి జన్మదినోత్సవ సందర్భంగా అనేకమంది మిత్రులు, సహచరులు, ప్రజలు ఆయనను అభినందించినప్పటి దృశ్యాలు.























ముఖ్య మంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి జూలై 5 న హైదరాబాదులో సమాజ విస్తరణ శిక్షణకు చెందిన జాతీయ సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు.



ప్రేక్షకుల దృశ్యం




కార్మిక, రవాణా, సమాచార శాఖల మంత్రి శ్రీ వి. వి. గురుమూర్తి, ఆగస్టు 6న నల్లగొండలో కొత్త టెలిఫోన్ ఎక్స్ఛేంజికి ప్రారంభోత్సవ పూజ నిర్వహించారు. పోస్టుమాస్టర్-జనరల్ శ్రీ ఎ. స్వామినాథన్‌ను కూడ చిత్రంలో చూడవచ్చు.



కేంద్ర ఆరోగ్యశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ బి.ఎస్. మూర్తి, జూలై 18న హైదరాబాదులోని వైద్యకళాశాలలో ఆగ్నేయాసియా కలరా నిరోధక శిక్షణ కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు.

ప్రేక్షకులు







ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీ వి. బి. రాజు, జూలై 19న హైదరాబాదు జూబ్లీహాలులో ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతులకు చెందిన సమావేశాన్ని ప్రారంభించారు.



విదేశ వ్యవహారాలమంత్రి సర్దార్ స్వరణ్ సింగ్, జూన్ 26వ నెహ్రూ జూలాజికల్ పార్కులో మొక్కను నాటిన దృశ్యం.

అటవీ, మునిసిపల్ వ్యవహారాల శాఖల మంత్రి శ్రీ ఎన్. చెంచురామానాయుడు, జూలై 1వ నెహ్రూ జూలాజికల్ పార్కులో మొక్కను నాటడంద్వారా 7వ వనమహోత్సవానికి ప్రారంభోత్సవం చేశారు.







శ్రీ ఎన్. చెంచురామానాయుడు బాలలకు ట్రీ లవర్ బ్యాడ్జీలు, ఫలకాలు బహూకరిస్తున్న దృశ్యం.



తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బాలభటుడు శ్రీ చిరువోలు సత్య దత్తాత్రేయ శర్మ. ఆయనకు యింతవరకు 14 ప్రశంసా బ్యాడ్జీలు లభించాయి.

మత్స్య శాఖవారి కాకినాడ పడవల నిర్మాణంబోర్డు నిర్మించిన టగ్ బోటు దృశ్యం. ఇటువంటి రెండు పడవలను పోర్టు శాఖకు ఇచ్చారు.





నిజామాబాదుజిల్లా ఎల్లారెడ్డి పంచాయతీ సమితిలోని గండిమసానిపేట గ్రామంలో తైచుంగ్ నేటివ్–1 వైరు.

పంజాబులో అక్రమవ్యాపారం, అక్రమనిల్వల తనిఖీ చర్యలు



పంజాబు రాష్ట్రమంతటా అక్రమవ్యాపారం, అక్రమ నిల్వలు, సరుకుల కల్తీలను నిరోధించడానికి చర్యలు ప్రారంభించినప్పటి నుండి వివిధ ప్రాంతాలలో 300 మందికి పైగా వ్యాపారస్తులను అరెస్టు చేశారు. వేల లీటర్ల కిరసనాయిల్, కల్తీ చేయబడిన డీజల్ ఆయిల్, లూబ్రికేంటు, బస్తాల కొద్ది సిమెంటును పోలీసులు జప్తు చేశారు.

ప్రభుత్వం తీసుకుంటున్న నిరోధక చర్యలకు ప్రజల తోడ్పాటు ఇతోధికంగా లభిస్తున్నది. సంఘవ్యతిరేక శక్తులను అరెస్టు చేస్తున్నందుకు ప్రజలు ఊరేగింపులు, నినాదాల రూపంలో తమ హర్షాన్ని వ్యక్తంచేస్తున్నారు.

లూధియానాలో జరిగిన అటువంటి ప్రదర్శన దృశ్యం.



అక్రమనిల్వలు, అక్రమవ్యాపారం నేరాలపై లూధియానాలో నిర్బంధించబడిన ముగ్గురు వ్యాపారస్థులను పోలీస్ స్టేషన్ నుండి జిల్లా కోర్టుకు తీసుకెళ్ళుతున్న దృశ్యం.




కేంద్ర ఆహార, వ్యవసాయ, సమాజాభివృద్ధి శాఖల డిప్యూటీ మంత్రి శ్రీ ఎస్. డి. మిశ్రా, పశ్చిమ గోదావరి జిల్లాలోని చోడిమెల్లలో తోటలను సందర్శించిన దృశ్యం.



ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతీయ సంఘం అధ్యక్షులు శ్రీ టి. హయగ్రీవాచారి, జూలై 28న హయత్‌నగర్ సమితిలోని మల్కాజిగిరిలో బ్రాంచి లైబ్రరీ ప్రారంభోత్సవం సందర్భంలో అధ్యక్షోపన్యాసం యిస్తున్న దృశ్యం.

ప్రభుత్వ ముద్రణాలయం డైరెక్టరు, శ్రీ ఆర్. విఠల్‌రావు, ఐ.ఎ.ఎస్., జూలై 28 రాజమండ్రిలో ప్రింటింగ్ యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంలో ప్రసంగిస్తున్న దృశ్యం. న్యాయ, జైళ్ళ, ధర్మాదాయ శాఖల మంత్రి శ్రీ పి.వి. నరసింహారావు అధ్యక్షత వహించారు.



	మొదటిదశలో జరిగేపని	ఆఖరుదశలో జరిగేపని
(1.) ఆనకట్ట :		
లోతుపునాదిపై		
ఆనకట్ట ఎత్తు		
(అ) రాతి ఆనకట్ట :	... 409 అడుగులు	.... 409 అడుగులు.
(ఆ) రాతి ఆనకట్టకు రెండువైపులా మట్టి కట్టలు :	85 ,,	85 ,,
(ii) రిజర్వాయరు :—		
(అ) నీటి నిలువశక్తి	... 6.55 మిలియన్ ఎకరాల అడుగులు	... 9.18 మిలియన్ ఎకరాల అడుగులు
(ఆ) రిజర్వాయరు నీటి నిలువ విస్తరణ	.... 87.45 చదరపు మైళ్లు	.... 110.00 చదరపు మైళ్లు
(iii) కుడి కాలువ :—		
(అ) ప్రధాన కుడికాలువ పొడవు	... 127 మైళ్లు	.... 235 మైళ్లు
(ఆ) నీటి విడుదలశక్తి	... 11,000 క్యూసెక్కులు	.... 21,000 క్యూసెక్కులు
(ఇ) నీటి పారుదల విస్తీర్ణం	... 11.20 లక్షల ఎకరాలు	.... 20.58 లక్షల ఎకరాలు
(iv) ఎడమ కాలువ :—		
(అ) ప్రధాన ఎడమకాలువ పొడువు	... 111 మైళ్లు	.... 218 మైళ్లు
(ఆ) నీటి విడుదలశక్తి	.... 11,000 క్యూసెక్కులు	.... 15,000 క్యూసెక్కులు
(ఇ) నీటి పారుదల విస్తీర్ణం	.... 8.80 లక్షల ఎకరాలు	... 10.00 లక్షల ఎకరాలు.

కొద్ది రోజులక్రితం నాగార్జునసాగర్ నుండి రెండు కాలువలకు నీరు విడుదల చేయబడింది. దీనివల్ల ఆంధ్రప్రదేశం సస్యశ్యామలమవుతుంది. ప్రతి రోజూ, ప్రతి నెలా భారతదేశంలో ఏదో ఒక చోట ఏదో ఒక పథకం కార్యరూపం ధరిస్తూ ఉంటుంది. ఈ అభివృద్ధి ఎంతో ఆశ్చర్యాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తుంది కొన్నేళ్ళ క్రితం నేను నాగార్జునసాగర్ ప్రాంతానికి వెళ్ళిన విషయం నాకు గుర్తుంది. రెండు దృశ్యాలు ఇప్పటికి నాకన్నులముందు మెదులుతూ ఉంటాయి. మొదటిది—ఈ మహత్తర ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగించే అపారమైన మానవశక్తి—ఆనకట్ట నిర్మాణాన్ని ఎత్తుకు, యింకా ఎత్తుకు నిర్మించడానికి వెదురుగడలతో కట్టిన ఎత్తైన అంచెలపై చీమలబారులా నిల్చిన మానవుల వరుస. ఇక రెండవ విషయం—నాగార్జునకొండ పురాతన స్థలం. హిందూ రాజులు, బౌద్ధరాణులతో ఇక్ష్వాకుల రాజరికం. ప్రసిద్ధ బౌద్ధాచార్యులు, మహాప్రవక్త ప్రతిష్ఠాపించిన నాగార్జున విశ్వవిద్యాలయం, పురాతన రోమ్‌తో వాణిజ్య సంబంధాలు గలిగిన విపణి వీధి—ఇప్పుడివన్నీ కృష్ణా జిల్లాలో మరుగున పడినాయి. 2000 సంవత్సరాల క్రితం ఆచార్య నాగార్జునుడు వెదజల్లిన విజ్ఞాన భూమిలో నేడు నాగార్జునసాగర్ క్రొత్తజీవనాన్ని ప్రసాదిస్తున్నది.

గతంతోగల యీ అనుబంధమే భారతదేశ ప్రత్యేకతగా పేర్కొనవచ్చు.

—శ్రీమతి ఇందిరాగాంధీ
భారత ప్రధాన మంత్రి

నాగార్జునసాగర్ నుండి నీరు విడుదల

ఆగస్టు 3వ తేదీ ఉదయాన ప్రప్రథమంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టునుండి కుడి, ఎడమ కాలువలకు ప్రయోగాత్మకంగా నీరు విడుదలచేయబడింది. ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని ఇంజనీర్లు వర్ణించారు.

నీరు విడుదల కార్యక్రమాన్ని గూర్చి, ఆంధ్ర ప్రభ దినపత్రిక 4 వ తేదీ సంచికలో సంపాదకీయంలో ఇలావ్రాసింది :

'' నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆయకట్టులోని భూములకు నీరు విడుదలచేయడం ప్రారంభమయింది. బ్రహ్మాండమైన యీ ప్రాజెక్టు ఇక క్రమాధికంగా విస్తరిల్లుతూ దేశం తమకంతో ఎదురుచూస్తున్న సత్ఫలితాల నివ్వగలదు. ఒక్క ఆంధ్రప్రదేశానికే కాక యావద్భారతదేశానికే గర్వకారణం కాదగిన మహా నిర్మాణమిది ''. '' విడుదలయైన నీటిని సద్వినియోగ మొనర్చుకొని రైతులు సాగు ప్రయత్నాలు దీక్షతో కొనసాగించడమే కావాలి. పొలాలను సాగు లాయఖీచేసే కార్యక్రమ నిర్వహణకై రైతులకు ఋణసౌకర్యాలు ఏర్పాటు చేయబడిన సంగతి తెలిసినది. రైతులు తమ విధులను తాము ఒక్క ప్రక్క నిర్వహిస్తూ ఉండగా ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని అనుకొన్న ప్రకారం పూర్తిచేయవలసిన అవసరం ఉన్నది.......''

ప్రాచీన బౌద్ధుల చరిత్ర, ఆంధ్ర సంస్కృతితో పెనవైచికొని ఉన్న నాగార్జునసాగర్ ఒక బ్రహ్మాండమైన ప్రాజెక్టుగా నిర్మించ బడుతున్నది. ఈ పథకం అమలుకు రు. 140 కోట్లు ఖర్చవుతుందని అంచనా, రాష్ట్ర మూడవ ప్రణాళిక నివేదికను అనుసరించి పూర్తిగా అభివృద్ధి అయిన తర్వాత ఈ నీటిపారుదల కాలువ ప్రపంచంలో అతి పెద్దదిగా ఉంటుంది. నాగార్జునసాగర్ ఆనకట్ట ప్రపంచంలో అతి పెద్ద ఆనకట్టలలో మూడవది. మొదటి దశలో రాతి ఆనకట్ట నిర్మాణం, 135 మైళ్ళ వరకు కుడి కాలువ, 108 మైళ్ళ వరకు ఎడమ కాలువ త్రవ్వకం పూర్తి అవుతుంది. దీని ద్వారా 20,60,000 ఎకరాలకు నీరు లభిస్తుంది. ప్రారంభంలో 5,80,000 ఎకరా ఆయకట్టుకు ప్రయోజనం కలుగుతుంది.

ఈ ప్రాజెక్టువల్ల ఒనగూడే బహుళ ప్రయోజనాల దృష్ట్యా, దీని నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరలో పూర్తిచేయడానికి తీవ్ర కృషిచేయాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రప్రభుత్వం తనకు తానుగా తగిన నిధులను కేటాయించాల్సిన స్థితిలోలేదు. కొన్ని రోజుల క్రితం మంజూరు చేయబడిన ఒక కోటి రూపాయలతో సహా ఈ ప్రాజెక్టు నిమిత్తం రు. 107.00 కోట్ల ఋణం లభించింది. అయితే ఇంకా ఎక్కువ మొత్తం కావాల్సి ఉన్నది. అవసరమైనప్పుడు డబ్బు లభ్యంకావడం లేదు. సాధ్యమైనంత త్వరలో యీ పథకం అమలును పూర్తిచేయాల్సి ఉన్నది. ★



జరిగిన కథ

పార్థసారథికి నాటకాలపిచ్చి. రాత్రిళ్ళు మరీ ఆలస్యంగా వచ్చేవాడు. భార్య ఓరోజున కాస్త కోపంగా మాట్లాడేసరికి, తింటూ తింటూన్న అన్నం వదిలేసి లేచి వెళ్ళిపోయాడు. భార్య-విజయలక్ష్మి వెనకటి రోజుల్ని తలంచుకుంటూ కూర్చున్నది. ఆ రోజుల్లో ఆయన చాలా ప్రేమగా మెలగేవాడు. పుట్టింటికి వెళ్ళిన విజయలక్ష్మిని రప్పించడానికి పార్థసారథి ఒక ఎత్తు వేశాడు. అకస్మాత్తుగా మామగారింటికి వెళ్ళి, వారెంత చెప్తున్నా వినిపించుకోకుండా భార్యను ప్రయాణం కట్టించాడు.

అంతలోనే పార్థసారథి భార్య దగ్గరికి వెళ్ళి 'ఏం? ఇప్పుడు నాతో వస్తావా! రావా?' అని కొంచెం గట్టిగానే గద్దించి అడిగాడు. ఆ విధంగా హఠాత్తుగా బయలుదేరి వెళ్ళడం విజయలక్ష్మికి బొత్తిగా రుచించలేదు. కాని ఏమిచేయగలదు? కొంచం నెమ్మదిగా పార్థసారథికి చెప్పి చూచింది. కాని అతడు తనపట్టు విడిచిపెట్టలేదు. మరి గత్యంతరం లేక గుసగుసలాడుతూ పెడమొఖం పెట్టుకుని నిలబడింది.

వర్ధనమ్మ ఇకలాభంలేదని గ్రహించుకుని విజయలక్ష్మిని తొందర తొందరగా ప్రయాణం చేయించింది. మనమరాలిమీద మమకారంకొద్దీ తానుకూడా వెంటవెళ్ళాలని నిశ్చయించుకుంది. ఇరుగుపొరుగు అంతా అకస్మాత్తుగా గుర్రపుబండి రావడం గమనించి వీథి గుమ్మాలలో నిలబడి ఎంతోవిస్తుపోతూ ఆ హంగామా అంతా పరిశీలించారు. మరికొంత సేపటికి ఆ బండి ఒక్క రొడుతో అక్కడనించి వెళ్ళిపోయింది.

భర్త దురుసుతనం, మొరటుతనం గమనించి విజయలక్ష్మి అత్తవారింట ఇంకా ఎన్ని కోత లనుభవించవలసి వస్తుందో అని ఎంతయినా భయపడింది. కాని అటువంటిదేమి ఎన్నడు ఎదురుపడలేదు. అత్తింట అడుగుపెట్టిన తరువాత అసలు అత్తగారేమాత్రం జబ్బుపడినట్టే కనబడలేదు! నిక్షేపంలా తిని తిరుగుతూవుంది! జబ్బుసంగతి అడిగిన తరువాత ఎంతో ఆశ్చర్యపడింది. తన కిమధ్యన ఎన్నడూ పులకరంకూడా తగలలేదన్నట్టు మాట్లాడింది! దానినిబట్టి తల్లికి జబ్బు చేసినట్టు కట్టుకథ కలిపించి భర్త ఒక నాటకం ఆడినట్టు గ్రహించడానికి విజయలక్ష్మికి ఎంతోసేపుపట్టలేదు. అంతేకాదు! ఆ సంగతి అత్త మామ లిద్దరికి ఏమాత్రము తెలియదనికూడా కనిపెట్టింది. ఆనాడే పార్థసారథిని ఆ సంగతి గట్టిగా నిలవదీసి అడిగింది. అతడు లీలగా నవ్వి భార్యను అక్కున జేర్చుకొని 'విజయా! నువ్వు వెళ్ళిన తరువాత నా కొక్క క్షణంకూడా తిన్నగా నిద్రపట్టలేదు. ఏమిచెయ్యను! మరి మా అమ్మకి అలాగా జబ్బు చేసినట్టు నాటకం ఆడక తప్పలేదు! నిజమే! మా వాళ్ళెవ్వరికి ఈ గొడవే తెలియదు!' అని ఉన్న సంగతి కాస్త చల్లగా బయటపెట్టాడు.

పుట్టింటినుంచి వచ్చినప్పటినుంచి పార్థసారథి భార్యనెంతో ఆప్యాయంగా, ఆత్మీయంగా కళ్ళ కద్దుకున్నాడు. ఆ రోజుల్లో అతడొక్క క్షణమయినా విజయలక్ష్మిని విడిచి ఉండలేకపోయేవాడు! ఏ వేళ ఏ నాటకానికయినా వెళ్ళినా మధ్యలోనే తిరిగివచ్చివేసేవాడు. ఎటువంటి విలువయిన చీరమీద ముచ్చట పడినా; నగ, నట్రా కావాలనుకొని ఉవ్విళ్ళూరినా మున్ముందుగానే గ్రహించుకుని అకస్మాత్తుగా బహూకరించేవాడు.! పిల్లవాడు కలిగిన తరవాత అత్త మామలు, పార్థసారథి విజయలక్ష్మి నిక నేలమీద నడవనీయలేదు. ఆ తరవాత ఏడాది లోపుగానే ఏడెనిమిది నెలల

తేడాతో అత్తమామ లిద్దరు గతించారు. ఆ విచారంతో పార్థసారథి పొద్దస్తమానము ఇంటిదగ్గరే ఉండిపోయేవాడు. క్రమ క్రమంగా ఆ దుఃఖం వెనకబడిన కొద్దీ ఆస్తిపాస్తుల వ్యవహారాలన్నీ ఎంతో చాకచక్యంతో స్వయంగానే చక్కబెట్టుకున్నాడు!

అలాగలాగ మరికొన్ని నెలలు గడిచిన తరవాత ఇంటి దగ్గర బొత్తిగా ఏమీతోచక, స్నేహితులతో కలిసి చీటికి మాటికి నాటకాలు చూడడం ప్రారంభించాడు. మరికొంత కాలానికి ఆ ఉబలాటం క్రమక్రమంగా వాటిలో వేషాలు వెయ్యడందాకా కూడా వెళ్ళింది. అప్పటినించి అతనికంతగా ఇంటిదగ్గర కాలు నిలవలేదు. ఆ రోజులలో విజయలక్ష్మి దసరా పండుగలకని పుట్టింటికి వెళ్ళింది. ఆ తరువాత అయిదారు వారాలు గడిచినా ఆమె అత్తవారింటికి తిరిగిరాలేదు. అదే సమయంలో అతనొక నాటకం కంపెనీతోకలిసి పై ఊళ్ళకి వెడుతున్నట్టు తెలిసింది. ఆ గొడవల్లోపడి పార్థసారథి భార్యని తిరిగి పంపించమని అడగడంలోకూడా బాగా అశ్రద్ధగా ఉన్నట్టు కనిపించాడు. విజయలక్ష్మికి ప్రాణం విసిగి మరి వేచిఉండలేక తానే స్వయంగా భర్తపేర ఉత్తరం రాసి వెంటనేవచ్చి తీసుకువెళ్ళ వలసిందని తొందరపెట్టింది. కాని ఇంకా మరికొన్నాళ్లు గడచిన తరవాతగాని పార్థసారథి వచ్చి తీసుకువెళ్ళడం పడలేదు!

సంసార బాధ్యత బాగాపై బడిన తరవాత పార్థసారథి క్రమక్రమంగా దారికి రాగలడని అత్తమామ లాశించారు. కాని వ్యవహారం వారనుకున్నదానికి బాగా వ్యతిరేకంగా పరిణమించింది. ఆ నాటి కానాటికి అతని నాటకాల వ్యామోహం మరింతగా పెరుకొన్నదేగాని రవ్వంతయినా తగ్గలేదు. అయినా విజయలక్ష్మి అధైర్యపడలేదు. కాని ఎన్నడూ ఆమె గీసిన గీటుదాటని మనిషి నానాటికి తిన్నగా మాట వినిపించుకోవడమే మానివేశాడు. అయినా ఆమె అంతగా నొచ్చుకోలేదు. కాని ఇటీవల అతనిరాక ఆలస్య మవుతున్న కొద్దీ విజయలక్ష్మి మనస్సులో బాగా ఆరాటం బయలుదేరింది. అయితే వర్ధనమ్మ మనమరాలిని ఓదార్చి క్రమ క్రమంగా అన్నీ అవే సర్దుకు పోగలవని ధైర్యం చెప్పింది. కాని విజయలక్ష్మి కంతగా ఊరటకలగలేదు. వెనకటి రోజుల్లో పార్థసారథి ఆపేక్ష, ఇటీవల ఉపేక్ష తలుచుకున్న కొద్దీ ఆమె గుండెల్లో పెద్ద గుబులు బయలుదేరింది. చెక్కిళ్లమీద కన్నీరు ధార కట్టి ప్రవహించింది.

మరునాడు జాము పొద్దెక్కినదాక పార్థసారథి నిద్ర లేవలేదు. విజయలక్ష్మి మాటిమాటికి మేడమీదికి వెళ్లి తొంగి చూసింది. అతడలాగే నిద్రపోతున్నట్టు కనిపెట్టి తిరిగి వెళ్లి పోయింది. ఇంకొక అరగంట గడచిన తరవాత పార్థసారథి మేలుకోవడము, హార్మోనియంతో గొంతు కలిపి నాటకం పాట ప్రారంభించడము కూడా జరిగాయి. విజయలక్ష్మి కాఫీ గ్లాసుతో నెమ్మదిగా గదిలో ప్రవేశించింది. అతడామె వైపే చూడలేదు. అయినా దగ్గిరికి వెళ్లి కనురెప్పలల్లన వంచి కాఫీ అందించింది. పార్థసారథి అంటీ అంటనట్టు రెండు మూడు గుక్కలు తాగి, గ్లాసు పక్కనే ఉన్న బల్లమీద పెట్టి తిరిగి హార్మోనియం మెట్ల మీదికి వేళ్లు పోనిచ్చాడు. విజయలక్ష్మి క్షణకాలం భర్త ధోరణి పరిశీలించింది. కొంచెం పెడముఖంతో నెమ్మదిగా అడిగింది.

'ఈవేళ ఏమి వండమన్నారు ?'

'ఏదో నీకుతోచింది చెయ్యి, దీనికింత ఆలోచన ఎందుకు?'

ప్రతి పూట భార్య భర్త లిద్దరిమధ్య ఆనాటి వంటకాల మీద ప్రశ్నోత్తరాలిలాగే సాగుతుంటాయి! అయినా ఆమె తిరిగి అడుగుతూనే ఉంటుంది. కాని ఈనాటి సమాధానంలో ఎంతో చిరాకు, చిటపట ప్రతిధ్వనించాయి. విజయలక్ష్మి మరి కొంతసేపటివరకు మాట్లాడకూరుకుని కొంచెం బ్రతిమాలు కుంటున్నట్టు పలికింది.

'ఏంటండీ! మీకింతకోపం! ఎంతకీ నేనేమన్నానని! పోనీలెండి! ఇంక మీ ఇష్టంవచ్చినప్పుడే ఇంటికిరండి!'

చివరిమాటల్లో ఆమె కంఠంలో గద్గదిక బయలుదేరింది. దానితో పార్థసారథి బాగా మెత్తబడ్డాడు. భార్య భుజాలమీద చేతులువేసి రవంత దగ్గరికి తీసుకున్నాడు.

'నాకు మాత్రం ఇంకొకళ్ల ఇంట పడిగాపులు పడికూర్చోవడం సరదా ఏమిటిచెప్పు! వారం పదిరోజుల్లో నాటకం వెయ్యాలని అనుకుంటున్నాము. ఇందుచేత ఇంత ఆలస్యం అవుతూంది. నాటకం వేసిన తరవాత మరి ఆలస్యం కానివ్వనులే!'

ఆ వాగ్దానంతో విజయలక్ష్మికి కొంత సంతృప్తికలిగింది. ఆనాడు, మరునాడు పార్థసారథి ఇంటి పట్టున వుండి పోయాడు. స్వయంగావెళ్ళి చంటిపిల్లకి మందు తీసుకువచ్చాడు. చిన్న చిన్న ఛలోక్తులతో విజయలక్ష్మిని మాటి మాటికి కవ్వించి నవ్వించాడు. పిల్లలిద్దరిని దగ్గిర కూర్చోబెట్టుకుని హార్మోనియంతో గొంతుకలిపి సంగీత సాధన కొనసాగించాడు. కాని మరునాడు మధ్యాహ్నం చల్లబడిన తరువాత చక్కగా ముస్తాబయి ఇప్పుడే వస్తానని భార్యతో చెప్పి, చరచరా నడిచి వీధిలోకి వెళ్ళిపోయాడు. విజయలక్ష్మి కనబడినంతవరకు అతనివైపలాగే చూస్తూ నిశ్చలంగా నిలబడింది.

* * *

అది ఆ పట్టణం మధ్యనున్న మెరక వీధిలో ఒకే ఒకే అంతస్తున్న మేడ. అప్పటికి పొద్దు బాగావాలింది. అందుచేత ఆ మేడ చుట్టూరా దట్టంగా వేర్వేరుపూలతీగల నీడ అలము కొన్నాయి. బాగా ఏపుగా పెరిగిన కరవీరాలు ప్రహారీ గోడమీదినించి తలలు పైకెత్తి ఎర్ర ఎర్రని పూగుత్తులతో, కొమ్మలతో రెమ్మలతో ఒరగా ఒరిగాయి. కొంచం దూరంనించి చూసినా దాని పై అంతస్తుమీద రంగు రంగుల కిటికీలతెరల కదలికలు కనిపిస్తూంటాయి. కాని తరహాని బట్టిచూస్తే అది అంత సంపన్నుల మేడ అయినట్టు స్ఫురించదు.

అది గోదావరి కల్లంత దూరంలో ఉన్న పెద్దపట్టణం. ఇప్పుడు దానిజనాభా పెరిగి రెట్టింపు అయింది. కాని ఆ రోజుల్లో, అంటే 1925 ప్రాంతంలో అంతటి జనసంఖ్య లేదు. సామాన్యంగా మన పట్టణాల్లో కనిపించే ఎగుడు దిగుడు వీధుల ఎత్తు పల్లాలు, అక్కడక్కడ కంకర బయట పడిన ఇరుకు రోడ్ల గతుకులు, అక్కడ అడుగడుగునా ప్రత్యక్షమవుతుంటాయి. ఆ మేడ కిరు వైపుల ఇటు అటు విస్తరించిన రెండు మూడంతస్తుల పెద్ద పెద్ద మేడలనుబట్టి అది అంతగా కొట్టవచ్చినట్టు కనిపించదు. మెరక వీధిలో అంతటా వేర్వేరు రకాల దుకాణాలు, కిళ్ళీ కొట్లు, బట్టల షాపులు మొదలయిన వెన్నో కంటపడుతాయి. అందుచేత చీకటిపడినా ఆ వీధిలో జన సమ్మర్దం తగ్గదు. మాట మాటికి సోడా సీసాలు కొట్టిన సవ్వడులు, త్వర త్వరగా సాగిపోయే బళ్ళు, సైకిళ్ళ గంటల గణ గణ ధ్వనులు వినిపిస్తూనే ఉంటాయి.

అప్పటికి వానలు వెనుకపట్టి కొంచెం చిరుచలి ప్రారంభించింది. మెరక వీధిలో అక్కడక్కడ కనిపించే గంగ రావి, చింత మొదలయిన చెట్ల మీద పలచని నీరెండ పడింది. సన్నని చూర్ణం వంటి ధూళి రేణువలు నీరెండతో మేళ వించి నాలుగు వైపుల విస్తరించాయి. చెట్లకొమ్మల్లో కాకుల కోలాహలం స్పష్టాస్పష్టంగా వినిపించింది. మేడమీద అంతస్తులో హార్మోనియం ధ్వనిలో లీనమయిన నాటకంపాట సంగీతం సన్న సన్నగా ప్రతిధ్వనించింది. వాడిన కరవీ



రాలు కొన్ని నేలమీద రాలాయి. పెరటిలో మల్లెపందిరి చుట్టూ చంద్రకాంతలు, మందారాలు, గోరింతలు, సన్నజాజి వరసలు అప్పుడే వికసించినట్టు కలకల లాడుతూ, లీలగా కదలాడే గాలిలో తలలూగించాయి.

పార్థసారథి నెమ్మదిగా వీధిగుమ్మం తలుపు తట్టి సమాధానంకోసం క్షణకాలం నిరీక్షించాడు. ఆ అలికిడి వినగానే తటాలున తన పాట కట్టిపెట్టి సరోజ తొందర తొందరగా కిందికిదిగివచ్చి తలుపు తీసింది.

'రండి! రండి! ఇందాకటినించి మీకోసమే ఎదురు చూస్తున్నాను!'

'ఎంతో మర్యాదగా అతనిని లోపలికి తీసుకు వెళ్ళింది.

'కొంచం కాఫీ తీసుకుంటారా!' ఆప్యాయంగా అడిగింది.

'అక్కరలేదు! ఇప్పుడే తాగివచ్చాను.'

పార్థసారథి రవంత పరధ్యానంగా సమాధానం చెప్పాడు.

'ధోరణిచూస్తే తాగివచ్చినట్లే కనబడుతున్నారుగాని, మళ్లీ కొంచం పుచ్చుకుందురుగాని! మరేం పరవాలేదులెండి!'

ఆ ఛలోక్తితో చకితుడై కిల కిల నవ్విన పార్థసారథి అక్కరలేదని అంటున్నా వినిపించుకోక, సరోజ చకచకా క్రిందికి దిగి వెళ్లింది. మళ్లీ అయిదారు నిమిషాలలోనే సొగసయిన పింగాణీ కప్పులమర్చిన వెండిపళ్ళెంతో నెమ్మదిగా

అడుగులు వేసుకుంటూ పైకివచ్చింది. హాలులో సోఫాలో కూర్చున్న పార్థసారథికొక కప్పు అందించి, పక్కనే తానింకొక సోఫాలో చతికిలపడింది. ఒరకంటితో క్షణకాలంపాటు అతని ముఖం పరిశీలించింది.

'నిన్న మీరు వస్తారేమోనని చాలాసేపు పడిగాపులుపడి కూర్చున్నాము. చిట్టచివరికి ప్రాణం విసిగి ఎవరి మానాన వాళ్లు వెళ్లిపోయారు. ఏం రాలేదేం?'

పార్థసారథి అంటీ అంటనట్టు నసిగాడు.

'వద్దామనే అనుకున్నాను కాని, కుదరలేదు. ఇంటిదగ్గిర తలవనితలంపుగా ఒక అవాంతరం వచ్చిపడింది!'

'ఏమిటా అవాంతరం?'

'పసిపిల్లకి ఒంట్లో బాగుండడంలేదు. మందు తేవలసి వచ్చింది.'

'ఉత్తది! అనవసరంగా ఆ పసిదాని మీద పెట్టకండి!... మీరెందుకు రాలేదో నాకు తెలియదనుకున్నారా!...అసలు సంగతి బయటపెట్టమన్నారా?'

సరోజ కొంటెగా కవ్విస్తూ అడిగింది.

'ఏమిటా అసలు సంగతి! ఎప్పుడులేనిది ఇప్పుడు నీకీ అనుమానం ఎందుకు కలిగింది.'

'ఇన్నాళ్లనించి మీరెప్పుడు రిహార్సల్ తప్పించలేదు. అందుకని—'

'ఓ ఇదా నీ అనుమానం! అయితే నామాటమీద నమ్మకం కలగలేదన్నమాట! అంతేనా?'

'కలక్కేం? కలిగింది. ఊరికే వేళాకోళానికని అడిగాను! అంతే!'

'అలాగా! సరే దీనికేంగాని, నేను మొన్న చెప్పిన కొత్త పాట ఎంతవరకు వచ్చింది? కొంచెం పాడరాదూ వింటాను!'

'బాగానే వచ్చినట్టుంది! అయితే అయినదానికి కాని దానికి వంకలు దిద్దకూడదు మరి!'

సరోజ కొంచెం కాఫీ తీసుకుని హార్మోనియం దగ్గిర కుర్చీలో కూర్చుని నెమ్మదిగా ఆ కొత్త పాట మొదలుపెట్టింది. మధ్య మధ్యన కనురెప్పలు పైకెత్తి చిరు సిగ్గుతో చిలిపి నవ్వులు చిలకరిస్తూ మాటిమాటికి అతనివైపు చూస్తూ క్రమ క్రమంగా గొంతుస్థాయి హెచ్చించింది.

సరోజ శరీరంవన్నె రవంత నల్లదనంతో నిగ నిగతో కలిసిన చామనచ్ఛాయ. ఆమె వయస్సు ఇంతని నిర్ణయించడం కష్టంకాని ఇంచుమించుగా ఇరవై అయిదు ఏళ్లుండవచ్చును. సరోజ సామాన్యంగా చాలా కులాసాగా ఉన్నట్టు కనబడుతుంది. దానికొక ప్రత్యేక కారణమేమి లేదు. స్వతః ఆమె స్వభావమే అంత. కనకనే నల్ల నల్లని ఆమె సోగకళ్లెప్పుడూ కల కల లాడుతూ ఉంటాయి. మొత్తంమీద ఆమె రవంత పొడగరి. కాని సన్నగా సళాకులా ఉన్నదని మాత్రం చెప్పడానికి వీలులేదు.

హార్మోనియం మెట్లమీద ఆమె వేళ్లు నెమ్మదిగా పరుగులు పెడుతుంటే బంగారు గాజు లటు ఇటు చెంగలించాయి. చెక్కిళ్ళమీద తెల్లరాళ్ళదుద్దులతో బాటు లోలక్కులు రెండు తళుక్కుమని మెరిశాయి. లేత ఊదారంగు సిలుకుచీర పైట రవంత ప్రక్కకి తొలిగింది. అంతలోనే ఆమె అది సర్దుకుని, చిరుసిగ్గుతో కుంచించుకుపోయి గొంతు కొంచం తగ్గించింది. సరోజ కంఠంలో అంత గాంభీర్యంలేదు. కాని చక్కని లాలిత్యంతో మేళవించిన శ్రావ్యత కొరతలేదు. పార్థసారథి రెప్పపాటయినా వేయకుండా ఆమె ముఖంమీద ప్రతిఫలించే పాటు భావచ్ఛాయల గమకాలు పరిశీలిస్తున్నాడు.

మరు క్షణంలోనే ఆ పాట, దానితోబాటు హార్మోనియం తటాలున నిలిచిపోయాయి. "ఏం, ఎందుకలాగ హఠాత్తుగా ఆపివేశావు?" ఎంతో ఆశ్చర్యపడి అడిగాడు పార్థసారథి. "మీరు తిన్నగా వింటున్నారో లేదోనని!" సరోజ గొంతులో కొంటెతనం స్పష్టంగా స్ఫురించింది.

"అలాగ చెప్పు మరి! అందుకనే పాట తిన్నగా హార్మోనియంతో కలవడంలేదు!"

"అందుకనే అంటే? — మీ మాట నాకు తిన్నగా తెలియలేదు. ?

ఆమె నుదుటిమీద జిజ్ఞాసార్థకంగా సన్నని బొమముడి విరిగింది.

"నేను తిన్నగా వింటున్నానో లేదోనని కనిపెడుతూ కూర్చుంటే పాట ఎలాగ కలుస్తుంది?"

"నేను మొట్టమొదటే అనుకున్నాను! మీరు వంకలు దిద్దక మానరని! పోనీ ఒకసారి తిన్నగా పాడి వినిపించరాదూ." సరోజ కొంచెం విసుగ్గా అడిగింది.

పార్థసారథి వెంటనేలేచి ఇంకొక కుర్చీ బాగా దగ్గరగా లాక్కుని కూర్చుని హార్మోనియం మెట్లమీద చెయ్యి వెయ్యబోయాడు. ఆ సమయంలో అతని భుజం సరోజ భుజానికి రాసుకుంది. మరుక్షణంలోనే ఆమె తనభుజం తటాలున వెనక్కు లాక్కుని కుర్చీతోబాటు కొంచెం దూరంగా జరిగింది.

పార్థసారథి అది గమనించినా గమనించనట్టే తన పాట కొనసాగించాడు. అతనిది చక్కని ఒదుగులున్న గౌశగాత్రం. అలాగ ఇంకొక పావుగంట సేపటిదాకా పార్థసారథి పాడుతూనే ఉన్నాడు. సరోజ అంతవరకు నిశ్చల దృష్టితో అతనివైపు చూసింది.

పార్థసారథి పొడుగాటి సిలుకు లాల్చీ తొడుక్కున్నాడు. అతని వేళ్లు క్రమ క్రమంగా అప్రయత్నంగా, అతి

త్వరితంగా మెట్లమీద పరుగు లారంభించాయి. ఆ తరుణంలో అతని మణికట్టుమీద బంగారు గొలుసు తొందరగా అటు ఇటు కదిలింది. గొంతు హార్మోనియంతో చక్కగా శ్రుతి కలిపింది.

పార్థసారథి ముక్కు, ముఖము గుండ్రనివి. అంతగా పెద్దవి కాకపోయినా అతనివి మెరక కళ్లు. అందుచేత అవి పెద్దవనుకున్నట్టే కనిపిస్తాయి. నల్లని ముంగురులు నుదురు మీద జీరాడుతుంటే అవి మాటి మాటికి సరిదిద్దుకోవడం అతనికొక అలవాటు. పార్థసారథి పాట ఇంకా పూర్తి కాలేదు. అంతలోనే సరోజ రవంత విసుగుతో, చిరాకుతో, చిరునవ్వుతో అడ్డుకుంది.

"సరే మీ పాట మాటకేంగని నా పాటమాత్రం ఏమంత తీసిపోయింది ?"

"తీసి పోయిందనలేదు. హార్మోనియంతో బాగా కలవలేదన్నాను. అంతే !"

"మీరెప్పుడు అలాగే అంటారు ! నేనింక మీ దగ్గర పాటే నేర్చుకోను."

సరోజ మూతి, ముక్కు ముడుచుకుని బుంగమూతి పెట్టుకుని కూర్చుంది. తన మాటమీద ఆమెకంత కోపం రాగలదని పార్థసారథి ఊహించలేదు. నిజానికామె పాడే తీరు సరిదిద్దాలనే ఆ మాటలు అన్నాడు. అంతే! అందుచేత ఇప్పుడామె విసుగే అతనికెక్కువగా ఆశ్చర్యం కలిగించింది. అతడు అప్పుడప్పుడు సరోజ పాడేతీరు విమర్శించకపోలేదు. దానికెన్నడు ఆమె అంతగా నొచ్చుకన్నట్టు కనబడలేదు. మరి ఇప్పుడెందుకు వచ్చిందీ చిరాకు ? అతనికేమి బోధపడలేదు. కనకనే ఏమనడానికి పాలుపోలేదు.

అంతలోనే తటాలున హాలు తలుపు తెరుచుకుంది. రాఘవ మెరుపులా లోపలికివచ్చి, కుర్చీలో కూలబడ్డాడు. అతగాడు వారి నాటకబృందానికి సంబంధించిన ప్రముఖ నటుడు. వచ్చీ రాగానే రాఘవ పార్థసారథి కేసి చూసి ఆత్రంగా ప్రశ్నించాడు.

'ఏమిటయ్యా పార్థసారథి! నిన్న నువ్వు రాలేదేం? ఇంతకుమునుపే మీఇంటికి వెళ్లి అడిగాను! ఇప్పుడే ఇటు వైపు వెళ్లావని చెప్పారు? ఇలాగా నాగాలుపడితే మన నాటకం ఎప్పటికి తెములుతుంది ?'

అతడు దానికి సమాధానం చెప్పేలోగానే సరోజ తటాలున అందుకుని కొంచెం వెటకారంగా నవ్వింది.

'ఆయనకి ఇంటివగ్గర ఏదో తొందరపని వచ్చిపడిందట! పసిపిల్లకి బొత్తిగా ఒంట్లో బాగాలేదట !'

'ఓ హో ! అలాగా ! ఇప్పుడు నింపాదిగా ఉందా ?'

'ఆఁ నింపాదిగానే ఉంది.'

పార్థసారథి ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

'లేకపోతే ఒకవేళ ఇంటిఆవిడ ఇక్కడికి వెళ్లవద్దని అడ్డుకున్నారేమో !'

సరోజ క్రీగంటతో పార్థసారథి కేసిచూసి, రాఘవ వైపుతిరిగి చిన్నారిచిలిపినవ్వు చిలకరించింది. అతడు అవునన్నట్టు హేళగ నవ్వి, కాదన్నట్టు గట్టిగా సమర్థించాడు.

'అబ్బే ! అలాంటివాడు కాదులే ! మనవాడి సంగతి నీకు తిన్నగా తెలియదు ! చాలా మొండిఘటం !'

పార్థసారథి ముఖావంలో మార్పేమి కనబడలేదు. ఆ పైన వారి సంభాషణ క్రమక్రమంగా తాము కొత్తగా వెయ్యదలుచుకున్న కృష్ణ తులాభారం మీదికి తిరిగింది. ఆనాడు కూడా రావలసిన నటులందరు రాలేదు. ఇక రాగలరని కూడా వారెవ్వరు ఆశించలేదు. ఆ ముగ్గురు అంతకు మునుపే ఆ నాటకంలో ముఖ్యమయిన పాత్రల వ్యవహారం కొంత అస్పష్టంగా నిర్ణయించుకున్నారు. అవసరమయితే బాగా పేరు మోసిన పైవారి నెవరినైనా పిలవాలనికూడా నిర్ణయించుకున్నారు. అదే ఆలోచనతో అంతవరకు ఆ నాటకంలో కొన్ని రంగాల రిహార్సల్స్ ఆదరాబాదరాగా కొనసాగించారు. ఇక ఇప్పుడు స్థిరంగా నిశ్చయించుకోవలసిన అవసరం కలిగింది. పార్థసారథి ఆ నాటకంలో కృష్ణ పాత్రకు అన్నివిధాల తగినవాడని రాఘవ అనుకోకపోలేదు. అయినా ఆ వేషం వెయ్యాలని అతనికెంతయినా ఉబలాటం కలిగింది. కాని పైకిమాత్రం మాటవరసకి మర్యాదగా అన్నాడు.

'కృష్ణ వేషంకోసం మనం పైవాళ్లు నెవళ్లని పిలవనక్కర లేదనుకుంటాను. పార్థసారథి ఆ వేషం వేస్తే బాగానే రక్తికడుతుంది.'

దానికి అతడు మనసులో ఆనందించినా అలాగేఅని తన అంగీకారం వ్యక్తీకరించలేదు. అంతలోనే సరోజ చురుగ్గా పార్థసారథి కేసిచూసి ఉట్టిపడుతున్న అభిమానంతో రాఘవ వైపు తిరిగింది.

'ఏమో ! నామట్టుకి నాకు మీరే ఆ వేషం వేస్తే బాగుంటుందని అనిపించింది సుమండీ ! ఆపైన మీఇష్టం మరి !'

కాని రాఘవ దాని కంగీకరించలేదు. 'నేనా ? నేను వేస్తే బొత్తిగా బాగుండదు ! నా సంగతి నాకు తెలియదూ ? సారథి వేస్తేనే అన్నివిధాల దానికి తగినట్టుగా ఉంటాడు. నామట్టుకి నేను నారదుని వేషం వెయ్యాలని ఆలోచిస్తున్నాను. అంతే !'

'సరే ! మీ ఇష్టం !'

సరోజ తటాలున తలవంచుకుని తిరిగి హార్మోనియంతో గొంతుకలిపి పాట మొదలు పెట్టింది. పార్థసారథి ఆధోరణి గమనించి రవంత నొచ్చుకుని ఏదో ఆలోచనలో పడ్డాడు. తన సమాధానం నచ్చకపోవడం మూలాన్నే సరోజ ఆ విధంగా అకస్మాత్తుగా పాట ప్రారంభించిందని రాఘవ

క్షణంలో పసికట్టివేశాడు. నిజానికి కృష్ణవేషం వెయ్యడానికి అతనికి కొంత అర్హత లేకపోలేదు.

అయితే ఉన్నలోటంతా ఒక్క టే ! రాఘవ కొంచెంపొట్టి. కుదిమట్టంగా బొద్దుగా ఉంటాడు. పార్థసారథి, అతడు ఇంచుమించుగా సమానవయస్కులే! కాని రాఘవే పార్థసారథికన్న పెద్దవాడన్నట్టు కనిపిస్తాడు. శరీరంవన్నె రవంత నలుపుకలిసిన ఎరుపు. చిన్ననాటి స్ఫోటకం మచ్చల ఆనవాళ్లు కొన్ని ఇంకా ముఖంమీద అక్కడక్కడ కనిపిస్తాయి. జోరుగా సిగరెట్లు కాల్చడంవల్ల పెదవులు రెండూ నల్లబడ్డాయి. అసలు అతని పేరు రాఘవాచారి. బళ్ళారి రాఘవమీద పేరుకున్న అభిమానం కొద్దీ తన పేరలాగ కుదించుకున్నాడు. పార్థసారథికన్న అతడు కొంచెం ఎక్కువ ఆస్తి:పాస్తులున్నవాడు. బి. ఏ. చదువుకునే రోజులలోను, ఆ తరువాత అప్పుడప్పుడు కొన్ని నాటకాలలో పాల్గొన్నాడు. చంద్రగుప్తలో చాణక్యుడుగా కొంత పేరు తెచ్చుకున్నాడు.

సరోజ నెమ్మదిగా తనపాట ముగించింది.

'చాలా చక్కగా పాడారే!' గొప్పగా మెచ్చుకున్నాడు రాఘవ.

'నిజంగానేనా ? తిన్నగా శ్రుతిలో కలవలేదేమో అని భయపడుతున్నాను.'

ఉప్పొంగిపోతూ అడిగింది సరోజ.

'నాకు ఇచ్చకాలు బొత్తిగా చేతకావు! ఇంతకుమునుపు ఎప్పుడు ఇంతగొప్పగా పాడలేదు !'

తిన్నగా ఆకాశానికే ఎత్తివేశాడు రాఘవ.

ఆ సంభాషణ జాగ్రత్తగా వింటూన్నా, పార్థసారథి తన ముఖభావం సడలించలేదు. పైగా ఏదోఆలోచిస్తున్నట్టు పరధ్యానంగా ఉన్నట్టు నటించాడు.

ఆపైన సరోజ రాఘవకుర్చీదగ్గరికి వెళ్లి దానిమీద కొంచెం ఆనుకుని గోముగా ముఖంపెట్టి అడిగింది.

'ఏమండీ ! మీరీపాట ఒకసారి పాడరూ ? వినాలనిఉందండీ'

సరిపోయింది! నేనిప్పుడు పాటకచేరి మొదలుపెడితే ఎలాగ? ఈ వేళ కొంత కాకపోతే కొంతయినా రిహార్సల్ జరపాలిగా ! ఇంకోసారి ఎప్పుడయినా పాడుతానులే !'

అయినా సరోజ తనపట్టు విడిచిపెట్టలేదు. రాఘవ మరికొంత నేపు బెట్టుసరిచేసి హార్మోనియం దగ్గర కుర్చీలో కూర్చుని మరి గత్యంతరం కనబడలేదన్నట్టు ముఖంపెట్టి పాట మొదలు పెట్టాడు. సరోజ అతని పక్కనే నిలబడి ఏకాగ్రదృష్టితో పాడే ముఖభంగిమ పరిశీలించింది. మరికొన్ని నిమిషాలలో పాట ముగిసింది. సరోజ అతనికుర్చీమీద మరింత ఒయ్యారం ఒలకబోస్తూ ఆనుకుని పైట సవరించుకుంటూ గొప్పగా మెచ్చుకుంది.

'ఆహా! ఎంతబాగా పాడారు! ఇక ఈ వేళనించి నాటకం పాటలు మీదగ్గరే నేర్చుకుంటాను. కాస్తచెబుతారా !'

'పార్థసారథి చెబుతున్నాడుగా !'

ఆమె కంఠంలో విపరీతమైన అనాసక్తి స్ఫురించింది.

'ఏంచెప్పడం ? ఏదోవానాకాలం చదువులాగ సాగుతూంది ! ఒక్కనాడు వస్తే ఆ మర్నాడే మానివేస్తున్నారు ! అదీగాక చీటికి మాటికి తప్పులు పడుతున్నారు. నేనింక మీదగ్గరే నేర్చుకుంటాను బాబూ !'

సరోజ బుంగమూతి బిగించింది.

'ఊరికే చెబుతానని అనుకుంటున్నావేమో ! బాగా గురుదక్షిణ పుచ్చుకుంటాను మరి !. జాగ్రత్తగా ఆలోచించుకో !'

రాఘవ కొంటెగా చిరునవ్వు చిలకరించాడు.

ఆ ఛలోక్తితో సరోజ చెక్కిళ్లెర్ర బడ్డాయి. కనురెప్పలలో చిరుసిగ్గు తొణికిసలాడింది. కాని అంతలోనే మాటతప్పించి వేసింది.

'ఏమండీ ! అన్నట్టు ఈ ఉంగరం ఎప్పుడు కొన్నారండీ ! చాలా సొగసుగాఉందే !'

ఆమె అది అతి జాగ్రత్తగా పరీక్షించి నెమ్మదిగా తీసి తనవేలికి పెట్టుకుంది.

'ఎంతకి కొన్నారండీ !'

'పొడితోకలిసి ఆరువందలదాకా జరిగింది!'

ఆమె ఒయ్యారంగా రాఘవ మీదికి ఒరిగిన తీరు, ఆ మాట్లాడే ధోరణీ పరిశీలించగానే పార్థసారథి గుండెలో లోపలి పొరలంటుకున్నాయి. రాఘవ క్షణంలో అది పసికట్టి, అతనికేసి తిరిగి కొంతవిసుగుదలతో అడిగాడు.

'ఏమయ్యా ! ఇంక ఈవేళకి నాటకం రిహార్సల్ లేనట్టేనా ? నాకు కొంచం తొందర పని ఉంది ! త్వరగా వెళ్లాలి!'

'ఇప్పుడింకోక నాటకం నడుస్తూందిగా ! ఇదికానీ ! అసలు నాటకం సంగతి ఆతరవాత ఆలోచిద్దాంలే !'

పార్థసారథి సరోజకేసి చూసి వేళాకోళంగా నవ్వాడు.

ఆమె వెంటనే తన చిటికెన వేలికి పెట్టుకున్న ఉంగరం తీసి రాఘవ కందించి కోపంతో రుసరుస లాడుతూ పార్థసారథికి ప్రతి సమాధానం చెప్పింది.

'ఇది మరీచిత్రం ! ఉంగరం కాస్త వేలికి పెట్టుకోగానే నాటకం అయిపోతుందేమిటి ? ఇందుకనే మా మావయ్య మాటి మాటికి నాటకాల్లో వేషాలు వెయ్యవద్దని ఉత్తరాలు రాస్తున్నాడు ! అయినా సరదాపడి ఆయన మాట లక్ష్యపెట్టడంలేదు. నేనిక ఈనాటకంలో వేషం వెయ్యానే వెయ్యను !'

'ఇది మరీబాగుంది. నిజంగానే ఇక మన నాటకంలో వేషం వెయ్యదలచుకోలేదా?'

రాఘవ నిర్ఘాంతపడి అడిగాడు.

'వెయ్యనుగాక వెయ్యను! నాకు కోపమేరాదు గాని వస్తే ఇక అంతే!'

సరోజ మరింతగా మూతి, ముక్కు బిగించుకొని భీష్మించుకుని కూర్చుంది. రాఘవ రెండుమూడు క్షణాల పాటు ఆమెవైపు తేరి నిశితంగా పరిశీలించాడు.

'వేషం వేసినా వెయ్యకపోయినా ఇప్పుడు మాత్రం ముమ్మూర్తులా అచ్చంగా కోపంవచ్చిన సత్యభామలాగే ఉన్నావు! తెలిసిందా!'

ఆ ఛలోక్తితో సరోజ ఎంతగా ప్రయత్నించినా కొంచం నవ్వకుండా ఉండలేకపోయింది.

'చాలు చాల్లెండి! మీవేళాకోళాలు!'

అతని బుగ్గమీద నెమ్మదిగా అంటించబోయింది, కాని రాఘవ తటాలున తప్పించుకున్నాడు.

'ఇక లాభంలేదు! వ్యవహారం శ్రుతిమించి రాగానపడుతున్నట్టుంది! ఇక్కడ ఉంటే మరి పరువుకూడా దక్కేటట్టు కనబడడంలేదు! నేను వెళ్ళిపోతాను!.'

తటాలున కుర్చీలోనించి లేచాడు రాఘవ.

'నిజంగానే వెళ్ళిపోతున్నారా! వెళ్లకండి! కొంచం సేపుండండి!'

సరోజ అతని కెదురుగావెళ్ళి అడ్డుకుంది. 'అంటే మాత్రం లాభమేమిటి? నువ్వింక వేషం వెయ్యనన్నావుగా!.'

అదేక్షణంలో పార్థసారథి చిరునవ్వు చిందిస్తూ అందుకున్నాడు.

'మరి కొంచం సేపుండవయ్యా! నాటకం పూర్తికానీ! మాంచి రసకందాయం పట్టులో వెళ్ళిపోతే ఎలాగ?'

'కాదయ్యా! నాకు పనివుంది? నేను వెళ్ళాలి!' రాఘవ బయలుదేరాడు.

'మళ్ళీ ఎప్పుడొస్తారు?' సరోజ కంగారుపడుతూ అడిగింది.

'నువ్వింక వేషం వెయ్యనప్పుడు నేనింక వస్తేమాత్రం లాభ మేమిటి? ఇక రాదలచుకోలేదు!'

రాఘవ హాలుగుమ్మంవైపు నడక సాగించాడు.

'వెళ్ళకండి! వేషం వేస్తానులెండి!'

అంతలోనే పనిపనిషి హారికెన్‌లాంతరు అక్కడ పెట్టి వెళ్ళింది. ఆపైన రాఘవ మరింతగా ఆత్రపడ్డాడు.

'సరే, వేస్తే వస్తానులే. కాని ఇప్పుడుమాత్రం తొందరగా వెళ్ళాలి. తప్పదు.'

సరోజ మరికొంత సేపుండమని బ్రతిమాలుకుంటున్నా వినిపించుకోక, రాఘవ త్వరగా అక్కడినించి వెళ్ళిపోయాడు!

(సశేషం)

భక్తకవి - జయదేవుడు

దోర్బల వేంకటరాజశర్మ

భారతదేశ మాధ్యాత్మిక దేశము. కర్మభూమి. ముముక్షువులకు పుట్టినిల్లు. ఇట్టి దేశములో జన్మించి కొందరు పరమ వేదాంతులై జ్ఞానముతో మోక్షమును పొందిరి. వేదాంతులు "జ్ఞానాదేవహి కైవల్యం'' అని నుడివినారుకదా! మరి కొందరు యజ్ఞయాగాదులొనరించి స్వర్గసౌఖ్యముల ననుభవించిరి. ఇంక కొందరు శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పినట్లుగ ''భక్త్యా మామభిజానాతి" పరమ భాగవతోత్తములై, భక్తితో భగవంతుని దర్శించి, అతనిలో లీన మొందిరి. ఇట్టి భక్తాగ్రగణ్యులలో గీత గోవిందకారుడగు జయదేవుడొకడు.

నేటికి 600 సంవత్సరములకు పూర్వము బెంగాలు రాష్ట్రము వీర భూమిజిల్లా, తిందుబిల్వ గ్రామములో జయదేవుడు జన్మించెను. ఇతని తండ్రి భోజదేవుడు. తల్లి వామదేవి. బాల్యములోనే తల్లిదండ్రులు కాలధర్మమునొందిరి. అనాథుడగు జయదేవుడు అనేక కష్టములనుభవించి, మంచి సంస్కృత జ్ఞానము సంపాదించెను. బాల్యమునుండియే భగవంతుని తల్లి దండ్రులుగ తలంచుచుండెను.

జయదేవుని తండ్రి, ఆవూరి బ్రాహ్మణుని వద్ద అప్పు తీసికొని తీర్చలేకపోయెను. ఆ బ్రాహ్మణుడు జయదేవునిచేత తన యింటిమీద యేలాంటి అధికారము లేకుండ పత్రము వ్రాయించుకొనెను. పాపమితడేమి చేయగలడు? తరువాత ఆ విప్రుడు ఇతనిని యిల్లు వెడలగొట్టి, స్వకుటుంబముతోసహా యింటిలో ప్రవేశించెను. తక్షణమే యింటికి నిప్పు అంటుకొనెను. జయదేవుడు తొందరగ అగ్ని నార్పుటకు యింటిలోనికి పోయెను. అతడింటిలో ప్రవేశించిన వెంటనే అగ్ని చల్లారిపోయెను. దీనిని జూచి యాబ్రాహ్మణుడు జయదేవుని భగవంతుడు రక్షించుచున్నాడని తలంచి, వివేకముతో వ్యవహరించి, తానుకూడా భగవద్భక్తుడై జయదేవునితో సత్సహవాసము జేయుచుండెను.

జయదేవుడు పెద్దవాడు కాగానే జగన్నాథ క్షేత్రయాత్ర చేయవలయుననే కోరిక కలిగినది. పరాశరుడను బ్రాహ్మణుని తోడుజేసికొని, భజనజేయుచు, కీర్తనలు పాడుచు ఆ పుణ్యక్షేత్రమునకు బయలుదేరేను. మార్గ మధ్యములో ఆకలి దప్పులతో వివశుడయ్యెను. అప్పుడు భగవంతుడు గొల్ల పిల్లవాని రూపము ధరించి, జయదేవున కన్నపానములనిచ్చి సన్మార్గము చూపించెనట. ఇందులో అవంత వింతలేదు. భగవంతుడు భక్త రక్షకుడుకదా!

జయదేవుడు జగన్నాథ క్షేత్రయాత్ర జేసినప్పటినుండి యతని భక్తి దిన దినము వృద్ధియగుచుండెను. భగవద్భక్తిలో పరవశుడై శ్రీకృష్ణమహిమను గానముచేయు చుండెను. అతడు సంస్కృతములో కృష్ణుని గురించి కవితలల్లువాడు. కృష్ణుని అద్వితీయ ప్రేమను అత్యంత మనోహరముగ, అనన్య సామాన్యముగ వర్ణించువాడు. పరాశరుడీతని కవితలోని భావ గాంభీర్యమునకు, పదమాధుర్యమునకు, కవితా సౌందర్యమునకు ముగ్ధుడై, యతనికి మిక్కిలి యుత్సాహమును కలిగించుచుండెను. జయదేవుడప్పుడు "గీత గోవింద" గ్రంథమును రచించెను. అతడిందులో సంస్కృత మృదు మధుర పదములతో రాధాకృష్ణుల ప్రేమ నతిమనోహరముగ శృంగార రసాలంకారాది శోభితముగ, సంగీతలయానుబద్ధముగ వర్ణించెను. జగన్నాథ పురములో జయదేవుడు సన్యాసివలె జీవనము గడుపుచు, పరమ భక్తితో "గీత గోవింద'' అష్టపదులను రచించుచుండెను. ఇచ్చటనే యతడు పరమేశ్వరుని ప్రత్యక్షముగ సందర్శించెనని చెప్పుదురు.

ఒక సారి జయదేవుడు తీర్థయాత్రలు చేయుటకు బయలుదేరెను. దారిలో ఒక రాజాతనిని దర్శించి, నమస్కరించి, ఈతని భక్తికి, మహిమకు, విద్వత్తుకు అలరి తన యాస్థాన కవిగనుండుమని కోరెను. జీవితమును భగవదంకితము చేసిన జయదేవుడు భగవంతుని తప్ప యితరుల నాశ్రయించనని స్పష్టముగనుడివెను. రాజీతని కావ్యప్రతిభకు, మహిమకు సంతోషించి కొంత ధనము నిచ్చెను. తన కిష్టములేకపోయినను రాజు నిరుత్సాహ పడకుండ నుండుట కాధనమును స్వీకరించెను. త్రోవలో చోరులు ధనమును తీసికొని, కాలు సేతులు నరికి నూతిలో పడవేసి వెళ్ళిపోయిరి. కాని, జయదేవు డేమాత్రము దుఃఖించక బావిలో యీదుచు భగవన్నామ సంకీర్తనము భక్తితో చేయుచుండెను.

ఆనూతి సమీపమునుండి గౌడరాజు లక్ష్మణసేనుడు సపరివారముగ పోవుచుండెను. నూతిలో భజన చప్పుడువిని సేవకుల బంపి యాతనిని పైకితీయించెను. జయదేవుని పాండిత్యమును, కృష్ణప్రేమను, భక్తినిచూచి చాల సంతోషించి కొనియాడెను. రాజు జయదేవుని ప్రాణరక్షణ చేసి, అతని కృతజ్ఞతలకు పాత్రుడై, అతనిని తన ''పంచరత్న" సభాధ్యక్షుడుగ నుండుటకు ప్రార్థించి, అతనితో వాగ్దానము తీసికొనెను.

కొంతకాలము గడిచిన పిదప రాజ సభకు జయదేవుని దోచుకొన్న దొంగలువచ్చి, రాజుతో ''జయదేవుడు చాలా దుష్టుడు, మారాజు యతనిని చంపుమని మాతోచెప్పెను కాని, కనికరించి చంపక కాలుసేతులు నరికి నూతిలో దాచియుంచితి మని" చెప్పిరి. రాజు వీరి మాటలు విని విచారించుచుండెను. ఇంతలో నొకవింత జరిగెను. జయదేవుని దూషించిన దుష్టులు భూగర్భములో లీనమైరి. తరువాత జయదేవుని కాలుసేతులు యెప్పటివలె మంచిగైనవి.

జయదేవుని భార్య పద్మావతి పతివ్రతా శిరోమణి. ఆమె పతి ప్రేమను పరీక్షించుటకై ఒకసారి రాణి పద్మావతితో ''జయ

దేవుడు రాజు వెంట పోవుచుండగ దారిలో సింహమతనిని చంపి వేసినదని '' చెప్పెను. ఈ మాటలను వినిన వెంటనే పద్మావతి పతి నామము, కృష్ణుని నామస్మరణ సేయుచు మూర్ఛిల్లెను. వెంటనే వైద్యులువచ్చి చూచిరి కాని, అంతలోనే ఆమె శ్వాస కూడ ఆగి పోయెను. రాణి తాను చేసిన పనికి చాల పశ్చాత్తాప పడుచుండెను.

జయదేవుడింటికి వచ్చి, ఈ విషయమునంత విని మిక్కిలి దుఃఖించెను. నేనుజీవించి యుండగనే నా దుఃఖముతో నా ప్రియురాలెట్లు మరణించునని చింతించెను. అతడు స్థిర చిత్తముతో, నిశ్చల భక్తితో శ్రీకృష్ణుని కీర్తనలు గానము చేయు చుండెను. ఇంతలో నొక వింత జరిగినది. పద్మావతి నిద్ర నుండి లేచినట్లుగా లేచి, పతితో పాటు కీర్తనలు పాడుచుండెను. ఆహా ! భగవంతుని లీలలు అవాఙ్మానస గోచరములు. భక్త జనైక వేద్యములు. చూడుడు! జయదేవుని భగవద్భక్తి యెంతటి మహత్యముగలది ! అంతకన్న పతి కొరకు ప్రాణముల నర్పించిన సతీమ తల్లి యా పద్మావతీ పతిభక్తి యెంతటి మహిమగలది. సతికి పతియే దైవము గదా !

అటు పిమ్మట జయదేవుడు భార్యతో సహా తన గ్రామమునకు వెళ్ళి పోయెను. గీత గోవింద పదములను ప్రతి దినము వ్రాయుచుండెను. ఒక నాడతడొక గీతము యొక్క పాదమును పూర్తి చేయలేకపోయెను. అతడు లేని సమయమున శ్రీకృష్ణుడు ఆ పాదమును పూర్తి చేసెను.

జయ దేవుడంత '' గీత గోవిందమును '' పూర్తి చేసి సంసార సౌఖ్యముల రోసి, మనస్సుని దిన దినము వైరాగ్యము, భగద్భక్తి అధికము కాగా భార్యయగు పద్మావతి, స్నేహితులగు పరాశర, నిపంజన విప్రులతో సహా బృందావనమునకు వెళ్ళెను. అక్కడ జయదేవుడు భక్తితో శ్రీకృష్ణ నామసంకీర్తనలు గానము సేయుచు దేహము చాలించి శ్రీ కృష్ణ పరమాత్మలో లీనమయ్యెను. భగవద్భక్తులు ధన్యులు గదా !

జయదేవుని '' గీత గోవింద '' గ్రంథము భారతీయు లందరికి చిరపరిచితమే. సంస్కృతసాహిత్య, సంగీత విద్వాంసులు, గాయకులు గీత గోవింద కృతులను గానము సేయు చుండగ విని ఆ బాల గోపాల మానందించును. జయదేవ కవి విరచిత అష్ట పదులు మృదు మధుర పద శోభితములు. సర్వ జన సమ్మాన్యములు. చూడుడు. ''బాల గోపాల మా ముద్దర కృష్ణా ! పరమ కల్యాణ గుణాకరా, '' ''హేరసనే ! బృహి ముకుం దేతి, పాహిముకుందేతి '' మున్నగునవి యెంతటి భక్తి రస భరితములు. ఇంతటి మహిమాన్విత కృతులను రచించుట జయదేవ, పోతన, త్యాగరాజులవంటి కవిరాజులకే సాధ్య మగును. ఆంధ్ర దేశములో స్త్రీ పురుషులందరు కృష్ణ భక్తి భరితములగు తరంగములను, అష్ట పదులను సరసముగా కొసరి కొసరి పాడుచు, పాడించుకొనుచు, అమందానంద కందళిత హృదయారవిందులగుచుందురు. ఆంధ్ర ప్రదేశములో త్యాగ రాజ కృతుల కెంతటి ఆదరము గలదో జయదేవుని కృతులకు గూడ అంతటి ఆదరము గలదు. ఆచంద్రతారార్కము ఆబాల గోపాలము పాడు నట్లు కృతులు రచించిన జయదేవ, త్యాగరాజులు ధన్యులు. రామ కృష్ణావతారులు, సంస్కృత ప్రేమి కుల కందరికి జయదేవుడు అష్టపదులలో '' అమరుడు '' గ నుండ గలడు.

" జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః "



'నువ్వు జైల్లో వున్నన్నినాళ్ళూ నిచ్చెనలు తప్ప ఏ శిల్పాన్నయినా చెక్కొచ్చు'

కార్టూన్లు : సత్యమూర్తి





మన పిల్లలు ఒకళ్ళ నొకళ్ళు బాగా ఎరుగుదురు...

పంచవర్ష ప్రణాళికా కార్యక్రమంలో ఒక భాగంగా ఇండియాలో రోడ్డు రవాణా, రహదారి మార్గాల అభివృద్ధికై కోట్లకొలది ధనం వెచ్చించబడుతున్నది. ఇందువల్ల ఇతరత్రా వనగూరు ప్రయోజనాలు మాత్రమేగాక, సువిశాలమైన ఈ దేశంలో విభిన్న సంస్కృతులు, మతాలు కలిగివున్న విభిన్న దృక్పథాలతో వ్యవహరించే వివిధ ప్రాంతాల ప్రజలను సన్నిహితపరిచి వారి మధ్య సాముదాయిక ప్రవృత్తిని బలపరచడానికి ఇది దోహదకారి కాగలదు. ఎంత దూరంలోనున్న వారి మధ్యనైనా పరస్పరానురాగం, సమరస్య భావం కలగడానికి ఇది సాధనం కాగలదు.

1898లో ఇండియాకు మొదటి న్యూమాటిక్ టైర్లను తీసుకువచ్చినప్పటినుంచి, దేశంలో రవాణా సౌకర్యాల అభివృద్ధి కార్యక్రమంలో డన్‌లప్ ప్రముఖ పాత్ర వహించింది. కలకత్తా సమీపంలోని డన్‌లప్ ఫ్యాక్టరీ—ఆసియాలోని టైర్ల ప్లాంట్‌లు అన్నింటిలోనికి పెద్దది—అనేక రకాల టైర్లను, రవాణాకు, పరిశ్రమలకు అవసరమైన అనేక రకాల పరికరాలను ఉత్పత్తి చేస్తున్నది. రవాణాల అభివృద్ధిలో నిత్యమూ పెరిగిపోతున్న అవసరాలను తీర్చడానికిగాను 1959 లో అంబత్తూర్‌లో రెండవ డన్‌లప్ ఫ్యాక్టరీ స్థాపించబడింది.

డన్‌లప్ మార్గదర్శి

DC.444 F TEL

అడవి మల్లె

17

"నన్ను చూస్తుంటే నీకు నవ్వు వస్తుంది గదూ? అందని పండుకోసం ఎగిరేవాణ్ణి చూస్తే నవ్వురాక మరేం వస్తుంది?" స్వరంలో బాధ ధ్వనించింది. చంద్రం ముఖం రాహుగ్రస్తుడైన చంద్రుడిలా వుంది.

"ఏమిటి చంద్రం. మరీ అంత చిన్నపిల్లవాడిలా ప్రవర్తిస్తావు? నేను కాదన్నానా?"

"అయితే ఒప్పుకుంటున్నావా? నన్ను వివాహం చేసుకుంటావా?" చంద్రం సంతోషంగా హేమ రెండు చేతుల్నీ పట్టుకున్నాడు. హేమ వారించలేదు.

"అలాంటి ప్రశ్నలకు ఆడపిల్లలు అంత త్వరగా జవాబు ఎలా చెబుతారనుకుంటున్నావు?"

జరిగిన కథ

చిన్ననాడే తల్లిదండ్రుల్నికోల్పోయినచంద్రం, వదినద్వార దొంగగా ఆరోపించబడి, అమాయకపు స్త్రీ అయిన గౌరి సహాయాన బయట పడతాడు. ప్రకాశంను ఆత్మహత్యా స్థితినుంచి తప్పించి, అతని తండ్రి ఆదరణ ద్వార గొప్ప స్థితిలో కొస్తాడు. గౌరిని అనాథ శరణాలయంలో చేరుస్తాడు. ఆ తరువాత తాను చిరకాలంగా కలుసుకోవాలనుకున్న చిన్ననాటి స్నేహితురాలు హేమను కలుసుకుంటాడు. శరణాలయం నుంచి బయటపడిన గౌరిని ఆదరించి ప్రకాశం యింటికి దగ్గర్లో వుంచుతాడు. గౌరితో చంద్రానికి వున్న చనువుకు హేమ అంతరాంతరాల్లో బాధ కలుగుతుంది.

"ఐతే పద! ఇప్పుడే నాన్నగారితో మాట్లాడదాం" అన్నాడు చంద్రం.

"అంత తొందరేం వచ్చింది చంద్రం. వివాహం అనేది జీవితంలో ఒకేసారి జరుగుతుంది. ఒకసారి పొరపాటయితే మళ్లీ సర్దుకుందాంలే అనుకునే పని కాదు. వివాహానికి పూర్వం మనం పూర్తిగా ఒకరినొకరం అర్థం చేసుకోవటం అవసరం. నాకు కొంత సమయం ఇవ్వు ఆలోచించుకోవటానికి"

చంద్రం నిరుత్సాహంగా హేమ చేతుల్ని వదిలేశాడు.

"అదుగో అప్పుడే అలక. అలక ఆడవాళ్ళకే అందం. ఇక పద వెళదాం?" అంది హేమ చంద్రాన్ని నుంచలిస్తున్నట్లు.

"సరే! నీ ఇష్టం." అన్నాడు చంద్రం.

ఇద్దరూ బయలు దేరారు. చంద్రానికి, ముఖ్యంగా హేమకు ఇంతకాలంగా పోగొట్టుకున్న అతిప్రియమైన వస్తువేదో మళ్లీ లభించినట్లు అనుభూతి కలిగింది. ఇద్దరూ ఉత్సాహంగా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. పార్కు నుంచి మలుపు తిరిగారు.

"టుబాకో వర్కర్స్ యూనియన్ వర్ధిల్లాలి ప్రకాశంబాబు—జిందాబాద్" అంటూ చెవుల్ని బద్దలు చేసే నినాదాలతో దిక్కులు ప్రతిధ్వనిస్తున్నాయి. టుబాకో వర్కర్సు ప్రొసెషన్ ఎదురయింది.

ముందు వరసలో, ప్రకాశం, గౌరీ చేతుల్లో జండాలతో నడుస్తున్నారు. తెల్లని ఖద్దరు పైజామా, లాల్చీ, తలమీద గాంధీటోపీ............ఆదర్శం, ఆవేశం కలిసి వుద్భవించినట్టున్న ప్రకాశాన్ని చంద్రం ముగ్ధుడై చూస్తూ నిలబడ్డాడు.

వాసిరెడ్డి సీతాదేవి

హేమ దృష్టి గౌరిమీద పడింది. తన వునికిని కూడా మర్చిపోయి చంద్రం గౌరినే చూస్తున్నాడని అపోహ పడింది హేమ. అంతలో ఆమె హృదయంలో ద్వేషంతాలూకు తేలు, కొండీ నెత్తింది. రెండడుగులు ముందుకువేసి దూరంగా నిల్చుంది.

కోటి జనంలోవున్నా తన చంద్రాన్ని ఇట్టే గుర్తించగల గౌరి చురుకైన కళ్లు చంద్రం మీద పడ్డాయి.

"ప్రకాశం ! అదుగో చంద్రం !," అంటూ సంతోషంతో గంతులేసినంత పని చేసింది గౌరి.

ప్రకాశం గబగబా చంద్రం దగ్గరకు వచ్చి రెక్క పట్టుకున్నాడు ఆప్యాయంగా. "రా రా చంద్రం, నువ్వుకూడా ఊరేగింపులో నడవాలి."

చంద్రం కళ్లు గాబరాగా హేమకోసం వెతికాయి.

"ఏరా చంద్రం ! తెలిసిన వాళ్లెవరయినా చూస్తారని భయమా ? అవున్లే యజమాని, కూలీలతోపాటు ఊరేగింపులో నడవటం ఏమిటి ?"

చంద్రం ముఖం పాలిపోయింది. తను అన్నమాటలకు బాధ పడ్డాడు ప్రకాశం.

"వద్దులేరా చంద్రం ! తమాషాగా అన్నాను. మీటింగు దగ్గరకు మరో గంటకల్లా వచ్చేయ్" అంటూ ప్రకాశం వెళ్లి ప్రొసెషన్‌లో నిల్చున్నాడు.

దూరంగా నిల్చున్న హేమవైపు క్షమించమన్నట్లు చూశాడు చంద్రం. హేమ ముఖం తిప్పుకొని గబ గబా ముందుకు నడుస్తోంది. చంద్రం యాంత్రికంగా వెళ్ళి ప్రకాశం పక్కనే నడవసాగాడు.

రెండడుగులు ముందుకు వేసినిలబడి వెనక్కుతిరిగి చూసిన హేమకు చంద్రం ప్రొసెషన్‌లోకి వెళ్ళి నిల్చోవడం కనిపించింది. కోపం, రోషం, అవమానం, ద్వేషం, నేను ముందంటే నేను ముందంటూ హేమ హృదయంలో పోటీ పడుతున్నాయి. మీ అందరికంటే నేనే ముందున్నానంటూ దుఃఖం పొర్లుకొచ్చింది. ఏదో ఆవేశించినట్లు నడుస్తోంది గబ గబా.

పక్కన మురుగు కాలవ కదిలి గప్పున వాసన వేసింది. హేమ ముఖం తిప్పిచూసింది. వరాహ అవతారం ఎంత ఆనందంగా దొర్లుతుంది ఆ మురుగులో!....అంతే, దానికి కావల్సింది అదే ! పన్నీటి గుంటలో పడేసినా దానికి ఊపిరిసలపదు ! కతుగా అనుకుంది హేమ.

వరండాలో కూర్చొనివున్న తండ్రిని గబగబా దాటుకుంటూ గదిలోకివెళ్ళి గభాల్న తలుపులు బిగించుకొని మంచం మీద విరుచుకుని పడిపోయింది. అంతవరకూ గొంతులోనూ, కళ్లలోనూ ఆగివున్న దుఃఖం స్వేచ్ఛగా పొంగింది. దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది_ అంత గంభీరంగా కనిపించే హేమా మాలిని.

* * *

ఆనాడు జరిగిన పబ్లిక్ మీటింగులో ప్రకాశంబలవంతంతో చంద్రంకూడా మాట్లాడాడు. చంద్రం ఉపన్యాసంలో ఉద్రేకంకంటే వివేకం ఎక్కువ కనిపించింది. కార్మికుల హక్కుల్ని గురించి, వాటిని సాధించే మార్గాలను గురించీ మాట్లాడాడు.

"సాధ్యం ఎంత పవిత్రమయిందో దానిని పొందే సాధనాలు కూడా అంత పవిత్రంగానూ ఉండాలి. ఉదాహరణకు__ఒక భక్తుడు శుచిగా స్నానంచేసి, జపమాల ధరించి, పత్రపుష్పాలతో దేవాలయానికి బయలుదేరాడనుకోండి. ఆ దేవాలయానికి వెళ్ళటానికిరెండు మార్గాలున్నాయి. ఒకటి రాజమార్గం, రెండోది నానా అశుద్ధంగా వుండే అడ్డత్రోవ. అడ్డత్రోవన దేవాలయానికి త్వరగా, తేలిగ్గా వెళ్ళవచ్చు. కాని ఆ భక్తుడుమాత్రం శుద్ధమైన త్రోవనే వెళతాడు. అలాగే మనం మనహక్కుల్ని సత్యమైన మార్గంలో నడిచి సాధించుకోవాలి." చంద్రం తనఉపన్యాసం ముగించే ముందు కార్మికులయడల యజమానుల కర్తవ్యాన్ని గురించి మాట్లాడడంకూడా మరచిపోలేదు. చంద్రం ఉపన్యాసం ముగించగానే కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

తరవాత వినోద కార్యక్రమం మొదలయింది. చంద్రం రచించిన నృత్యనాటికను ప్రదర్శించారు. పొగాకుమొక్క పుట్టుక నుంచి అది ఫ్యాక్టరీలో సిగరెట్‌గా మారేవరకు ఎన్నిరూపాలు ధరించిందో తననాటికలో చిత్రించాడు చంద్రం. దానిని గౌరి, తను శరణాలయంలో నేర్చుకున్న నృత్యజ్ఞానంతో అభినయించింది. ఆమె నృత్యంలో పరిపక్వతలేదు, తాళంకూడా సరిగాలేదు. కాని ఆమె తనకున్న ఆ కొద్దినృత్య పరిచయంతోనే ఎంతో ఆకర్షణీయంగా అభినయించింది. ఆమెలోని ప్రతిభను చూసి చంద్రం ఆశ్చర్యపోయాడు. ప్రకాశం మురిసిపోయాడు.

ఆ నాటి ప్రోగ్రాంముగిసింది. ఎక్కడివాళ్లు అక్కడ తమతమ ఇళ్లకు బయలుదేరారు.

మొఖానికున్న రంగుకడుక్కొని దుస్తులు మార్చుకొని గౌరి, తనకోసమే ఎదురుచూస్తూ కూర్చున్న ప్రకాశం, చంద్రాల దగ్గిరకు వచ్చింది.

"చాలా బాగుంది నీ అభినయం, ఇంత బాగా చేస్తావనుకోలేదు." అన్నాడు చంద్రం.

చంద్రం ప్రశంసకు గౌరి మనస్సులోనే పొంగిపోయింది. ఆమె కోరిందికూడా అదే. ఆ ఒక్క మాటకోసమే పదిరోజులుగా నిద్రాహారాలుమాని ప్రాక్టీస్ చేసింది.

"మీరిద్దరూ ఇంటికి వెళ్ళండి. నాకు కొంచెంపనుంది. అర్థ గంటలో వచ్చేస్తాను." అన్నాడు ప్రకాశం.

''ఆ రోజు సినిమాకు తీసుకెళతానని మోసం చేశావు. ఇవ్వాళ సినిమాకు వెళదాం" అంది గౌరి చంద్రంతో.

''సినిమాకా? ఇప్పుడా?" ప్రశ్నించాడు చంద్రం బెదిరిపోతూ.

"తొమ్మిదే అయింది. ఇంకా రెండో ఆట మొదలు పెట్టటానికి చాలా సమయం వుంది. తీసుకెళ్ళు, గౌరి ఇవ్వాళ చాలా సంతోషంగావుంది. నిరుత్సాహ పరచకు'' అన్నాడు ప్రకాశం చంద్రంతో.

"నువ్వుకూడావస్తే అందరం వెళదాం" అన్నాడు చంద్రం.

"నాకు చాలా అవసరమైన పనివుంది. నేను కలుసుకోవాలనుకున్న వ్యక్తి ఈ తెల్లవారు ఝామునే ఊరికి వెళ్ళిపోతాడు" అన్నాడు ప్రకాశం.

''అయితే రేపే వెళదాంలే.'' అని అనాలనుకున్నాడు. కాని తన జవాబు కోసం ఎంతో ఆదుర్దాగా తన ముఖంలోకి చూస్తున్న గౌరిని చూసి జాలివేసింది, కాదనలేకపోయాడు.

గౌరి సినిమా శ్రద్ధ చూస్తుంటే, కొందరు వ్యక్తులు ఆవు రావురుమని భోజనం చెయ్యటం గుర్తొచ్చింది చంద్రానికి. చంద్రం మనస్సు సినిమా మీద లేదు. గౌరిని గురించే ఆలోచించసాగాడు. హేమకూ, గౌరికీ ఎంత తేడా వుంది!

సినిమా ముగిసింది. సినిమాహాలు ప్రకాశం ఇంటికి ఎంతో దూరం లేదు.

చంద్రం, గౌరి ఇంటివైపు బయలుదేరారు. చంద్రం మనస్సును ఒక సారిగా హేమ తలపులు చుట్టేశాయి. హేమ ఎందుకలా ప్రవర్తిస్తుంది.? హేమతో ఇలా సినిమాకు వచ్చివుంటే తన అనుభూతే వేరుగా వుండేది. చంద్రానికి మనస్సులో ఏదో అర్థంగాని ఖాళీ ఏర్పడ్డట్టనిపించింది.

గౌరి ఆలోచనలూ, అనుభూతీ భేదంగా వున్నాయి. ఆమె శరీరంలోని ప్రతి జీవాణువూ ఉత్సాహంతో ఉరకలు తీస్తుంది. ఎంతో కాలంగా తనకు దూరమైన అతి ప్రియతమమైన వస్తువేదో తనకు లభించినట్లు ఆ అమాయిక హృదయం అనుభూతిని పొందింది.

యధాలాపంగా నడుస్తున్న చంద్రం తల మీద ఏదో బలంగా పడింది. 'అబ్బా' అంటూ విరుచుకు పడిపోయాడు. గౌరికి జరిగిందేమిటో తెలుసుకొనే లోపల ఎవరో బలంగా తన దండ చెయ్యిని పట్టుకొని లాక్కుపోవటానికి ప్రయత్నిస్తున్నట్లు తోచి గట్టిగా ఓ గావుకేక పెట్టింది. అక్కడక్కడ పలచ పలచగా నడుస్తున్న సినిమా జనం కేకవినవచ్చినవైపుకు పరుగెత్తసాగారు. పోలీసుల బూట్లుచప్పుడు దగ్గరవుతుంటే అంతవరకూ గౌరిని లాక్కెళ్ళటానికి ప్రయత్నిస్తున్న అతనూ, మరోఅతనూ చేతిలో లాఠీతో పరిగెత్తారు పక్క సందునపడి.

ఆ పారిపోతున్న వారిలో ఒకడు నాగేంద్రం అని గౌరి చురుకైన కళ్ళు గుర్తించాయి.

చంద్రం చుట్టూ జనం చేరారు. తలనుంచి రక్తం కారుతుంది. చంద్రం బాధగా మూలిగి కదిలాడు. ఇద్దరు ముగ్గురు కలసి చంద్రాన్ని కూర్చోబెట్టారు. గౌరి తన పవిటచెరగు చింపి చంద్రం తలకు రక్తం కారకుండా కట్టడానికి అందించింది. కొంచెం తేరుకున్న చంద్రం 'ఏమంతపెద్ద దెబ్బకాదు, ఆసుపత్రికి అక్కర లేదు' అంటూ లేచాడు.

పోలీసు ఇన్‌స్పెక్టరు చంద్రం పేరూ, విలాసం అడిగాడు. చంద్రం కృష్ణారావు తమ్ముడని తెలుసుకొని ఇన్‌స్పెక్టరు వాళ్లను స్టేషన్‌కు రమ్మని నిర్బంధించలేదు. గుంటూరులో వున్న ధనికుల్లో ఒకడైన కృష్ణారావు తమ్ముడు కొరిటపాడు అడ్రసు ఇవ్వటం అందరికీ ఆశ్చర్యాన్నే కలిగించింది. అందరి కళ్ళూ కుతూహలంతో గౌరి వైపు మళ్లాయి. ఎవరికి తోచినట్లు వారు వూహించు కుంటూ వెళ్ళిపోయారు.

17

ఇన్‌స్పెక్టర్ చంద్రాన్నీ, గౌరినీ- చంద్రం వద్దంటున్నా వినకుండా తన కారులో తీసుకెళ్లి ఇంటి దగ్గర వదిలాడు. ఇనస్పెక్టరు వెళుతూ వెళుతూ అవసరమైతే ఒకసారి పోలీసు స్టేషన్‌కు రావాల్సి వుంటుందని చెప్పి వెళ్ళిపోయాడు.

తెల్లవారేప్పటికి స్థానిక పత్రికల్లో తాటికాయంత అక్షరాల్లో క్రితం రాత్రి జరిగిన సంఘటన వన్నెల చిన్నెలతో ప్రకటించబడింది.

'కృష్ణా టుబాకో కంపెనీ ప్రొప్రయిటరు కృష్ణారావుగారి తమ్ముడు చంద్రశేఖరం పై దుండగీడుల దౌర్జన్యం!కొరిటపాడులో నివసించే ఒక ఆడపిల్లతో సినిమాకు వెళ్ళవస్తుంటే ఇది జరిగింది. ఆ యువతి పేరు గౌరి. ఆమెను ఎత్తుకుపోయే ప్రయత్నంలోనే ఈ ఘర్షణ జరిగినట్లు తెలుస్తుంది.'

వార్త చదివిన హేమ చేతినుంచి పేపరు జారి కిందపడింది. ఎదురు కుర్చీలో కూర్చుని మరో పత్రిక చదువుతున్న ప్రసాదరావు కొయ్యబారివున్న హేమను చూసి విస్మయం చెందాడు.

క్రిందపడివున్న పేపరు చేతిలోకి తీసుకున్నాడు. వార్తచదివిన ప్రసాదరావుకు చంద్రం పై పట్టరానికోపం, అసహ్యం కలిగాయి. హేమ అప్పటికే అక్కడనుంచి లేచి వెళ్ళిపోయింది. ప్రసాదరావు మనస్సు వికలం చెందింది. లేచి, స్నానంచేసి బయటకు బయలు దేరాడు. హేమ గది తలుపులు లోపలనుంచి వేసివున్నాయి. ఇవ్వాళ ఆమె కాలేజీకి వెళ్ళే సూచనలు ఏమీ కనిపించలేదు. గట్టిగా నిట్టూర్చుతూ బయటకు నడిచాడు ప్రసాదరావు.



ప్రసాదరావు కృష్ణారావు గది ప్రవేశించేప్పటికి సిగరెట్ పొగతో మేఘాలు తయారవుతున్నాయి. కృష్ణారావు నొసలు బిగించి కప్పువైపుచూస్తూ సిగరెట్ దమ్ములు పీలుస్తున్నాడు. ఎదురుగా టేబుల్ మీద ఆ వార్త వడిన పేపరు కనిపించింది ప్రసాదరావుకు. కృష్ణారావు అంత గాంభీర్యంగా వుండటానికి కారణం అర్థం అయింది.

ప్రసాదరావు కూర్చున్న తరవాతకూడా ఎవరూ కొంతసేపు మాట్లాడలేకపోయారు. ఆ సమయంలో ప్రసాదరావు రాకకు కారణం చెప్పకనే తెలుస్తుంది. ఆ విషయాన్ని చర్చించాలంటే ఇద్దరకూ బాధగానేవుంది.

"వార్త చూశారుగా?" చిన్నగా విషయాన్ని కదిపాడు ప్రసాదరావు.

"చూశాను, వీడింత అప్రయోజకుడవుతాడని కలలోకూడా ఊహించ లేదు. మా వంశానికే కళంకం తెచ్చాడు. ఇలాటివాడు పుట్టగానే చచ్చినా బాగుండేది అని ఆలోచిస్తున్నాను" అన్నాడు కృష్ణారావు బాధగా.

చంద్రాన్ని కృష్ణారావు తిట్టడం ప్రసాదరావుకు తన హేమను శపించినట్టు అనిపించింది. చంద్రాన్ని సమర్థించాలని పించింది.

"దీనికి చాలావరకు మనమే బాధ్యులమేమో ననిపిస్తుంది. కుర్రవాళ్లు, పైగా చిన్నప్పటినుంచి పెద్దవాళ్ల రక్షణకు దూరంగా పెరిగిన వాళ్లకు కొన్ని అలవాట్లు ఏర్పడి వుండవచ్చును. చంద్రాన్ని మనం అలా వదిలేయడం వల్లనే ఇదంతా జరుగుతుంది"

"నన్నేం చెయ్యామంటారు?"

''మీరు వెళ్ళి ఎలాగయినా ఒప్పించి ఇంటికి తీసుకొని వచ్చేయండి."

''వాడికి నామాటంటే బొత్తిగా ఖాతరు లేకుండాపోయింది. పైగా నామీద పగ సాధించటానికే ఈ మాదిరిగా ప్రవర్తిస్తున్నాడు.''

''చంద్రం అలాటి వాడు కాదు. మీరంటే అతనికి ఇప్పటికీ అభిమానమే. కాకపోతే చిన్నతనంలో గాయపడిన హృదయం. అతనిని అనునయంగా కాని మనం మార్గంలోకి తీసుకురాలేము.'' అన్నాడు ప్రసాదరావు.

'' ప్రయత్నించి చూస్తాను, దీనికంతా కారణం అసలు ఆ ప్రకాశంగాడే. వాణ్ణి ఈ ఊళ్లో లేకుండా చెయ్యాలి.'' అన్నాడు కృష్ణారావు.

ప్రసాదరావు ఆశ్చర్యంగా చూశాడు.

''అంత పనిమాత్రం చెయ్యకండి. ప్రకాశం మీద ఈగ వాలటాన్నికూడా చంద్రం సహించలేడు. మనం ప్రకాశాన్ని ఏమయినా చేసినట్లు పసిగట్టాడా చంద్రం మనకు శాశ్వతంగా దూరం అవుతాడు.''

''ఉఁ అదీ చూస్తాను.'' అంటూ సిగరెట్టు ముక్క కొరికి ఊసాడు కృష్ణారావు.

''ఇంత వరకూ వచ్చాక నా కుటుంబగౌరవం కాపాడు కోవటానికి నేను ఏదైనా చెయ్యటానికి సిద్ధంగావున్నాను.''

స్ప్రింగ్‌డోర్ తెరచుకోవటంతో కృష్ణారావు మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రైవేటు సెక్రెటరీ అనూరాధ లోపల ప్రవేశించి ఆ ఎదుటి కుర్చీలో కూర్చుంది. తెల్లటి దుస్తుల్లో అందంగా కనిపించిన అనూరాధను ఆత్మీయత పుట్టిపడే కళ్లతో చూశాడు కృష్ణారావు 'ఏమిటి ?' అన్నట్లు.

" బాస్ " అంటూ ఏదో చెప్పబోయి అకస్మాత్తుగా పక్కకు తిరిగిచూసి ఆగి పోయింది అనూరాధ. ఏదో వింతవస్తువును చూసినట్లు ప్రసాదరావును రెప్ప వాల్చకుండాచూస్తూ వుండి పోయింది. క్రమంగా ఆమె ముఖంమీద చెమట బిందువులు కనిపించసాగాయి. కృష్ణారావు విస్మయంతో ఆమెనే చూస్తూండి పోయాడు. తూలి పడిపోబోతున్న అనూరాధను కృష్ణారావు పట్టుకుని పక్కసోఫాలో పడుకోబెట్టాడు.

కృష్ణారావు ప్యూన్‌ను కేకవేసి మంచినీళ్లు ఇవ్వమన్నాడు ఆమె ముఖంమీద నీళ్లు చిలకరించి కదిపిచూశాడు. కాని ఆమెకు తెలివి రాలేదు. గాబరాగా ఫామిలీ డాక్టరుకు ఫోన్ చేశాడు. ఇంత జరుగుతున్నా కదలక మెదలక కుర్చీలో తాపీగా కూర్చొనివున్న ప్రసాదరావును ఆశ్చర్యంతో చూశాడు కృష్ణారావు. అప్పుడే ప్రాణం పోయిన శవంలా బిగుసుకొని పోయివున్న ప్రసాదరావును చూసి కృష్ణారావు గాబరాగా లేచివచ్చి కదిపాడు. ఏదో భయంకరమైన దుస్స్వప్నం నుంచి బయట పడినట్లు నాలుగువైపులా వెర్రిగా చూశాడు. మరోక్షణంలోనే తేరుకుని లేచి అనూరాధ పడుకుని వున్న సోఫా దగ్గిరకు వెళ్ళి పక్కనే తల దగ్గిర కూర్చుంటూ ''అనూ, అనూ'' అంటూ ఆమెను ఆవేశంగా కదిపాడు.

కృష్ణారావుకు అర్థంకాక అయోమయంగా చూస్తూ కూర్చున్నాడు. తెలివిలేని అనూరాధ తలను నిమురుతూ ఆమె ముఖంలోకే చూస్తూ కూర్చున్నాడు ప్రసాదరావు.

డాక్టరు వచ్చి ఇన్‌జెక్షన్ ఇచ్చి స్మెలింగ్ సాల్టు ముక్కు దగ్గిర వుంచాడు. ఆమె కదిలింది. ఒకసారి కళ్లు తెరచి మళ్లీ మూసుకుంది.

''ప్రమాదం ఏమీ లేదు. ఒకోసారి అనుకోని సంఘటన సంభవించినప్పుడు ఇలా జరుగుతుంది. పది నిమిషాల్లో తెలివి వచ్చేస్తుంది. కాని ఒక వారం రోజులు ఆమెకు మానసికంగా, శారీరకంగాకూడా విశ్రాంతి అవసరం" అని చెప్పి డాక్టరు వెళ్ళిపోయాడు.

డాక్టరు వెళ్ళిపోయిన కొద్దిసేపట్లోనే అనూరాధకు పూర్తిగా తెలివి వచ్చేసింది. తను ఎక్కడ వుందీ, ఏ పరిస్థితిలో వుందీ తెలుసుకున్న ఆమె ఒక్కసారిగా లేచి కూర్చుంది. తన సోఫాలోనే కూర్చునివున్న ప్రసాదరావును తిరస్కారంగా చూసి లేచినిల్చుంది. ప్రసాదరావు ఆమెను లేవ వద్దని వారించబోయాడు. కాని ఆమె చూపును తట్టుకోలేక అపరాధిలా తలవంచుకున్నాడు.

అనూరాధ తూలిపడబోయి నిలదొక్కుకుంది. కృష్ణారావు ఏమనుకున్నాడో ! ఆ తలపు రాగానే అనూరాధ సిగ్గుతో చితికిపోయింది. ఏ అద్భుత శక్తో వచ్చి తనను నిల్చున్న పాటున మాయంచేస్తే ఎంత బావుణ్ణు ! కనీసం తను నిల్చున్న భూమి పగిలి తనలో ఇముడ్చుకుంటే ? అలా ఎందుకు జరుగుతుంది ! సీతాదేవి తన బిడ్డ కాబట్టి ఆ నాడు ఆమెను భూదేవి తన హృదయంలో దాచుకుని ఆమెకు జరగబోయే అవమానం నుంచి కాపాడింది.

ఆమె ఇబ్బందిని కనిపెట్టాడు కృష్ణారావు. ''వెళ్ళమ్మా ! వెళ్ళి విశ్రాంతి తీసుకోండి, ఓవారం రోజులు శెలవు తీసుకోండి.'' అన్నాడు కృష్ణారావు.

ఆ అవకాశంకోసమే ఎదురుచూస్తున్న అనూరాధ ఆ గదినుంచి గబగబా బయటకు వెళ్ళిపోయింది.

కింకర్తవ్య విమూఢుడై కూర్చొనివున్న ప్రసాదరావుతో కృష్ణారావు అన్నాడు ''ఆమె చాలా ఆవేశంలో వున్నట్టుంది. ఏమయినా అఘాయిత్యం చెయ్యవచ్చు. మీరు వెళ్ళి కొంత ఓదార్చటం అవసరం అనుకుంటాను.'' పరిస్థితి కొంతవరకు అర్థం అయింది కృష్ణారావుకు.

"లేవండి ఆమె ఈ బిల్డింగులోనే చివర గదుల్లో వుంటుంది'' అని చెప్పి బెల్ మోగించాడు. వచ్చిన ప్యూన్‌తో "అయ్యగారికి అనూరాధమ్మ గారి గది చూపించు " అన్నాడు.

ప్రసాదరావు మౌనంగా లేచి ప్యూన్ వెనకే యాంత్రికంగా నడుస్తున్నాడు.

ప్రసాదు అపరాధిలా జంకుతూ అనూరాధ గదిలో అడుగు పెట్టాడు. ఆమె మంచంమీద బోర్లా పడుకొని గుండెలు పగిలిపోయేలా విలపించటం చూశాడు.

ప్రసాదులో ఆవేశం కట్టలా తెంచుకుంది. ఒక్కసారిగా ఆమెను సమీపించాడు. ఆమెను తన రెండు బాహువుల్లో పొదివి పట్టుకొని బలంగా గుండెలకు అదుముకుంటూ కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. అనూరాధ ప్రసాదుగుండెల్లో ఇమిడిపోవటానికి ప్రయత్నిస్తుందాన్నట్లు అతని గుండెలో తలదాచుకుని ఏడుస్తుంది. ఇంతకాలం ఈ విశాల ప్రపంచంలో గుండెలో భూగోళమంత వంటరితనాన్ని దాచుకొని జీవిస్తున్న అనూరాధకు ప్రసాదు గుండెల్లో తలదాచుకుని ఏడుస్తుంటే, ఏదో లోతులుతెలియని అగాధంలోకి జారిపోతున్న వానిచేతికి ఏదో ఆధారం దొరికినట్లు కొంత ఊరట కలిగింది.

ఆవేశం తగ్గింది. పరిస్థితిని ఆలోచించేశక్తి చేకూరింది. తనను తను సంబాళించుకుంది అనూరాధ. ఒక్కసారిగా ప్రసాదు బాహు బంధాన్ని విడిపించుకుని దూరంగా జరిగి కూర్చుంది.

(సశేషం)

మిజోల వింత అలవాట్లు

కె. వి. రాఘవరావు.

అస్సాం రాష్ట్రంలోని మిజో కొండలలో నివసించు జాతుల విశేషాలు మైదానములలో నివసించే వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. మిజో జిల్లా అస్సాం రాష్ట్రంలోకెల్లా విస్తీర్ణంలో పెద్దది. దీని ముఖ్యపట్టణం అయిజల్. మిజోకు ప్రక్కనున్న జిల్లా కచార్. కచార్ ముఖ్య పట్టణము సిల్చార్. సిల్చార్ నుండి అయిజల్‌కు దూరము 113 మైళ్లు. సిల్చార్ నుంచు అయిజల్ పోవుటకు కొండల మధ్యగా ఒకే రోడ్డు కలదు. ఈ రోడ్డుకు ఎక్కడైనా ఆటంకం సంభవిస్తే మిజోలకు, ఇతర ప్రపంచమునకు ఎట్టి రాక పోకలుండవు. మిజోలు జీవించుటయే దుర్లభమగును.

అయిజల్‌కు దక్షిణముగా లుంగ్లే కలదు. ఇది జిల్లాలోని రెండవ ముఖ్యపట్టణం. లుంగ్లేకు అయిజల్‌కు మధ్య దూరము 120 మైళ్లు. అయిజల్ నుండి లుంగ్లేకు కూడ ఒక ఇరుకైన మట్టి రోడ్డు కలదు. మధ్య ఒక పెద్ద వంతెన కలదు. ఈ వంతెన ధ్వంసమైన యెడల లుంగ్లేకు ఎట్టి రాకపోకలు ఉండవు.

భారత దేశపు సరిహద్దుల రక్షణ దృష్ట్యా ఈ జిల్లాకు ప్రత్యేక స్థానమున్నది. పశ్చిమం వైపున పాకిస్తాన్, తూర్పు వైపున బర్మా ఉన్నటు వంటి మిజో కొండలలో నివసించు ప్రజలు బర్మావారిని మంగోలియన్ వారిని పోలియుందురు. చైనీయులకు మిజోవారికి కూడ పోలికలు కలవు. నెహ్రూజీ ఈ ప్రదేశాన్ని దర్శించినప్పుడు చాలా సంతోషపడి మన భారతదేశ కొండ జాతుల సంస్కృతిని భద్రపరచాలని నుడివారు. ఈ జిల్లా వైశాల్యము 8,134 చదరపు మైళ్లు. పొడవు 320 మైళ్లు. జనాభా మూడున్నర లక్షలు.

ఈ జిల్లాలో అనేక వింతలు కలవు. వీరు మాట్లాడు భాష "లుషాయె" ఈ భాష ఆంగ్ల లిపిలో వ్రాయబడి పాశ్చాత్య భాషలకు అను కూలముగా నుండును. లుషాయ్ భాషలోని గీతాలు ఎక్కువ భాగము ప్రేమ గీతలే. వీరికి సంగీతము, నృత్యము మరియే ఇతర వినోద కార్యక్రమములన్నా చాలయిష్టము. వీరిలో హాస్యము గూడ కలదు. వీరు సాధారణంగా జీవితమును చాల సంతోషంగా, ఉల్లాసంగా గడువుటయేకాక భవిష్యత్తు గురించి ఎప్పుడూ ఆలోచించరు, ఆందోళన చెందరు.

నృత్యములు వీరి వినోద కార్యక్రమములలో చాల ప్రసిద్ధి కెక్కినవి. ప్రత్యేకముగా "బాంబూడ్యాన్సు" (వెదురు గడలతో చేయు నృత్యము) చాలా ప్రసిద్ధి చెందినది. ఇది హావ భావములతో కూడుకొని వీరి సంస్కృతిని, నాగరికతను చక్కగా ప్రదర్శించును. వీరికి లుషాయ్ భాషలో జాతీయ గీతంకూడ కలదు. ప్రతి సాంస్కృతిక కార్యానంతరం ఈ గీతమును పాడుదురు.

మిజోలు ఆతిధ్యము నిచ్చుటలో గణతి కెక్కినవారు. వీరు మితముగా మాట్లాడు వారగుట వలన హెచ్చుగా మాట్లాడే అపరిచితులను అనుమానించెదరు. అపరిచితులకు కూడ ఆతిథ్యము నిచ్చెదరు. ధనవంతులని, పేదవారని భేదము లేదు. బిచ్చగాళ్లు మచ్చుకైననూ కానరారు. వీరికి ఆత్మాభిమానము మెండు. నమ్మిన వారికి ప్రాణములనైనా త్యాగము చేయుటకు వెనుదీయరు. బానిసత్వము, దొంగతనము, మోసము చేయుట వీరికి గిట్టవు. స్వేచ్ఛా స్వాతంత్ర్యములు కలిగి ఉన్న మిజోలకు ప్రేమ వివాహములే గాని పెద్దలు కుదిర్చిన వివాహములు లేవు. విడాకులకు వీలున్నది. వరకట్నము లేదుగాని వధుకట్నము కలదు. ఈ వధుకట్నమును వధువు బంధువులందరూ సమానముగా పంచు కొందురు. వితంతు వివాహములుకలవు. స్త్రీలకు సమానగౌరవము లభించుస్థానములలో ఇది ఒకటి. మిజోయువతులు విద్యాధికులయినప్పటికి వినయ విధేయతలతో కష్టపడి పని చేయుదురు. అడవులకువెళ్లి వంటచెరకు, కూరగాయలు తెచ్చుట, సెలయేళ్లకు వెళ్లి నీరు తెచ్చుట వీరు చేయుపనులలో కొన్ని షాపులలో, మార్కెట్లలో, హోటళ్లలో యాజమాన్యము చేయువారు, పని చేయువారు కేవలము స్త్రీలే. ప్రభుత్వపు కార్యాలయములలో పని చేయువారిలో హెచ్చుమంది స్త్రీలే. వీరిదుస్తులు ఆంగ్లేయులను పోలియుండును. పెదవులకు రంగు, కత్తిరింపు జుట్టు, గౌనులు, ఎత్తైన చెప్పులు, సిగరెట్లు మొదలగు వాటికి లుషాయ్ స్త్రీల నిత్య జీవితంలో ప్రత్యేక స్థానము కలదు. సహకార జీవనము వీరికి అనాదినుండి వస్తున్న ఆచారము. మిజోజిల్లాలో వ్యక్తిగత స్థిరఆస్తులకు స్థానంలేదు.

మిజోజిల్లాలో అక్షరాస్యత హెచ్చుగా నుండుటకు విదేశీయుల రాకయే కారణము. కొన్ని సంవత్సరముల నుండి ఎక్కువగా వస్తున్న విదేశ క్రైస్తవుల. మిజోలను కూడ క్రైస్తవులుగ మార్చిరి. వీరి ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు గూడ కొంత వరకు విదేశీయులే బాధ్యులు. విదేశీయులన్నను, ఇతర రాష్ట్రప్రజలన్నను మిజోవారికి చాల అభిమానము. అయిజల్‌లో ఒకకళాశాల, అనేక పాఠశాలలు కలవు. లుంగ్లే, బొలోసిచ్, సైరాంగ్, మార్త్లాంగ్ మరియు అనేకచోట్ల, పాఠశాలలు కలవు.

మిజోలకు స్వయంగా జీవించే అలవాటు కలదు. బట్టలు అల్లుట, ఇండ్లుకట్టుట, వంతెనలు నిర్మించుట, వలిదుస్తులు తయారు చేయుట, కుట్టుపనులు మొదలగు వానియందు మిజోలందరికీ నేర్పరితనముగలదు. మద్యపాన నిషేధము లేనందున మిక్కిలి చలి ప్రదేశమగుటవలన స్త్రీ పురుషులందరూ (దాదాపు) "జూ" (స్థానికసారాయి) ను సేవింతురు. వీరి జీవితవిధానము నవీన విధానములో నుండుటయేగాక వీరి గృహనిర్మాణము కూడ

ఆంగ్లేయుల గృహనిర్మాణమును పోలియుండి అన్ని వసతులు కలిగి యుండును. సముద్రపు మట్టమునకు చాలా ఎత్తుగాఉన్న ఈ కొండ ప్రదేశములో చలి, వర్షపాతము చాల హెచ్చుగా ఉండును. ఏప్రియల్ నుండి అక్టోబరు వరకు వర్షములు ఎక్కువగా కురియును.

రాజకీయ పార్టీలు

ఈ జిల్లాలో మూడు రాజకీయ పార్టీలు కలవు.

1. మిజో నేషనల్ ఫ్రంట్
   (ప్రస్తుతము అల్లర్లు చేయుచున్న పార్టీ)
2. మిజో యూనియన్ (అధికారంలో ఉన్నపార్టీ)
3. మిజో నేషనల్ కౌన్సిల్.

యువకులు పెక్కుమంది మిజో నేషనల్ ఫ్రంట్ లోనే కలరు. ఈ పార్టీ సిద్ధాంతము మిజోరమ్ (మిజోభూమిని ప్రత్యేక రాష్ట్రముగా చేయాలనీ, దానిని మిజో మంత్రివర్గమే పరిపాలించ వలెనని వీరి ఆకాంక్ష. వీరు అనేక సభలలో ప్రత్యేక రాజ్యాంగము కావలెనని తీర్మానించుటయేగాక, ఆ తీర్మానమును తెలుపుతూ, బహిరంగముగా ప్రచారము చేయుట, ఊరేగింపులు జరుపుట ఇదివరకు (ఈ అల్లర్లకుముందు) అనేకసార్లు జరిగినవి. ప్రస్తుతము అధికారంలోనున్న మిజో యునియన్ పార్టీకికూడ మిజో భూమికి ప్రత్యేక రాష్ట్రం కావలెనని కోరిక కలదు. వీరు 1963లో అస్సాం రాష్ట్ర రాజధాని షిల్లాంగ్‌లో కొండజాతి నాయకుల సమావేశము (హిల్‌లీడర్స్ కాన్ఫరెన్సు) జరిపిరి. స్వర్గీయ శ్రీ జవహార్‌లాల్ నెహ్రూ షిల్లాంగ్ దర్శించినప్పుడు కొండజాతి నాయకులు వారిని కలుసుకొని ప్రత్యేకరాష్ట్రము కావలయునని కోరిరి. శ్రీ నెహ్రూ ఆ సమస్యను గురించి తరువాత ఆలోచించెదమని చెప్పిరి.

ప్రత్యేకముగా మిజోలు తాము ఇండియానుండి విడిపోవాలని, బర్మాలో చేరాలని లేక ప్రత్యేక రాష్ట్రముగా ఏర్పడి స్వపరిపాలన చేయాలని వారి అభిప్రాయం. భారత దేశమునకు స్వాతంత్ర్యము లభించినప్పటినుండి వీరికి ప్రత్యేక రాష్ట్రము కావలెననే అభిప్రాయము కలదు. భారత దేశ కార్యాలయమున పైనున్న "భారత దేశ" అను అక్షరములను కొట్టివేసి "మిజో" అని వ్రాసుకొనుట ఇదివరకే కొన్ని పర్యాయములు జరిగినది. భాషా సమస్య విషయంతో రాష్ట్రప్రభుత్వంతో భేదాభిప్రాయములు వచ్చి మిజోలంతా ఒకవైరి. వాలంటీర్లకు సైనిక శిక్షణ ఇచ్చుటకూడ జరిగినది. వీరు అస్సాం ముఖ్యమంత్రి శ్రీ చాలిహాతో తమ ప్రభుత్వముపట్ల విశ్వాసముతో ప్రవర్తిస్తామని, అల్లర్లు చెయ్యమని వాగ్దానము చేసిరి. వీరి వాగ్దానాలను నమ్మి మేము తగు చర్యలు తీసుకొనలేదని, మిజో నేషనల్ ఫ్రంట్ (యం. యన్. యఫ్.) పార్టీకార్య కలాపాలపై నిర్బంధము విధించలేదని ప్రభుత్వం చెప్పింది.

విదేశీయుల రాక యింసులకు కొంతవరకు కారణము. విదేశీయులను ఎక్కువ మందిని అనుమతించ వద్దని భారత ప్రభుత్వమునకు సూచించినను వారి రాకలు తగ్గలేదు. మిజో ప్రాంత అభివృద్ధి కార్యక్రమాల కొరకు ప్రభుత్వము అనేక లక్షలు ఖర్చు పెట్టినది. వారి జిల్లాను ఆచార సాంప్రదాయములకు అనుకూలముగా పరిపాలించుకొనుటకు ఏర్పడిన "విలేజి కౌన్సిల్" మరియు "డిస్ట్రిక్టు కౌన్సిల్" లలో పనిచేయువారల జీతము చాల హెచ్చుగ నుండుటయే గాక వీరికి ప్రత్యేక హక్కులు గలవు. ప్రభుత్వముచే ఏర్పర్చబడ్డ కళాశాల, ఉన్నత పాఠశాల, వైద్యశాల, కుట్టుపని పాఠశాల, చేనేత పరిశ్రమల సంఘములు మరియు అనేక సంస్థలు మిజోలకెంతయో ఉపయోగ పడుచున్నవి.

ఎన్ని సౌకర్యములు కల్పించినను, మిజో భూభాగ అభివృద్ధి కొరకు ఎంత ధనము వెచ్చించిననూ, సాంఘికాభివృద్ధికై ఎన్ని ప్రత్యేక హక్కులు కల్పించిననూ, మిజోల స్వభావములలోను వైఖరిలోను మార్పురాక పోవుటమేకాక ప్రత్యేకరాజ్యాంగము కావలయుననుచున్నారు. ఇది మిక్కిలి శోచనీయము. వారి కోరికలను గురించి వారి స్థానిక పత్రికలలో అనేకసార్లు ప్రకటించిరి. ఈ అల్లరలో మిజో ప్రభుత్వ అధికారుల సహాయము లేక పోలేదు. ఇటీవల హైలాకాంది సబ్‌డివిజన్ (తూర్పు పాకిస్థాన్ సరిహద్దు ప్రక్క ఉన్న కచార్ జిల్లాలో) వద్ద ప్రభుత్వపు జీపులో మందు గుండు సామాగ్రి, పెద్ద ఎత్తున ధనము కనపడ్డవి. ఇందులో ఆశ్చర్యమేమీలేదు. ఎందుచేతనంటే ఇంతకు ముందు మిజోనేషనల్ ఫ్రంట్‌వారు చేసిన ఊరేగింపులు, పార్టీ ప్రచారము ప్రభుత్వపు జీపులలోనే గనుక, ఈ అల్లర్లు ఇంతటితో అణగిపోయిన వనుటకు వీలులేదు. అనేక సంవత్సరములుగా మేము భారతీయులము కాదని, స్వాతంత్ర్యము కావలెనని బాహాటముగా నినాదాలుచేసే మిజోలు సైనికుల రాకతో ప్రశాంతముగా ఉన్నంత మాత్రాన ఇకముందు అలజడి జరుగదనుటకు వీలులేదు. కనుక ఈ విషయములను ప్రభుత్వము తగు జాగరూకతతో పరిశీలించి, కావలసిన నిర్ణయములను తీసికొనగలదని ఆశిస్తున్నాము.

భాగ్యచక్రం

నిశ్చలంగా పడుకొని గదివాసాలను లెక్క పెడుతున్నాడు శ్రీపతి.

''ఏంచేస్తున్నారండి? '' అడిగాడు శ్రీనగేష్.

శ్రీపతి పలుకలేదు.

మరింత దగ్గరగావెళ్ళి కుర్చీ అతడి మంచానికి దగ్గరగా జరిపి కూర్చున్నాడు నగేష్.

ఆ ధ్వనికి కూడా శ్రీపతి ఏకాగ్రత ఎక్కడా చెదిరినట్టుకన్పించలేదు. నగేష్ సాలోచనగా జయశ్రీదెస చూచాడు. ఆమె అన్యమనస్కంగా మరో దిక్కుగా చూస్తున్నది. నగేష్ చూపులను గమనించనేలేదు.

''రావుగారూ! '' కొంచం బిగ్గరగానే పిలిచాడు నగేష్.

''ఎవరూ? '' విసుగ్గాచూచాడు శ్రీపతి. ''ఓ! నువ్వటయ్యా? ఏం, ఎందుకొచ్చావ్? ''

''అబ్బే, ఏం లేదండీ. ఊరికేనే చూచిపోదామని.''

''ప్రస్తుతం నాకు నీతోమాట్లాడే తీరిక లేదయ్యా! చాలా ఆలోచనలో వున్నానూ—మరోసారి కన్పించు.''

జయ, శ్రీనగేష్‌లు ముఖముఖాలు చూచుకున్నారు.

''ఏమిటండీ, అంత ఆలోచన? నాకు చెప్పకూడదూ, తెలిస్తే నేనూ ఏమైనా తోచిన ఉపాయం చెప్తాను.'' అన్నాడు నగేష్.

లేచికూర్చున్నాడు శ్రీపతి. అటూ యిటూ యిబ్బందిగా చూచాడు; తల సవరించుకున్నాడు; అటూ యిటూ ముఖం చిరాగ్గా విదిలించుకున్నాడు; గడ్డం సవరించుకున్నాడు; లేచి పచార్లు మొదలు పెట్టాడు.

ఆరెకపూడి కౌసల్యాదేవి

అతడి తీరుతెన్నులన్నిటినీ జాగ్రత్తగా పరీక్షిస్తున్నాడు శ్రీనగేష్. హఠాత్తుగా పచార్లు ఆపి వెనుదిరిగి చూచాడు శ్రీపతి. ''దేన్నిగురించీ—అనికదూ అడిగావు? అదేనయ్యా—అసలు దేన్ని గురించి నేను ఆలోచించాలీ—అనేదే ఆలోచన. ఇంతకుముందు ఏదోజరిగింది. అదేగుర్తుకు రావడంలేదు. అసలు ఎప్పుడూ ఏదో



జరిగిన కథ

వైద్యవిద్యా పట్టభద్రుడయిన శ్రీనగేష్ సేవాతత్పరత అతని మామ శ్రీపతికి నచ్చదు. శ్రీపతి కుమారుడు శ్రీహరి వివాహం, సమయానికి కట్నం అందని కారణంగా ఆగిపోతుంది. తిరిగి వస్తూండగా కారు ప్రమాదంలో చిక్కుకుని, శ్రీపతిగారికి మతి స్థిమితం తప్పుతుంది. శ్రీనగేష్ గ్రామంలో పెట్టిన ఆసుపత్రి, —భాగ్యచక్రం చాలా అభివృద్ధి చెందుతుంది. దానిని చూచేందుకు శ్రీలక్ష్మిరాగా ఆమెకు తన ఆసుపత్రి పెట్టుటకు దారితీసిన సంఘటనలను శ్రీనగేష్ తెలియజేస్తాడు. శ్రీలక్ష్మి తిరిగి వెళ్ళి పోతుంది. ఆ తరువాత శ్రీపతి యింటికి వెళ్తాడు శ్రీనగేష్.

జరుగుతూనే వుంటుంది. అదే! నాకు తెలిసి చావదు, ఏదోగుర్తుకు వస్తూన్నట్లే వుంటుంది — కాని రాదు. అదేగొప్ప తనం!''. అని ఏదోమహా సత్యాన్ని కనుగొన్నట్టు పకపకా నవ్వసాగాడు శ్రీపతి. ''ఈ జీవితంవుంది చూశావ్, చాలా చిత్రమైనది! ప్రతిదీ మరుపే! అడుగడుగునా మరుపే! తింటాం! — మరచిపోతాం. ఎన్నో జరుగుతాయి, —మర్చిపోతాం.........''

నిస్సహాయంగా తిలకించడం మినహా ఏమీమాట్లాడగల స్థితిలో లేదు జయశ్రీ.

నగేష్ అన్నాడు; ''పోన్లెండి. మరోసారి జ్ఞప్తికి వస్తుంది, జ్ఞాపకం రానిదానికోసం అంతగా శ్రమపడడం దేనికి? మనం కాస్సేపు చదరంగం ఆడదామా? ''

''అంతేనంటావా? సరే లే, ఆడదాం. రా''

ఆడడానికి తీరికలేకపోయినా, కేవలం శ్రీపతి మనస్థితినీ, ఆలోచనా శక్తినీ పరీక్షించడానికై, ఆటముందు కూర్చున్నాడు శ్రీనగేష్. నాలుగైదెత్తులు బాగానే—తెలివిగానే వేశాడు శ్రీపతి. జయశ్రీ కూడ దగ్గర నిలబడి కుతూహలంగా తిలకించ సాగింది. కాని శ్రీపతి ఆటసాగనీయలేదు. ఉన్నట్లుండి అంతా కలిపేసి లేచిపోయాడు, ''ఆటమీద మనస్సు నిలవడం లేదయ్యా, పుస్తకం చదువుకుంటాను'' అంటూ.

''సరే. అలాగే చదువుకోండి,'' అని సెలవు తీసుకున్నాడు నగేష్. వీధిగుమ్మం వరకూ అతడిననుసరించి వచ్చిన జయశ్రీ అడిగింది: ''శ్రీలక్ష్మి విషయంలో నాప్రవర్తనను నీవు గర్హిస్తున్నావా? ''

విస్మయంగా చూచాడు నగేష్. ''లేదే! అయినా నీఅభిప్రాయాలు నీవి, నీయిష్టం. నాకేల. ''

మరోరెండడుగులు నడిచారు.

''అయితేమరి శ్రీలక్ష్మిని మీయింటి కెందుకు తీసుకెళ్లావు?

వెనుదిరిగి పరీక్షగా చూచాడు నగేష్. ''అయితే అందుకు నీకు కోపంవచ్చిందా?''

''............''



''చూడు!'' నచ్చజెప్తూన్న ధోరణిలో ప్రారంభించాడు నగేష్. ''ఏదో మరో వూరినుండి క్రొత్తగా వచ్చినామె, మర్యాద చేయడం, ఆతిధ్యమివ్వడమూ అవసరం.''

''ఎవరికి?'' తీక్షణంగా ప్రశ్నించింది జయశ్రీ.

''.........''విస్మయంతో, సమాధానం ఈయలేకపోయాడు నగేష్.

''ఎవరి కంటావ్ ఆ అవసరం?'' రెట్టించింది జయశ్రీ. ''ఊళ్లో ఎవరింటికి ఎవరు వచ్చినా, వారిని మర్యాద చేయవలసిన బాధ్యత నీపైన ఉన్నదా?''

ఆమె అసహన ధోరణికి చాలా ఆశ్చర్య పోయాడు శ్రీ నగేష్. ఆమె అతిశయాహంకార స్వభావము మరింతబాగా అవగత మయ్యింది. ఇక ఆ విషయంలో తర్కవితర్కాలూ, వాద ప్రతివాదాలూ అనవసరమనిపించాయి.

''మరి నాకు చాలా పనుంది. వెళ్లమంటావా?''

''ఊఁ.'' అతడి ఆంతర్యాన్ని కనిపెట్టిన జయశ్రీ ఉదాసీనతతో వూకొట్టి ఊరుకుంది.

''మామయ్య విషయంలో ఎప్పుడు అవసరమని తోచినా తక్షణం కబురు పంపించు, వెళ్తున్నా.'' సాగిపోయాడు శ్రీనగేష్. వెనుక జయశ్రీ నిస్సహాయంగా, రోషంగా పళ్లుకొరికింది.

*   *   *   *

రాత్రి తొమ్మిది గంటలకు భోజనానికి వచ్చిన నగేష్, తల్లి ఏమైనా శ్రీలక్ష్మి ప్రసక్తిని తీసుకువచ్చి మధ్యాహ్నం మాదిరిగానే బలవంతం చేస్తూ మాట్లాడ గలదని భయపడ్డాడు. కాని ఆమె అతిమౌనంగా వడ్డన సాగించడం అతడికి ఆశ్చర్యమే కలించింది. తలెత్తి చూచిన అతడికి శ్రీదేవి వదనంలో ఏవో అస్పష్ట నీలి నీడల ఛాయలు గోచరించి కలవరపడ్డాడు.

''ఏమిటమ్మా అలాగున్నావు?'' అని అడిగాడు.

''ఏం ఎలా వున్నాను?'' అంటూ నవ్వింది కాని, ఆ నవ్వులో ఎంతో నిరుత్సాహం వుంది.

అతడింకా ఏమో అడుగబోతుండగా శ్రీలక్ష్మితో వెళ్ళిన నాగన్న తిరిగి వచ్చాడు.

''అమ్మగారండోయ్. వచ్చేశాను.'' అంటూ వీధి గుమ్మంలో నుంచే ఒక గావు కేక పెట్టాడు.

ఏమిట్రోయ్! చాలా హడావుడిగా కులాసాగా వున్నావ్?'' అన్నాడు నవ్వుతూ నగేష్ భోజనం ముగించి, చేయి తుడుచు కుంటూ ఈవలకు వచ్చి.

శ్రీదేవి కూడ బయటకు వచ్చింది. ''వచ్చావేమిటి?'' అంది ఏదో మామూలుగా.

''క్షేమంగా వెళ్లారా?'' అనడిగాడు నగేష్.

''ఆయ్.'' సంతోషంతో మాటలు తడబడి పోతున్నాయి నాగన్నకు. ''ఎంతటి గొప్పోరూ! ఏం మర్యాదలూ–అబ్బో! ఇంక మీరెళ్తే ఎంత గౌరవింపుతారండి, నన్నే అంత బాగా సూశారు.! నాకు పది రూపాయలు కూడా యిచ్చినారు! ఎంత పెద్ద భవంతి! ......''

''సరేలే. పోయి కాళ్లు కడుక్కురా. భోజనం పెడ్తాను.'' కఠినంగా అన్నది శ్రీదేవి.

నాగన్న వాక్ప్రవాహం ఆగిపోయింది. విక్కచూపులు చూస్తూ వెళ్లిపోయాడు.

నగేష్‌కు ఏమీ అర్థంకాలేదు. అద్రసెందుకు ఇల్లే చూచిరమ్మని పంపిన అమ్మకు యింతలో యింత ఉదాసీనత ఎలా ఏర్పడింది ఈవిషయంలో? అని లోలోన తర్కించుకుంటూ పైకి ప్రకాశంగా అన్నాడు ''ఏమమ్మా, అలావున్నావు? వంట్లోబాగులేదా?''

''ఇంతడాక్టరు నాకొడుకై యుండగా నాకేమౌతుంది నాయనా? అయినా వస్తే బాగా నేవుండును. రాకనే ఈ పాట్లన్నీ''.

ఈవింత ధోరణేమిటో, ఈ నిష్ఠురాలేమిటో ఎంత మాత్రం అంతుబట్టలేదు శ్రీనగేష్‌కు. అదోలా మాటలు దక్కి చూస్తూండి పోయాడు.

అతడి అనుమానదృక్కులను చూచిన శ్రీదేవి ''ఏదోదైవికంగా ఎవరో అమ్మాయి వచ్చింది. మనలోపంలేకుండా మర్యాదలుచేసి పంపాం, అంతకుమించి వివరాలు మనకేమవసరం?'' అంటూనే లోపలికి వెళ్లిపోయింది.

'అమ్మధోరణి ఎన్నడూలేనంత వింతగావుంది ఏమిటోమరి?' అనుకొని ఊరుకున్నాడు నగేష్. తల్లిపడ్డన్న విషయాలను తిరిగి తానుప్రత్యేకంగా నాగన్నను అడిగి కనుక్కోవడంలో మర్యాద నిలువదు. అదీకాక తనకంత శ్రద్ధాలేదు, అవసరమూ లేదు అన్పించింది. అంతే, మరికొంతసేపటికి ఆ విషయాన్ని అప్రస్తుత అనవసర అంశంగా విస్మరించేశాడు.

*   *   *

ఒక వంక రకరకాల రోగులకు వైద్యంచేస్తూ, మరొకవంక పొలాలపనులు చూచుకుంటూ, తీరికలేక రెండు రోజులుగా శ్రీపతి యింటికి వెళ్లలేదు శ్రీనగేష్. ఆరోజు మధ్యాహ్న భోజనానంతరం విశ్రమించ బోతూండగా హఠాత్తుగా ఆ విషయం గుర్తుకువచ్చిన నగేష్ మరి పడుకోకుండా లేచి త్వరత్వరగా బయల్దేరి వెళ్లాడు!

ఇల్లంతా ఎప్పటి మాదిరిగా నిశ్శబ్దంగానే వున్నది. నౌఖర్లు ముగ్గురూ తీరికగా వీధరుగు మీద పులిజూదం ఆడుకుంటున్నారు. డాక్టర్ని చూడగానే మర్యాదగా లేచి నిల్చున్నారు. ఒకడు పరుగు పరుగున లోనికిపోయి వార్త జయశ్రీ చెవిన వేసివచ్చి, డాక్టర్ని లోనికి తీసుకుపోయాడు.

తన ఎదురుగా వచ్చి కూర్చుంటూన్న జయను చూచి నివ్వెర పోయాడు శ్రీనగేష్. "అలాగున్నావేమిటి, పెద్ద అస్వస్థత చేసినట్టు" అని ప్రశ్నించాడు.

తలెత్తి సూటిగా చూస్తూ అడిగింది జయశ్రీ," అసలు నువ్వు నాన్నకీజబ్బు తగ్గించగలవా లేదా? ఖచ్చితంగా తేల్చి చెప్పు బావా!"

అయిదు నిముషాలపాటు అలాగే రెప్పవేయకుండా చూచాడు శ్రీనగేష్ ఆమెను. ఏదోపెద్ద విషయమే జరిగినట్లుంది। అనుకున్నాడు లోలోన.

"మాట్లాడవేం బావా?" రెట్టించింది జయ.

నిర్లక్ష్యంగా నవ్వుతూ అన్నాడు। "ఇది వరలోనే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పివున్నాను కదా?"

అంతలో జయశ్రీ రోషమంతా ఎగిరిపోయి దైన్యం ఆవరించేసింది; "ఏమోబావా. నాకేమిటో ధైర్యంగాలేదు. ఈ దిక్కుమాలిన నిస్తబ్ధ జీవితంలో మతిపోయేట్టున్నది."

భయంనటించాడు శ్రీనగేష్. "బాబోయ్! ఒకరికి యిద్దరు పేషెంట్లైతే ప్రమాదం।"

జయశ్రీ నవ్వింది.

"అదీ అలావుండాలి. నాకు కాస్త కాఫీ పంపించి, నువ్వు మామయ్య ఏం చేస్తున్నాడో చూచిరా."

జయ వెళ్లిపోయింది.

కాఫీ కప్పుతో ప్రవేశించిన వంటమనిషి సుబ్బమ్మను ప్రశ్నించాడు శ్రీనగేష్! "చూడు సుబ్బమ్మా। అమ్మాయిగారలా ఉన్నారేం? ఏమైనా సుస్తీచేసిందా?"

"సుస్తీ ఏమి లేదుబాబూ."

"అయ్యగారు బాగానే వున్నారుగా? మళ్ళీ ఏం గొడవ లేదుగా?"

"బాగానే ఉన్నారండి."

"మరి? నీకేం తెలియదా?"

తనతో అంతటి డాక్టర్‌బాబు మాట్లాడుతున్నాడన్న సంతోషంతో 'కీ' యిచ్చినట్టు వాగేసింది సుబ్బమ్మ, "బొత్తిగా ఎవరూ మాట్లాడే ఈడూ జోడూ పిల్లలులేక! ఆ పిచ్చితండ్రితో విసిగిపోయి అలా వున్నారుబాబూ అమ్మాయిగారు! ఏదో నాలుగు రోజులపాటు యిరుగు పొరుగు పిల్లలు వచ్చారు. ఇప్పుడు ఒక్కళ్ళూ రావడంలేదు."

"ఏం?"

"ఏముందిబాబూ? పల్లెటూరోళ్ళు కావడంతో బస్తీ పిల్లని విడ్డూరంగానే చూస్తారుమరి! ఈ యమ్మకేమో ముక్కు చివర్నే కోపం! ఇంత వయస్సొచ్చింది, ఇంకా పెళ్ళి కాలేదేమని ఒకరడుగుతారు. అలా పొలాల వైపు షికారు వెళ్ళేసరికి అనేకమంది చిత్రంగా చూడడం_ఎదటే నవ్వి హేళనచేయడం, చెయ్యరానిపని చేస్తున్నట్లు గుసగుసలాడడం, దానితో పాపం అమ్మాయిగారు అలాగ డీలా పడిపోయారు."

వింటున్న శ్రీనగేష్ నేత్రాలలో సానుభూతి వర్షించింది.

అంతలో జయశ్రీ రావడంతో వంటలక్క నోటికి తాళం పడి, మెల్లగా లోనికి జారుకున్నది.

"చూడు! నువ్వు నిత్యం యిలా యింట్లో కూర్చుని బాధ పడడమేనా, మరో వ్యాపకం ఏమైనావున్నదా?" అడిగి ఆమె ముఖ కవళికలను జాగ్రత్తగా పరిశీలించసాగాడు.

చాలా బాధపడుతున్నట్లు ఆమె వదనంలో రేఖలు స్పష్టీకరించాయి. "అంతకంటె వేరు దారేముంది? ఇదేమీ పట్టణం కాదుగా?" అన్నది హీనస్వరంతో.

"నిజమే కాని, చూడు, కొందరికి ఏదో ఒకటి అనడమే పని. బొత్తిగా అలా అందరికీ జడుస్తూ కూర్చోలేం."

జయశ్రీ మాట్లాడలేదు.

"సరే, అదలావుంచు. నాకు కొన్ని అనుమానాలు ఉన్నాయి మామయ్య విషయంలో. అవి చెప్పు."

"ఏమిటవి?"

"మరి, మొన్న కారు హారన్ వినగానే ఆయన కంత కంపర మెత్తిందికదా! మరి ఆయనను ఆ ఊరినుంచి ఈ ఊరు ఎలా తీసుకొచ్చారు? రైలు, కారు ఎక్కనిదే, ఆకూతలు విననిదే ప్రయాణం జరగడం దుర్లభం కదా?"

ఎనలేని బాధాపూర్వకమైన నిశ్వాసం బయల్వెడలింది జయ అంతరంగంనుండి. "అవును జ్ఞానదశలో వుండగా ఆయనను ఏవిధంగానూ ఆ వాహనాలు ఎక్కించలేం. ఆ శబ్దాలువింటే ఆయన చేసే హంగామాను ఆపలేం. అందుకే ప్రయాణంలో మెలకువ రాకుండా మత్తుగా పడివుండడానికి మార్ఫియా యిస్తారు డాక్టర్లు."

"ప్చ్" చాలాసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు శ్రీనగేష్.

దీర్ఘ మౌనానంతరం మరలా ప్రశ్నించాడు: "మరి ఆరోజు ఆయన కుమారులు చనిపోయారంటేనేకదా, నాపై అంత ఆగ్రహావేశాలు ప్రదర్శించారు?"

"అవును?"

''మరి ఇదివరలో ఎప్పుడూ ఎవరు ఆయన దగ్గర ఆ మాట అనలేదా ?

'' అన్నారు, యాక్సిడెంట్ జరిగి కోలుకున్న క్రొత్తలోనే. ఇంకా ఈయన కిటువంటి మతిభ్రమణం కలిగిందన్న విషయం నాకూ, డాక్టర్లకూ కూడ గ్రహింపు కానప్పుడు ఒక డాక్టర్ అన్నాడామాట. మామూలుగా జరిగిన విషయాన్ని, స్పృహ వచ్చిన పిమ్మట నాకు చెప్పినట్లే ఆ డాక్టరే నాన్నకూ చెప్పారు. వెంటనే ఆ డాక్టర్‌కూ, మొన్న నాకులభించిన సత్కారమే లభించింది.''

కనుబొమలు ముడివేసి చాలాసేపు ఆలోచించిన శ్రీ నగేష్, తనలో తాను అనుకొంటున్నట్లుగా అన్నాడు :'' భార్యా పుత్రులు మరణించడం ఆయన తన కళ్లతో చూడలేదు !''

''అవును'' జయశ్రీ అన్నది. ''ఆయనకు స్పృహ వచ్చే సరికే వారి దహన సంస్కారాదులు జరిగిపోయాయి. కనీసం, శవాలను కూడ ఆయన చూచే ఆస్కారం లేకపోయింది. ఇక ఆ తర్వాత స్పృహవచ్చాక విషయం తెలియ చెప్పగల అవకాశం లేకపోయింది. స్పృహ వస్తూనే కొంత మతి స్థిరంలేదు. ; ఇక విషయం వినగానే పిచ్చెక్కి పోయారు. ఆనాటికీ, ఈనాటికీ అలాగే వున్నారు.'

" అవునుజయా. అదేయింత తెచ్చింది. అసలే తలపై పెద్దదెబ్బ తగలడం వల్ల సున్నితమైన నాడులు కొన్ని దెబ్బతిని జ్ఞాపక శక్తిలో కొంత మార్పు తెచ్చి వుండవచ్చునని డాక్టర్ల రిపోర్టులలో వున్నది. కావచ్చు, కాని దానికి మరో కారణం కూడ తోడైనదని నా ఊహ. ఆ మృత్యువును గానీ, మృతదేహాన్ని గానీ ఆయన కనులారా చూచివుంటే ఆయన అంతరంగంలోని ఆవేశం ఆక్రందనావేదనలుగా పరిణమించును. కాని, ఆయన చూడక పోవడం వలన ఇంకా బ్రతికి ఉన్నారనే పిచ్చి భ్రమా, ఎదుటి వ్యక్తులపై ఒక విధమైన అపనమ్మకమూ, అల్పభావమూ ఏర్పడ్డాయి. ఇప్పుడు మనం చేయవలసినదల్లా ఆ భ్రమను కొన్ని ఉపాయాలవల్ల నేర్పుగా పోగొట్టి, వారిరువురూ ఈ లోకంలో లేరనే యదార్థాన్ని వారి మనస్సు గ్రహించేట్లు చేయాలి, శారీరారోగ్య లోపమేమీ లేదు. మందుల అవసరంకూడ అంతగా వున్నట్లు తోచదు. ఎటొచ్చీ మన బుద్ధిబలమే ఎక్కువ ఉపయోగించాలి. "

'' అందుకు ఏం చేయాలంటా ? "

'' ఏమీ అక్కర్లేదు, నేను చెప్పినట్టే వింటే చాలు. పెంకెతనం వదిలేస్తే మంచిది. " హాస్యంగా అన్నాడు శ్రీనగేష్.

సమాధానంగా ఆమెకూడా నవ్వింది.

అనునయ స్వరంతో అన్నాడు శ్రీనగేష్. " పాత జీవితంలోని ముఖ్యమైన వ్యక్తులనూ, ఆ దేశాలనూచూస్తే ఆయనలో ఎటువంటి సంచలనం కలుగుతుందో నేను పరీక్షించాలి. అదృష్టవశాత్తూ అటువంటి సంచలనాలు కలిగితే నా ప్రయత్నాలు ఫలించినట్టే. లేదా నేనే అటువంటి మార్పులు తేవడానికి ప్రయత్నించాలి. ''

" మరినువ్వూ నాన్నకు ముఖ్యుడవేగా ? నిన్నుచూస్తే ఆయనలో ఏమార్పూ లేదూ ? ''

'' అవును, కాని, సాయం వేళల్లో అలా వ్యాహ్యాళి పోయిన సమయాలలో ఈ ప్రదేశం తనకు తెలుసునని చెబుతూ గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నించి విఫలులౌతున్నారాయన. అందువలన ఇంత కంటె ముఖ్యమైన వారిని చూస్తే..."

'' ఎవరు ఆ ముఖ్యమైనవారు ? '' ఛటుక్కున అడిగింది జయశ్రీ.

'' ఆయన స్వంత చెల్లెలు—మా అమ్మ ! వెనుక నా హాస్పిటల్‌ను గురించి కూడా ఆయనకు నాకు ముఖ్య సంభాషణ లనేకం జరిగాయి. అందువల్ల 'భాగ్యచక్రం' ఆయన దృష్టిపథంలో పడితే మనిషిలో కదలి కతేలా వుంటాయోకూడ చూడాలి. "

" అలానా, తీసుకువెళ్లు, నీయిష్టం. కాని అత్తయ్య ఒప్పుకుంటుందో లేదో ! ''

" ఛ. అదేం మాట జయా ? మా అమ్మను నువ్వు చాలా తప్పుగా అంచనా వేస్తున్నావు. ఆమెగారి నియమాలు ఆమెవి కాని మీ మీదేమైనా కోపమనుకుని అపోహపడుతున్నావు కాబోలు ! అటువంటిదేమీ లేదు. నీకు అంతగా తెలియక పోవచ్చు కాని, ఏ చదువు సంస్కారంగల స్త్రీ అయినా అమ్మముందు తీసికట్టే. ఆమె అత్యున్నత భావాలు, విశాల హృదయం అద్వితీయాలు. ఆ తల్లి తనయుడనైనందుకు నేను నిజంగా గర్విస్తూంటాను. " అంటూన్న అతడి వదనం ఆనంద జ్యోత్స్న నిలయమై పోయింది.

జయ మాట్లాడకుండా కూర్చున్నది.

తిరిగి శ్రీ నగేష్ అన్నాడు ; " మామయ్యను ఎటూ తీసుకువెళ్తాను. కాని నువ్వుకూడా వస్తే సంతోషిస్తాను. అమ్మకూడా ఆనందిస్తుంది. నీకూ కాస్త కాలక్షేపం, ఆలోచనల మార్పూ అవసరం కదా ! ''


జయశ్రీ మౌనం వహించింది, ఎటూ మాట్లాడకుండా.
కొద్దిసేపు చూచి, లేస్తూ అన్నాడు, '' సరే, ఇక యిప్పుడు కలుసుకోను మామయ్యను. సాయంత్రం వస్తాను, సిద్ధంగా వుండండి.''

(సశేషం)

WHAT'S CHARMINAR GOT THAT NO OTHER INDIAN CIGARETTE HAS?

WORLD CLASS.

THAT'S WHAT!




Among the **world's** top 20 cigarettes, India's billion-seller **has what it takes to give** *real* smoking pleasure. The secret is in its tobaccos. **They're deep brown**...rich. Just like the tobaccos in the world's ten most popular **brands. Remember,** Charminar tobaccos are specially developed. And, triple **matured. They give** every Charminar a flavour that's rich...a taste that's unique. **If you smoke** Charminar, you know what we're talking about. If you don't, **find out for** yourself—*today!*

There's nothing like Charminar—India's greatest cigarette!

A VAZIR SULTAN PRODUCT

ఒంగోలు జాతి పశువులు

ఆంధ్రప్రదేశ్ గర్వకారణం



తరతరాలుగా ఒంగోలు జాతి పశువులు మన దేశంలోనే గాక ప్రపంచమంతటా విస్తరించి, ప్రఖ్యాతి గాంచి ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమై నిలిచాయి.

పందొమ్మిదవ **శతాబ్దంలో** వ్యవసాయం అట్టే లాభదాయకంగా లేక **పోవడం**, విశాలమైన పచ్చిక బయళ్ళుండటమే కాకుండా, వ్యాపారరీత్యా పశుపోషణ లాభదాయకంగా ఉండటమే, ఒంగోలు జాతి పశువులు అంత అభివృద్ధి జెందడానికి ముఖ్య కారణం.

విశేషమేమిటంటే ఒంగోలు జాతి **పశువులు** అటు పని పాటవంలో శక్తి కలిగి **ఉన్నాయి**. ఇటు పాల దిగుబడికూడా సంతృప్తి కరంగా ఉంది. **త్వరగా** ఎదుగగల శక్తి, **ఉష్ణ** ప్రదేశాలలో ఎండకు ఓర్చుకొనగల శక్తితోపాటుగ రోగనిరోధక శక్తి కూడా కలిగి ఉన్నాయి.

ఈ జాతి మొదట బ్రెజిల్, తరువాత **ఫిలిప్పైన్సు**, ఆస్ట్రేలియా, సిలోన్, ఆగ్నేయాసియా, అమెరికా దక్షిణ **ప్రాంతాలకు** వ్యాపించింది. అమెరికాలో "శాంతాగెర్ ట్రూడిస్" బ్రెజిల్‌లో "చార్‌బ్రే" ఫిలిప్పైన్సులో "ఫైలేనమ్" అనే నూతన జాతి పశువులు పెంపొందడానికి కారణమైంది.

ఉనికి:—ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, నెల్లూరు జిల్లాలలోని పాలేరు, గుండ్లకమ్మ ఏఋల మధ్యప్రాంతం; సత్తెనపల్లి, వినుకొండ, నర్సారావుపేట వగైరా ఒంగోలు జాతికి పుట్టినిళ్ళు.

జాతి లక్షణాలు:—పూర్తిగా తెల్లగా ఉంటాయి. మగ పశువులకు మాత్రం బూడిదనలుపుమచ్చలు తల, మెడ, మూపురం, వీపు, మోకాళ్ళమీద కనిపిస్తాయి. **పొడవైన** శరీరం, పొట్టి మెడ, బలంగా, మందంగా శరీరానికి తగ్గట్టుగా ఉంటుంది. మామూలు తల, విశాలమైన నుదురు, పోను పోను ముట్టెదగ్గర సన్నమౌతుంది. తల కొంచెం నిక్కరించి ఠీవిగా కనిపిస్తుంది.

ఒంగోలు జాతికి తొమ్మిది నలుపు గుర్తులు ఉంటాయి. ఇవి ముట్టె, చెవికొనలు, కొమ్ములు, **తోక**కుచ్చు, కనురెప్పలు గిట్టలు, మోకాళ్ళు, మణికట్లు, శేరు వెంట్రుకలవద్ద కనిపిస్తాయి. వెడల్పయిన నాసికా రంధ్రాలతో ముట్టె చాల నల్లగా కనిపిస్తుంది. కొమ్ములు మాత్రం పొట్టిగా ఉండి కొనలు గుండ్రంగా గోపురం మాదిరి ఉంటాయి. పలుచని గంగడోలు ఎదురురొమ్ము వరకు ఉంటుంది. మూపురం గట్టిగా కండతో బాగాపెరిగి ప్రక్కలకు వాలకుండా ఉంటుంది. మూపురం వెనక వీపు చదునుగా ఉండి ప్రక్కటెముకలు బాగా వంపుతిరిగి ఉంటాయి. శేరు అట్టే వ్రేలాడకుండా ఉంటుంది. తోక చాల పెద్దగా కాకుండా కొంకుల వరకు తాకుతూ ఉంటుంది. కొస నల్లకుచ్చుతో ఉంటుంది. గిట్టలు బలంగా ఉండి గిట్టలమధ్య సందు అంతగా కనుపించదు. చర్మం పలుచగా మృదువుగా మెరుస్తూ ఉంటుంది.

బరువు .... 1,200 నుండి 1,500 పౌనులు.


ఎత్తు మూపురం వెనక .... 58 అంగుళాలు.


పొడవు .... 65 ,,

ఛాతి కొలత .... 80 ,,

ఆవులలో బొడ్డుమడత వ్రేలాడుతూ నడుముభాగం వెడల్పుగా ఉంటుంది. పొదుగు బాగా ఎదిగి చనులు సమానదూరంలో ఉండి పాల శిరలు బాగా కనిపిస్తాయి. బరువు 750 నుండి 1,000 పౌనులు ఉంటాయి. ఒక పాడికాలంలో పాల దిగుబడి 2,500 పౌనులు. ఎడ్లు నల్లరేగడి భూములలో వ్యవసాయం పనులకు బాగా పనికి వస్తాయి.

—డాక్టర్ కొండపల్లి మురళీధరరావు.





శ్లో॥ మునిరస్మి: నిరాగసః కుతో మే
భయం: ఇత్యేష న భూతయేఽభిమానః।
పరవృద్ధిషు బద్ధమత్సరాణాం
కిమివ హ్యస్తి దురాత్మనామసాధ్యమ్॥ —భారవి.

"నేను మునిగా నున్నాను, ఏ అపరాధమున్ను చేయనినాకు ఎవరివలన గూడ భయము ఉండదు" అను అభిమానముతో నుండుట ఎంతమంచివారికైనను శ్రేయస్కరము కాదు. ఎందుకనగా, ఇతరులకు గలుగు అభివృద్ధిని చూచి ఓర్వలేనిదురాత్ములు లోకములో నున్నారు. అట్టివారికి ఏదియు అసాధ్యము కాదు. మంచివారికి గూడ నష్టము కలిగించుటకు వారు ప్రయత్నించు చుందు రని భావము.

కం॥ క్షమ లేని తపసితపమును బ్రమత్తుసంపదయు ధర్మబాహ్యప్రభురా
జ్యము భిన్నకుంభమున తోయమునట్టుల యధ్రువంబు లగు నివి యెల్లన్. —నన్నయ భట్టు.

గీ॥ నెరయ రసవంత మగుకృతి కెరగ నేర రల్పరసకృతి కెరగుదు రల్పు లెల్ల;
చెరకు పిడిచిసరసమున కెరగి రాక పిప్పి కెరగెడు నీగలపెల్లు వోలె. —నన్నెచోడుడు.

చ॥ బిసరుహగర్భువ్రాతయును, విష్ణుని చక్రము, వజ్రివజ్రమున్,
దెసలను రామబాణము, యుధిష్ఠిరుకోపము, మౌనిశాపమున్,
మసకపు పాముకాటును, కుమారుని శక్తియు, కాలుదండమున్,
పశుపతికంటిమంటలును, పండితవాక్యము రిత్తవోవునే. —వేములవాడ భీమకవి.

"బ్రహ్మవ్రాత, విష్ణువుచక్రము, ఇంద్రునివజ్రాయుధము, అన్నిదిక్కుల రామబాణము, ధర్మరాజుకోపము, మునీశ్వరునిశాపము, నల్లత్రాచుకాటు, కుమారస్వామియొక్క 'శక్తి' అనుఆయుధము, యమునిదండము, శివునితృతీయ నేత్రమునుండి వెలువడినమంటలు" ఇవి యేవిధముగా వ్యర్థము కావో అలాగే పండితునిమాట కూడ వ్యర్థము కాదు.

మ॥ ఘట దుగ్ధంబులు పేరు గాక వెలయంగా నెంత తోడంటిన
న్నట దుగ్ధాంబుధి పేరునే? జగములో నల్పుండు దుస్సంగతిన్
చటులాత్ముం డగు గాక యెయ్యెడల నీసద్భక్తు డేకార్యము
త్కట మై తాకిన నన్యచిత్తు డగునే? తర్కింప సర్వేశ్వరా! —యథావాక్కుల అన్నమయ్య.

"కడవలోని పాలు తోడు పెట్టినచో పెరుగుగా మారును కాని, యెంత తోడంటు వేసినను పాలసముద్రము పేరి పెరుగగునా? అలాగే అల్పుడు దుష్టునిసాంగత్యముచేత మారి పోవునుగాని ఓ సర్వేశ్వరా! నీ భక్తుడు ఎట్టి దుస్సంగతి అంటినను తన చిత్తమును వేరుగా మార్చుకొనడు"

గీ॥ వేర యొకచోట వల యొగ్గి వేటకాడు, తొలగి యుండి మృగంబుల ద్రుంచుపగిది,
రూపు సూపక శత్రువురూపు గూల్చు టిదియె నయమార్గ మిట్లు జయింప వలయు. —క్షేమేంద్రుడు.

సీ॥ నీరజాకరములు నిష్ఫలమై జేసినభవ్యతపంబులఫలమనంగ,
దివసముఖాభినందితచక్రయుగ్మకబుంలయనురాగంపు ప్రోవనంగ,
హరిహరబ్రహ్మమహానుభావంబు లొక్కటి గాగ గరగినగట్టియనగ,
నతులవేదత్రయలతికాచయము పెను పొంద బుట్టెడుమూలకంద మనగ,

గీ॥ నఖిలజగములకన్నెర యగుచు జనస-
మాజకరపుటహృదయసరోజములకు
ముకుళనంబును జృంభణంబును నొనర్చి
భానుబింబంబు పూర్వాద్రిపై వెలింగె.

—తిక్కన సోమయాజి.

"ఉదయించుసూర్యబింబము, తామరకొలకులు చేసినతపస్సుఫలమో, పగటిచేత సంతసించిన చక్రవాకదంపతుల యనురాగపుప్రోవో, త్రిమూర్తులొక్కటిగా కరగినముద్దయో, వేదత్రయ మనెడులతలకు జన్మకారణమైనమూలకందమో, యనునట్లు ఒప్పుచు, సకలజగంబులకన్నులు తెరచుచు, కరకమలములను ముకుళింప జేసి, హృదయకమలములను వికసింప జేసి తూరుపు కొండపై ప్రకాశించెను.

కం॥ డెందమున దెలిసియును జేయం దెంపరి గాక యుండునాతనితలపో
తం దీరునె యవకార్యము మందెరిగినమాత్ర తెవులు మానుట గలదే॥

—ఆంధ్రభోజుడు.

ఆ వె॥ దర్పణంబు లేక తనమోము గనరాదు,
దానయైన వెన్ను గాన రాదు.
కన్ను లొప్ప నెంత గన నోపు జెప్పడా
యెరుక చూప గాంచు నెల్లయవియు.

—అనంతరాజ కవి.

శా॥ తృష్ణాతంతునిబద్ధబుద్ధు లగురాధేయాదులం గూడి శ్రీ
కృష్ణుం గేవలమర్త్యుగా దలచి మర్దింపంగ నుత్సాహవ
ద్ధిష్ణుం డయ్యె సుయోధనుం డకట ధాత్రీనాథ! యూహింపుమా!
యుష్ణీషంబుగ గట్టవచ్చునె మదవ్యాఘోగ్రకుండాలమున్.

—అథర్వణాచార్యుడు (భారతము)

కం॥ "పతి రుద్రుడు పశువుల" కని
శ్రుతి చెప్పుచు నునికి జేసి "రుద్రుడు పతి త
క్కితరులు పశువులు పో" మ్మని
మతిలో నెరిగితి శ్రుతిప్రమాణమున శివా!

—మల్లికార్జున పండితారాధ్యులు.

కం॥ పెక్కండ్రు జనులు నేరమి
యొక్కట జేసినను వారి నొకమరి గినియం
జిక్కరు గావున నేర్పున
నొక్కొకరిన పాపి శిక్ష యొనరింప దగున్.

—కాకతి ప్రతాపరుద్ర దేవుడు.

కం॥ పరిపూర్ణు డయ్యు పురుషుడు
పరమసుహృత్తులన యాసపడపలయు మదిన్;
పరిపూర్ణు డయ్యు నంబుధి
పరగగ శశిపొడుపు నాసపడదే యెపుడున్.

—పంచతంత్రము.

శరదృతువు.

మ॥ పథికస్త్రీతపవైద్యుతాగ్ని శమియింపన్ మానినీబాష్పసం
గ్రథనీలాంబుదధూమసంతతియు విశ్రాంతిన్ గనెన్; శాంతత
త్పృథువైశ్వానరభస్మరేణుభరముల్ పేర్చన్ సితం బయ్యె నా
గ్రథితాభ్రంబునఁ బాండురాభ్రములు వైరళ్యంబుగాఁ దోఁచెడిన్.

—ఆంధ్రబిల్హణ.

"విరహిణులకు తాపము గలిగించుమెఱపులు అనుఅగ్ని శరత్తులో ఆరిపోవగానే, వారికన్నులందు నీరు గలుగ జేయునీల మేఘములు అనుధూమసంచయములు గూడ శాంతిల్లెను. ఆ ఆరిపోయిన తటిద్వహ్నులతెల్లని బూడిదరాసులో యనునట్లున్న తెల్లని మేఘములు కొన్ని శరత్కాలమునందు ఆకాశములో అచ్చటచ్చట కనపడుచుండెను.

విద్యా ధనం

డా॥ వి. కె. ఆర్. వి. రావు

విద్యఅనేది నిరంతర సంశోధన అని నా అభిప్రాయం. మానవ సంపత్తిలో అదొకవిధమైన పెట్టుబడి అని అనుకోవాలి. ఆర్థికాభివృద్ధితో దానికి సంబంధం వుంటుంది.

విద్యఅనేది ఎప్పుడూ స్వయంపోషకంగా వుండాలనేది గాంధీజీ సిద్ధాంతం. ఆ సిద్ధాంతం ప్రాతిపదికగానే గాంధీజీ బేసిక్ విద్యావిధానాన్ని 1937 లోనే ప్రారంభించారు. విద్యా సంస్థల్ని చిన్నతరహా కర్మాగారాలుగా చేయడం—అంటే శ్రమించి చెమటలుకార్చే కార్మికవాతావరణంలో విద్యను అభ్యసించడం—అనేది కూడదని అప్పట్లో నా అభిప్రాయం. స్వయం పోషకంగా వుండే విద్యావిధానంవల్ల అసలువిద్యయొక్క మూలసూత్రమే దెబ్బ తింటుందనికూడా నేను భావించాను. విద్యార్థుల శ్రమద్వారా ఆర్థిక ఫలితాన్నిపొంది, తద్వారా విద్యకయ్యేఖర్చును కూర్చడమే విద్య లక్ష్యమని భావించే పక్షంలో యిప్పటికీ నా అభిప్రాయంఅదే.

అంటే విద్యకు ఆర్థిక ప్రయోజనంతో ఏమాత్రం సంబంధం వుండకూడదని కాదు. విద్యఅనేది పురోభివృద్ధికి కారణభూతమవ్వాలని మనంచెప్తున్నామంటే అర్థం—విద్యాసంస్థలలో విద్యార్థికి లభించే శిక్షణవల్ల విద్యార్థి ఉత్పత్తి శక్తిని సముపార్జించుకుని, తనవల్ల మరికొంత ఉత్పత్తిని సాధించే స్థితినిచేరుకోవడం అని అనుకోవాలి. నిజానికి లోగడ విద్యలో శిక్షణలేని సమయంలో ఉత్పత్తి చేసినదానికన్నా విద్యవల్ల ప్రయోజనాన్ని పొందిన కారణంగా మరింత ఎక్కువగా ఉత్పత్తి చేయగలిగే స్థితిని చేరుకోవడం అన్నమాట. విద్యా గంధంలేకుండా 'ఎ' అనేవాడు సాధించిన ఉత్పత్తిని, విద్యాగంధంతో కూడిన 'బి' అనేవాడి ఉత్పత్తితో పోల్చితే మొదటిది చాలా తక్కువగా వుంటుంది. ఈ రెండింటికివున్న తేడాయే విద్యయిచ్చే ప్రతిఫలం అనొచ్చు.

విద్యవల్ల సాధించిన అధిక ఉత్పత్తిని ఏవిధంగా కొలవాలి? వివిధ విద్యలను అభ్యసించడంవల్ల స్థూలంగా మనకు అగుపించే ప్రతిఫలాన్ని వివరంగా ఖేరీజువేసి డబ్బు రూపంలో తెలియజెప్పడం కష్టమైన పనే. విద్యార్జనవల్ల సాంకేతిక నైపుణ్యాన్ని సంపాదిస్తామన్నది అందరికీ తెలిసినదే. ఆ సాంకేతిక పరిజ్ఞానంవల్లనే ఉత్పత్తిని అధికం చేయగలిగామని అనుకోవడం పొరపాటు. పరిసరాలు, సాంప్రదాయం, క్రమశిక్షణ, ప్రోత్సాహం, నిర్వహణ సామర్థ్యంవంటి అనేక అంశాలు కూడా లెక్కలోకి తీసుకోవాల్సి వుంటుంది. అందువల్ల కేవలం ఫలానా విషయంలో ఫలానా విద్య యింతప్రయోజనాన్ని సాధించింది అని స్పష్టంగా చెప్పడానికి వీలులేదు.

అయితే సాధారణంగా విద్య అభ్యసించినవారిలో నిరుద్యోగ పరిస్థితి—అది కొద్దిగా గాని, ఎక్కువగాగాని, అప్పుడప్పుడుగాని—లేకుండా వున్నంతకాలం విద్యవల్ల సమకూరే ప్రయోజనం ప్రత్యక్షంగా తెలుస్తూనే వుంటుంది. విద్యనభ్యసించినవారి నిరుద్యోగ పరిస్థితి వల్ల ఆ విద్యపై పెట్టిన పెట్టుబడి స్థూలంగా ఏప్రయోజనాన్నీ కలిగించలేదని స్పష్టపడుతున్నది. అంతమాత్రంచేత విద్య విషయంలో చేసేఖర్చును తగ్గించుకోమని అనడం లేదునేను. ఉత్పాదకశక్తితో సంబంధంలేని, లేదాతగినంతగా సంబంధంలేని విధంగా విద్యా విధానం వున్నదేమోనని ఆలోచించాలి. ఉదాహరణకు భారతీయ విద్యావిధానం యివ్వవలసినంతగా ప్రతిఫలం యివ్వడంలేదనిపిస్తున్నది.

ప్రతిఫలం లెక్కింపు విషయంలో మరోచిక్కు ఎదురవుతుంది. చదువుకున్న వారి ఆదాయాన్ని చదువుకోని వారి ఆదాయంతో పోల్చడం ఒక సమస్యే. ఆస్తులు మొదలయిన వాటిని లెక్కలోకి తీసుకోకుండా ఒక చదువు కున్నవాని ఆదాయాన్ని చదువు కోనివాని ఆదాయాన్ని పోల్చిచూసినప్పుడు చదువుకున్న వారి ఆదాయం చివరకు ఎక్కువగా వుంటుందని తేలుతుంది. స్థూలంగా పరిశీలించినప్పుడు మరో విషయం కూడాతేలుతుంది. వృత్తివిద్య అభ్యాసం, శిక్షణకు అధిక ఆదాయానికి; అదే విధంగా వృత్తివిద్య అభ్యాసం—శిక్షణ లేక పోవడానికి, తక్కువ ఆదాయానికి ప్రత్యక్షమైన సంబంధం వున్నట్టు అర్థమవుతుంది.

నిజానికి వృత్తి విద్య, లేదా ఉత్పత్తికి సంబంధించిన విద్యకూ ఆదాయానికీ మధ్యగల సంబంధం చాలా కేసుల విషయంలో పైన చెప్పిన దానికి భిన్నంగావుంటున్నది. అందువల్లనే పట్టభద్రుడైన గుమాస్తా ఆదాయం మూడు నాలుగు తరగతుల వరకు మాత్రమే చదువుకున్న కొద్దిపాటి నిపుణతగల కార్మికుని ఆదాయం కన్న చాలా తక్కువగా వుండవచ్చు. దీనిని బట్టి ఒక విషయం స్పష్టపడుతున్నది. మన విద్యా విధానాన్ని మరింత ఉత్పాదకశక్తి సమన్వితంగావుండాలిగాని శ్రామికకృషి సమన్వితంగావుండకూడదు.

ఉత్పాదకశక్తి—అంటే కేవలం ఉద్యోగం సంపాదించడమనిగానీ, ఉద్యోగంలో ఎక్కువ జీతం సంపాదించడ మనిగానీ కాదు. మన దేశంలో, చరిత్రాత్మకమైన కారణాలచేత విద్యకు ఉద్యోగ సంపాదనకు ముడి వేయడంజరిగింది. చదువు కోవడం ఉద్యోగంలో చేరడానికే అని భావించబడుతూవచ్చింది. దీనివల్ల వ్యక్తిలో ఒక విధమైన మామూలు జీవితానికి అలవాటు పడే మనస్తత్వం ప్రబలింది. అంతేగాని సాహసంచేద్దామనే ధోరణిగానీ, స్వశక్తిని నమ్ముకునే ఆత్మ విశ్వాసంగానీ, ప్రోత్సాహ మనస్తత్వంగాని ఏర్పడడంలేదు. మన విద్యా విధానం ఈ ధోరణిలో సాగుతోంది. తన జీవిక వెళ్ళబోసుకోవడానికి ఉద్యోగం సంపాదించడం ఒక్కటే మార్గమనే తత్వం విద్య నభ్యసించిన వారిలో నెలకొంటున్నది. తన ఆలోచలద్వారా, వ్యాపారంద్వారా, పట్టుదలద్వారా, కష్టించి పనిచేసే శక్తిద్వారా తనే తనకొక ఉద్యోగాన్నిచూచి పెట్టుకోగలడన్న వం విస్మరింపబడుతున్నది.

ఈ విధమైన ఉద్యోగ—జీతాల ధోరణి వల్ల మన విద్యా విధానం తగినంత ప్రయోజనాన్ని కలిగించ లేక పోతున్నది. మన దేశం ఆర్థికంగా బాగా పురోభివృద్ధి చెందాలంటే వ్యక్తిలో మరింత ప్రోత్సాహాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, చొరవను కలిగించే విధంగా విద్యా విధానంలో మార్పురావాలి. లేకపోతే యీ నాడు యింత

విస్తృతంగా చేపట్ట బడుతున్న యీ విద్యా విధానంవల్ల రానున్న పదీ, పదిహేను సంవత్సరాలలో దేశం తీవ్రమైన నిరుద్యోగ సమస్యను ఎదుర్కొన వలసిన పరిస్థితి ఏర్పడవచ్చు.

తనగురించి తాను పనిచేయడానికీ, యితరులగురించి తాను పని చేయడానికీ చాలాతేడావుంది. ఇతరులగురించి పనిచేసే సందర్భంలో_అంటే జీతానికి పనిచేయడంలో_ఆలోచించడం, చొరవ తీసు కోవడం, నష్టానికికూడా సిద్ధపడడంవంటి బాధ్యతలన్నీ యితరులవే కాని ఆ వ్యక్తివికావు. తన స్వంతానికి సంబంధించిన ఆర్థిక కార్యకలాప అంటే ఒక విధంగా అందులో చొరవా, తెగింపూ, ప్రోత్సాహం, శ్రమావుంటాయి. ఎక్కువ తక్కువలూ, లాభనష్టాలతో కూడిన యీ విధమైన పనికి మామూలు మనస్తత్వం పనికిరాదు. దానికి మరొక రకమైన మనస్తత్వం కావాలి. అది మనలో చాలా మందికి లేదు. అందుకు కారణం_మనం నెల మొదట్లో జీతం తీసుకోవడానికి అలవాటు పడడమే.

ఇది కేవలం మనస్తత్వానికి సంబంధించినది మాత్రమే. మరొకటివుంది. ఒక విద్యార్థి మరింత ఆర్థిక ప్రయోజనాన్ని సాధించడానికి వీలుగా నోట్సు వ్రాసుకోవడానికీ, నిర్ణీతకాలంలో మరింతగా పఠించడానికీ ఆవిద్యార్థిని తీర్చి దిద్దడానికి విద్యలోని సాంకేతిక అంశాన్ని, నైపుణ్యానికి సంబంధించిన అంశాన్ని, వృత్తికి సంబంధించిన అంశాన్ని ఏ విధంగా మెరుగు పరచాలి? అన్నది మరొక ప్రశ్న. విద్యార్థి ఒక పనిలో ప్రేక్షకుడిగా వుండడం కన్న ఆ పనిలో భాగస్వామిగా వుండడంవల్ల ఎక్కువ ప్రయోజనాత్మకంగా వుంటుంది. అందువల్ల విద్యవల్ల వచ్చే ప్రతిఫలాన్ని మెరుగు పరచాలంటే విద్యార్థి విజ్ఞానార్జనా మార్గాలలో స్వయంగా పాల్గొనాలి. చక్కటి విద్యను ఆర్జించడం అనేది ఖరీదైన అంశమే. ఇతరులవద్ద ఉద్యోగానికి కుదరడానికి గాని, తన స్వంతవ్యాపారానికి గాని తోడ్పడే విద్య సర్వసాధారణంగా ఎప్పుడుకూడా కేవలం మామూలు విద్య నేర్చుకోవడంకన్న అధికవ్యయంతో కూడుకున్నదే. వ్యవసాయంలో గాని, పరిశ్రమలలో గాని ఆధునిక పద్ధతుల యొక్క ప్రయోజనాన్ని, ఆధిక్యతను, గుర్తించి అందుకు అవసరమైన నిధులను సమకూర్చడానికి ప్రయత్నంచేసిన ప్రజలు యీ ధోరణిని విద్యారంగానికి కూడా ఎందుకు విస్తరింప జేయరో నాకు అర్థం కావడంలేదు. ఎంత అధికవ్యయంతో కూడిన ఉన్నత విద్యవుంటే పారిశ్రామిక అవసరాలలో అంతగా వస్తు వినియోగాన్ని తగ్గించవచ్చు. విదేశీయ సహాయం లభించే ప్రాజెక్టులలో ఈ విద్యను చేర్చవచ్చు. అయితే విద్యవల్ల ప్రతిఫలం ఎక్కువగా వుండినప్పుడే మానవ మేధా సంపత్తి వికాసం త్వరితగతిని సాగుతుంది. అప్పుడే అది ఆర్థిక ప్రగతికి ఆలంబనమవుతుంది.

ఈ సందర్భంలో ఉపాధ్యాయుని పాత్రను గూర్చి ఆలోచించడం అవసరం. విద్యయొక్క ప్రతిఫలాన్ని నిర్ణయించడంలో ఉపాధ్యాయుడు ఎంతవరకు తోడ్పడతాడన్నది ప్రస్తుతం ఆలోచించ వలసిన విషయం. పని చేయడానికీ. వ్యాపారమో మరొక పెట్టుబడికి సంబధించిన వృత్తో చేయడానికీ అవసరమైన నైపుణ్యాన్ని, తెలివినీ విద్యార్థి సంతరించుకోవడంలో ఉపాధ్యాయుడు ప్రధాన పాత్ర వహిస్తాడు. విద్యార్థికి ప్రయోగశాల, గ్రంథాలయం మొదలయిన వాటి అన్నిటికన్నా ఉపాధ్యాయుని సాంకేతిక పరిజ్ఞానం, అతనిస్వభావం యిక్కడ ఎక్కువగా గణనీయమౌతాయి. అందుచేత ఉపాధ్యాయులకు పుష్కలంగా జీతాలు చెల్లిస్తూవుండాలి. వారికి సమాజంలో గౌరవనీయమైన, ఉన్నతమైన స్థానాన్ని నెలకొల్పాలి. విద్యా విషయాలలో ఒక విధమైన ప్రోత్సాహానికి వీలుగా స్వేచ్ఛను యివ్వాలి. తమవృత్తిలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త విషయాలను గ్రహించడానికి వీలుగా వారికి అవకాశాలను కలిగించాలి.

ఇక్కడ యింకొక విషయాన్ని గూర్చి కూడా ఆలోచించాలి. విద్య వల్ల వచ్చే ప్రతిఫలాన్ని అధికం చేసుకోవచ్చు. లేదా తగ్గించవచ్చు. ఇది విద్యా విధానానికి సంబంధించిన అంశం. మామూలు బోధనకు అలవాటుపడిన విద్యావేత్త ఒకే పద్ధతికి అలవాటు పడిపోతాడు. సిలబసు, పాఠ్య పుస్తకాలు, పని చేయవలసిన గంటలు పాఠ్య క్రమం తదితరవాటికి ప్రాధాన్యత యిస్తుంటాడు. మనలో చాలా మంది అటువంటి వారే. నిజానికి విద్యార్థిలో ఉత్సుకతను కలిగించేవి, అతని తెలివితేటలను మేల్కొల్పేవి ఏవో వాటిని సరిగ్గా ఉపాధ్యాయులు గుర్తిస్తున్నట్టు లేదు. విద్యార్థిలో నిద్రాణమైవున్న తెలివిని ఉపాధ్యాయుడు ఒకసారి గాని మేల్కొల్పగలిగితే ఆ తరువాత ఆ విద్యార్థే మిగతా పని పూర్తి చేసుకుంటాడు. బాగా చదివి, విజ్ఞాన పరిధులను పెంచుకుని, మనసుకు పట్టించుకుంటారు. ఆ విధంగా వారు సముపార్జించు కున్న విజ్ఞానం వారిలో ఒక అంతర్భాగంగా అయిపోతుంది.

చివరగా మరొక అంశంవుంది. విద్యకు సంబంధించిన ఖర్చును గురించి ఆలోచిద్దాం. తగినంతమంది విద్యార్థులు ఆయా శాఖల్ని అభ్యసిస్తున్నారా, వాటి వల్ల ప్రయోజనాన్ని పొందుతున్నరా లేదా అన్న విషయాన్ని ఆలోచించకుండానే ప్రతి కళాశాలా, విద్యా సంస్థ తమ సంస్థలలో ఆయాశాఖల్ని ఏర్పాటు చేస్తున్నట్టనిపిస్తున్నది. ఇలా ఏర్పాటు చేయడం సంస్థకు గౌరవంగా భావించడమే జరుగుతున్నది గాని వాటి ప్రయోజనాన్ని గురించి ఆలోచించడం లేదు. అందువల్ల తగినంత ప్రతిఫలం లేని విషయాలలో ఖర్చు పెరుగుతున్నది. ఖర్చుకుతగ్గట్టు ప్రతి ఫలం రావడంలేదు. సమర్థత కుంటు పడకుండా ఖర్చు తగ్గించే విధానాలను గూర్చి మనం ఆలోచించ వలసి వుంది.

ఆర్థిక ప్రగతి సాధించడానికి మనం పెట్టే పెట్టుబడుల కోవలో విద్యావిషయకమైన ఖర్చు ప్రధాన పాత్ర వహిస్తుంది. అందుచేత విద్య యొక్క పరిధిని—దానిలోని విషయ పరిజ్ఞానం, ప్రయోజన దృక్పధాన్ని —నిర్ణయించడంలో పెట్టుబడి ధోరణి అనేది అంతర్గతంగా యిమిడివుండాలి. ఆర్థిక ప్రగతిని సాధించడానికి బోధన ధోరణినిని కూడా తదనుగుణంగా రూపొందించాలి. ఆర్థిక ప్రగతి వ్యవస్థలో మానవ మేధా సంపత్తి అభివృద్ధియే విద్య యొక్క ప్రధాన లక్ష్యంగావుంటుంది. అటువంటప్పుడే విద్యకూడా ఒక విధంగా పెట్టుబడిగా గుర్తింపబడుతుంది. ఆ విధమైన పెట్టుబడివల్ల సమకూరే గరిష్ఠ ప్రతిఫలం మానవ మేధాసంపత్తి వికాసానికి, తద్వారా ఆర్థిక, సాంఘిక పురోభివృద్ధికీ కారణమవుతుంది.

★

ఉప్పు పరిశ్రమ

శ్రీ గిరిశెట్టి జగన్నాథరావు


ఆంధ్రప్రదేశ్‌లో ఉప్పు ఉత్పత్తి చేయుపరిశ్రమలు ముఖ్యముగా ఇటు శ్రీకాకుళంజిల్లాలోని నౌపడా, హూండీ, కళింగ పట్టణం మొదలు అటు నెల్లూరుజిల్లాలోని ప్రాంతములలో భారీ ఎత్తున ఆంధ్రదేశంలో సుమారుగా 600 మైళ్ళు పొడవుగల సముద్ర ప్రాంతము వున్నదని అందరికి తెలిసినదే. "నౌపడా ఉప్పుగల్లీ నవరుచులకు తల్లీ అనిప్రఖ్యాతి. ముఖ్యముగా కోస్తాజిల్లాలు అయిన ఆరు జిల్లాలలో సుమారుగా 70, 80 లక్షల మణుగులు ఉత్పత్తి అగుచూఉన్నది. అందుకు, ముఖ్యముగా నౌపడాలో తెల్లగాను మల్లె పూవులాగున మెరయునదిగా ఉండును. ముఖ్యముగా శ్రీకాకుళం జిల్లాలో నౌపడా, హూండీ, కళింగపట్నం; విశాఖజిల్లాలో కోనాడ, భీమిలి, బాలిచెరువు, చీపురువల్లి; తూర్పుగోదావరిజిల్లాలో కాకినాడ, పెనుగుజూరు యింకను పశ్చిమ గోదావరి, గుంటూరు, నెల్లూరు జిల్లాలోను ఉప్పు ఉత్పత్తిఅగుచూ ఉన్నది. అందు ముఖ్యముగా ఇతర ప్రాంతములకు రైలుద్వారా, సముద్రము ద్వారాను రవాణా అగుచున్నది. ఉప్పులో చాలారకములు ఉన్నవి. అందులో సముద్రము ఉప్పు (Rock Salt) రాతి ఉప్పు ముఖ్యము. ఉప్పు మనశరీరమునకు చాలా అవసరం. గాలి, నీరు, నిప్పు, వెలుగు ఎట్లా అవసరమో అట్లానే ఉప్పుగూడా అవసరం. అందుచే ఉప్పు లేనిదే ప్రపంచ మానవుడు జీవించలేడు. కాని ఉప్పు పరిశ్రమ కొత్త పద్ధతులద్వారా అభివృద్ధి చేయుట ఇటు కేంద్రప్రభుత్వం అటు రాష్ట్రప్రభుత్వం కలసికట్టుగా నవీన పద్ధతులతో అభివృద్ధిచేయుట చాలా అవసరం. ఉప్పులేనిదే జీవరాశిగూడను బ్రతుకుట దుర్లభము. అందుచే ఉప్పు చాలా ముఖ్యము. ఇకపోతే కొన్ని ప్రాంతములలో ఉప్పును రాళ్ళ లాగున అమ్ముతారు. మరికొన్ని ప్రాంతముల్లో సంచులలో వేసిఉప్పుగడ్డలు పంచదారలాగున గుండగాను మార్కెట్టులలో అమ్ముతారు. ఉప్పుతో తోళ్లు చదునుచేయుటకు, కొబ్బరిమొక్కల గోతిలోవేసి మట్టిపోసితే (ఎర్రమట్టి) అవి ఏపుగా ఎదుగుటకు చాలా ఉపయోగం. ఎక్కువ కాయలుకాయుటకు చాలాఅనుకూలము గూడాను. జంతువులకుగూడా ఉప్పు ముఖ్య ఆహారము. కొన్ని జంతువులు కొండలలోని చలి ప్రాంతములలో ఉప్పు పసిగట్టి నాకుతాయి. పూర్వం ఉప్పు మూటలు చాలా దూరము మోసుకొని పోయెడివారు. రవాణా సౌకర్యములు వచ్చినతరువాత ఆ అలజడి తగ్గినది. ఉప్పుతో ఎరువులు, సబ్బులు, తెల్ల సిమెంటు, చాకలి సోడా మొదలగునవి పరిశ్రమచేయుటకు మిక్కిలి ఉపయోగముగా నుండును. సముద్రపు ఇసుకతో గాజు తయారుచేయుటకు చాలా అనుకూలముగా ఉండును. ఉప్పు అన్ని పదార్థములకు రుచి ప్రాణులకు ఆరోగ్యము ఇస్తుంది. ఉప్పులో ఇంకను చెరువు ఉప్పు, నేల ఉప్పుగూడ ఉండును. ఉప్పు భారీ పరిశ్రమగా చేయుట చాలా అవసరం. భారతదేశంలో ఒరిస్సా, మద్రాస్, బొంబాయి, ఆంధ్ర, కేరళ, మైసూర్, బెంగాల్, మొదలగుచోట్ల ఉప్పు తయారు అగుచున్నది. సాంబర్‌లో గూడను రాతి ఉప్పు ద్వారాను ఉత్పత్తి అగుచున్నది. మద్రాస్, బొంబాయిలలో ప్రయివేటు వర్తకులే ఉప్పు ఉత్పత్తి చేయుచున్నారు. మన ఆంధ్రదేశంలో కూడా హెచ్చు భాగం స్వంత లైసెన్సుదారులే ఉప్పు పండించుచున్నారు. భారతదేశంలో 20% ప్రభుత్వం ద్వారా మిగతా 80% స్వంత లైసెన్సుద్వారా ఉత్పత్తి అగుచున్నది. సహకార సంఘములద్వారా 100 ఎకరములు ఒక మడిగాచేయుట ఉన్నది. ఇటు ప్రభుత్వమునకు అటు ప్రజలకు కొత్తపద్ధతులు కల్పించి రిజర్వాయిర్‌ద్వారాను నీరు సరఫరా పుష్కలముగా అందునట్లు చేయాలి. ఆంధ్రఉప్పు ముఖ్యముగా ఒరిస్సా, బెంగాల్, మధ్యప్రదేశ్, బీహార్ మొదలగు ప్రాంతములకు రవాణా అగును. మద్రాస్‌లో కూటికూరన్ మంచి ఉచ్చస్థితిలో ఉన్నది. ఆంధ్రలో నౌపడాలో తయారగు ఉప్పుకు కొత్త పద్ధతులు కల్పించిన చాలా మెరుగుపడును. నౌపడాలో, కంకరపల్లిలో అనుకొనియున్న 5 వేల ఎకరముల ప్రాంతములో సోడాయాష్ప్లాటు-నెలకొల్పుట చాలా ముఖ్య అవసరం. శ్రీకాకుళం జిల్లాలో పరిశ్రమలు చాలా తక్కువ. అందులో నౌపడా స్థితిని, రాష్ట్రముగాని, కేంద్రముగాని అభివృద్ధి పరచాలి. ఉప్పులో అయోడిన్ కలిపి మందు లాంటి ఉప్పు తయారు చేయటానికి సాంబారువద్ద ఒక యంత్రము ఏర్పాటు చేసారు. అయోడిన్ అనే పదార్థము లేకపోతే రక్తానికి, శరీరానికి చర్మానికి సంబంధించిన జబ్బులు వస్తాయి. ఈలాంటి జబ్బులు పంజాబు, ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా యున్నవి. అయోడిన్ ఆ ప్రాంతముల వారికి తక్కువ ధరకు సరఫరా ఎక్కువ అక్కరలోఉన్నది. త్వరలోనే మిత్రరాజ్య సమితి (ఐక్యరాజ్య సమితి) కి చెందిన సంక్షేమ సంఘం యాజమాన్యం క్రింద మరికొన్ని యంత్రాలు ఇప్పించి, సాంబార్ సరస్సువద్ద, నౌపడావద్ద (ఆంధ్రలో) నెలకొల్పితే రోగనివారణ అగుటకు సందేహములేదు.


అమెరికా, బ్రిటన్, రష్యా ప్రాంతములతో పోల్చిచూస్తే మన ఉప్పుధర చాలా తక్కువ, రైతుకు గిట్టుబాటు దరలేదు.

ఉప్పు కార్మికుడు రోజురోజుకు ఆర్థిక యిబ్బందితో కుమిలి పోతున్నాడు. Bank of Salt సౌకర్యాలు, ఆంధ్రలో వున్న ఉప్పు ప్రాంతములందు నెలకొల్పకున్నట్లయితే ఇటు లైసెన్సుదారులకు, రైతులకు, చిన్న వ్యాపారము చేయువారికి, లాభము. కాన సత్వరము Salt Banks ఏర్పాటు చేయుట ప్రజాప్రభుత్వ ధర్మం. ఉప్పును ఎక్కువగా శాస్త్రీయ పద్ధతుల మీద అభివృద్ధిచేసి మనము ఇటు దేశ దేశములకు సరఫరాచేయవచ్చు అవసరంగదా. అందుచే నవీన పద్ధతులు నెలకొల్పండి. మన దేశములో ఎక్కువభాగము ఉప్పు ఎండవేడిమికి ఆర్పి తయారు చేస్తున్నదేగదా. అది బాగాశుద్ధిచేసి పరిశ్రమలకు పనికివచ్చు విధముగా

చేయుట అవసరం. ఇచ్చట కార్మిక జీవులకు ఉప్పు ఉత్పత్తి చేయుటకు వీలుకలుగుటలేదు. ఎందుచేతనంటే వారికి విజ్ఞానము, ఆకలి రెండు ఎదురైయున్నవి. సహకారసంఘములు నౌపడాలో లేవు. ఉన్నప్పటికి పెకిలించివేయుటకు, గట్లువేయుటకు, కూపస్థమండూకములువలె, వెనుదిరుగుచుందురు. అట్టివారిని కఠినముగా శిక్షించుట మంచిది. అప్పుడుగాని ఉప్పు పరిశ్రమ బాగుపడదేమోఅని నాయొక్క నమ్మకం. ముఖ్యముగా సహకార సంఘములు స్థాపించిన బాగుపడును. నౌపడా ఉప్పు లైసెన్సు యుండెడిది. అదియున్ను వర్తకులకు చాలా నష్టము అని ఊతబెరికించినారు. 1948 సం॥ స్థాపించినది 1954 సం॥ అంతమయినది. ఆంధ్రదేశంలో సుమారుగా 16 వేల ఎకరములు ఉప్పు ప్రాంతముగాయున్నది. దీనిలో 20,25 Salt Factories యున్నవి. వీనిలో 1,995 మంది లైసెన్సుదారులు యున్నట్లు అంచనా.

ఆంధ్రప్రదేశ్ జనాభా సుమారుగా 3 కోట్ల 68 లక్షలుగా యున్నది. సుమారు నాలుగు కోట్లు కాన వారికి సరైన న్యాయముగా పరిశ్రమలు జిల్లాలవారిగా గ్రామస్థాయి మొ॥ నెలకొల్పుట చాలా అవసరం. యూరోపు దేశము నవీన పద్ధతులలో ఎంతయో ముందుకుపోయినది. స్వాతంత్ర్యం సంపాదించి 18 సం॥లు అయినను ఇంకను శ్రీకాకుళం జిల్లా అందులో నౌపడా ప్రాంతము అభివృద్ధిలేక కుంటుపడి యున్నదనుటకు అతిశయోక్తి లేదు. జపాను బృందం 3 మాసముల క్రితము Soda Ash Plant కోసం నౌపడా — కాకరపల్లి చూచి వెళ్ళినది. గాన సత్వరం నౌపడాలో నెలకొల్పునట్లు Soda Ash Plant చతుర్థ పంచవర్ష ప్రణాళికలో యుండునట్లు చేయుట ఎంతయో అవసరం. ★




Regd. No. H. 133